అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 08-02-2019 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 41 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

15 మంది ఎన్‌కౌంటర్

దండకారణ్యంలో మావోయిస్టుల హతం

- 11 తుపాకులు, మందుగుండు స్వాధీనం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం





(ఫైల్)

నవతెలంగాణ- భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ దండకారణ్యం ప్రాంతం మరోమారు తుపాకుల మోతతో దద్దరిల్లింది. గురువారం మావోయిస్టులకు, భద్రతాదళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 15మంది మావోయిస్టులు మృతిచెందారని ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి తామ్రధ్వజ్ సాహు తెలిపారు. సుమారు గంటసేపు జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయి స్టులు చనిపోగా పది మృతదేహాలు లభించాయి. మరో ఐదుగురు చనిపోయి ఉంటారని పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ ఎస్పీ మోహిత్ గార్గ్ ధ్రువీకరించారు. ఘటనకు సంబంధించి డీఐజీ సుందర రాజన్ ప్రాథమిక సమాచారం వివరించారు. భైరాంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు భద్రతా దళాలకు సమాచారం అందింది. ఇంద్రావతి నది సమీపంలోని అబూజ్‌మడ్ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ సిబ్బంది గురువారం ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. తాకీలోద్ రీజియన్ పరిధిలోని ఇంద్రావతి నది ఉత్తర భాగాన గల మాడ్ అటవీ ప్రాంతంలో సాయుధంగా అంబుష్ వేసిన మావోయిస్టులు ఆ సమయంలో జవాన్లపై మెరుపుదాడి చేశారు. దీంతో భద్రతా దళాలు అప్రమత్తమై ఎదురు కాల్పులు జరిపాయి. సుమారు గంట సేపు ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 15మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఘటనా స్థలం నుంచి 11 తుపాకులు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఇంకా మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతులను గుర్తించాల్సి ఉంది. ఇంకా మృతదేహాలను అటవీప్రాంతం నుంచి తరలించలేదు.

మా ఆదేశాలతోనే ఆటలా?

షెల్టర్ హోం కేసులో అధికారి బదిలీ ధిక్కారమే

సీబీఐ మాజీ చీఫ్ నాగేశ్వర్‌రావుపై సుప్రీం ఆగ్రహం

- ఈనెల 12న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం

న్యూఢిల్లీ: 'మేమిచ్చిన ఆదేశాలతో ఆడుకున్నారు. ఇప్పుడు మిమ్మల్ని ఎవ్వరూ కాపాడలేరు' అంటూ సీబీఐ మాజీ తాత్కాలిక చీఫ్ నాగేశ్వరరావుపై భారత సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లోని షెల్టర్ హోంలో బాలికలపై లైంగికదాడి కేసు విచారణ చేస్తున్న సీబీఐ సీనియర్ అధికారి ఎ.కె. శర్మను బదిలీ చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఇది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుందని సుప్రీంకోర్టు ప్రాథమికంగా నిర్ధారణకొచ్చింది. నాగేశ్వర్‌రావు.. ఈనెల 12న కోర్టు ముందు హాజరుకావాలని చీఫ్ జస్టిస్ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం సమన్లు జారీ చేసింది. తమ ...9లో





ఇద్దరిపై వేటు.. ఇద్దరికి ప్రమోషన్

ఆస్తానా కేంద్రంగా సీబీఐలో కదలిక !

వివరాలు 9లో



వేతన సమస్యను పరిష్కరించండి

కలెక్టరేట్‌ల ఎదుట ఆశాల ధర్నా

- సమాన పనికి సమాన వేతనం కోసం డిమాండ్
- ఎన్‌సీడీ సర్వేకూ పారితోషికం..



నవతెలంగాణ-యంత్రాంగం

పెండింగ్‌లో ఉన్న వేతనాలు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనమివ్వాలని ఆశాకార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌ల ఎదుట తెలంగాణ వాలంటరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (సీఐటీయూ) యూనియన్ ఆధ్వర్యంలో ఆశాలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని తప్పుబట్టారు. సరైన వేతనాలు ఇవ్వకుండా పారితోషికాలతో పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలనీ, ఆశాల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలనీ డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట కూడా ...9లో

సిర్పూరు పేపర్ మిల్లు పునఃప్రారంభం

ఏడో నెంబర్ యంత్రం ద్వారా పేపర్ ఉత్పత్తి



వివరాలు 9లో

14.40 లక్షల ఎకరాలకు ఎస్సారెస్పీ నీరు

వర్షాకాలంలో మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నీటి తరలింపు

ప్రజా ప్రతినిధుల సమావేశంలో సీఎం కేసీఆర్

- పనులు వేగవంతానికి అధికారులకు ఆదేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 14.40 లక్షల ఎకరాలకు ఈ ఏడాది నుంచే సాగునీరు అందిస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ప్రజాప్రతినిధులతో గురువారం ప్రగతి భవన్‌లో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీ నీటిని సకాలంలో అందించటానికి జూన్ నాటికే కాల్వలు, తూముల నిర్మాణం, లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజి నుంచి ఈ వర్షాకాలంలో నీటిని ఎత్తిపోయడం ప్రారంభమవుతుందని ఆ నీటిని మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యాములకు తరలిస్తామన్నారు. ఈ రెండు డ్యాముల్లో కలిపి 50 టిఎంసిల నిల్వ సామర్థ్యం ఉంటుందని, ఆ నీటితో ఎస్సారెస్పీ . కాల్వల ద్వారా అన్ని చెరువులను నింపాలని ఆదేశించారు. 'ప్రాజెక్టుల ద్వారా నీళ్లొస్తున్నాయి. పనులు చేయడానికి నిధులిస్తున్నాం, అయినా పంట పొలాలకు నీరందించకుంటే పాపం చేసిన వారమవుతాం' అని సీఎం వ్యాఖ్యానించారు. ఎస్సారెస్పీ పరిధిలోని మొత్తం ఆయకట్టుకు నీరందించడానికి అనుసరించాల్సిన వ్యూహంపై ...9లో

దళిత బిడ్డకు ప్రపంచ గుర్తింపు

అంతర్జాతీయ టాలెంట్ షోకు సూర్యాపేట వాసి

నవతెలంగాణ-సూర్యాపేట



లాస్ ఏంజెల్స్‌లో ఈనెల 9 నుంచి 12వ తేదీల్లో జరిగే అంతర్జాతీయ టాలెంట్ షోకు సూర్యాపేటకు చెందిన ఫణికర క్రాంతి ఎంపికయ్యాడు. పూర్వ నల్లగొండ జిల్లా అడ్డగుడూర్ పేదింటి దళిత కుటుంబానికి చెందిన కాంత్రి తండ్రి మెస్త్రీ, తల్లి కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. సూర్యాపేటలో ...9లో

తండ్రి ముందే కూతురిపై..

దాహం వేస్తుందని వచ్చి అఘాయిత్యం

- బీహార్‌లో దారుణం



పాట్నా: బీహార్‌లో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. తండ్రి కండ్ల ముందే19ఏండ్ల కూతురిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోదోవాడి ...9లో

రాజ్యాంగ వ్యవస్థలపై కేంద్రం దాడి

సంస్థలపై బీజేపీకి గౌరవం లేదు

- రైతులకు రోజుకు 17 రూపాయలా ?
- రాఫెల్‌పై జేపీసీ ఏది: లోక్‌సభలో ప్రతిపక్షాలు ఆగ్రహం 2లో



మద్దతు ధర కోసం ఆందోళన

ఆర్మూర్‌లో ఐదు గంటలపాటు రాస్తారోకో

- పసుపునకు రూ.10వేలు
- ఎర్రజొన్నలకు 3500 ప్రకటించాలని డిమాండ్



నవతెలంగాణ- ఆర్మూర్

పసుపు, ఎర్రజొన్నలకు మద్దతు పెంచి తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రైతులు ఆందోళనబాట పట్టారు. పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై గురువారం ఐదు గంటలు బైటాయించారు. పసుపు క్వింటాలుకు రూ.10వేలు, ఎర్రజొన్నలకు రూ.3,500 మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. పసుపుబోర్డును, పసుపు ఉడకబెట్టేందుకు ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది కూడా ఇదే మాదిరి రైతులు ఆందోళన బాటపట్టిన విషయం విదితమే.

జిల్లాలో అత్యధికంగా ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో పసుపు పంటను సాగుచేస్తున్న దృష్ట్యా ప్రభుత్వం వెంటనే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న పసుపు పార్క్‌కు ...9లో

అంతా మోడీ చేశారు..?

ఆర్థిక కష్టాల్లో ఉన్న అనిల్ అంబానీ కోసమే..

- రాఫెల్ డీల్, ధర
- ఫ్రాన్స్ కంపెనీకి భాగస్వామిగా భారత కంపెనీ ఎంపిక
- చర్చల్లో అజిత్ దోవల్, ఆసక్తి చూపిన అమిత్‌షా

రాఫెల్ యుద్ధవిమానాల కోనుగోలు విషయంలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ప్రధాని మోడీ చెబుతున్నా...ఆర్థిక కష్టాల్లో ఉన్న తన స్నేహితుడు రిలయన్స్ సంస్థ అధినేత అనిల్‌అంబానీ కోసమే అధికారాన్ని ఉపయోగించారన్న వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. రాఫెల్ డీల్,ధరతో పాటు ఫ్రాన్స్ కు చెందిన దసాల్ట్ సంస్థకు భాగస్వామిగా భారత కంపెనీ ఎంపికనూ సూచించినట్టు తాజాగా మరిన్ని ఆధారాలు వెలుగుచూశాయి.

న్యూఢిల్లీ: ఫ్రాన్స్ నుంచి 36 రాఫెల్ యుద్ధ విమానాలను ఫ్లయ్ అవే కండీషన్‌లో కొనుగోలు చేయనున్నట్టు 2015,ఏప్రిల్ 10న ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాని మోడీ ఈ డీల్ గురించి ఏకపక్షంగా ప్రకటించడమేకాదు, ధర విషయంలోనూ స్వీయ ...9లో



బీజేపీ మీటింగ్.. హెల్మెట్లతో జర్నలిస్టులు



రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన జర్నలిస్టులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సమావేశానికి జర్నలిస్టులు తలకు హెల్మెట్లు ధరించి తమ విధి నిర్వహణలో భాగంగా హాజరయ్యారు. గత వారం బీజేపీ మీడియా సమావేశానికి హాజరైన ఒక విలేకరిపై ఆ పార్టీ మద్దతుదారులు దాడి చేయడంతో వారు ఈవిధంగా నిర్ణయం తీసుకున్నారు. తాము ఒక సందేశాన్ని బీజేపీ చేరేలా ఇటువంటి నిరసనకు దిగామని జర్నలిస్టులు తెలిపారు. అదేవిధంగా మరోసారి దాడి చేస్తే హానీ జరగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. గత శనివారం ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న ద వాయిసెస్ జర్నలిస్టు సుమన్ పాండేపై జిల్లా స్థాయికి చెందిన బీజేపీ నేతలు దాడి చేశారు. ఈ ఘటనలో అతడి తలకి గాయమైంది. దీంతో రాయ్‌పూర్ పార్టీ చీఫ్ రాజీవ్ అగర్వాల్‌తో సహా నలుగురిపై జరల్నిస్టులు ఫిర్యాదు చేశారు. గాయపడ్డ విలేకరి తెలిపిన వివరాల ప్రకారం 'సమావేశాన్ని మేం ఫోన్లలో రికార్డు చేస్తుండగా... కొందరు బీజేపీ నేతల మధ్య ఏదో విషయమై వాగ్వాదం జరిగింది.

వందేమాతరం ఆలపించనందుకు...

ముస్లీం ఉపాధ్యాయునిపై దాడి

పాట్నా: గణతంత్ర దినోత్సవం రోజున పతాకావిష్కరణ అనంతరం వందేమాతరం పాడటానికి ఓ ముస్లిం ఉపాధ్యాయుడు ఒప్పుకోలేదు. దీంతో కొందరు స్థానికులు అతనిపై దాడికి దిగారు. దీన్ని ఓ వ్యక్తి వీడియోలో చిత్రీకరించాడు. కాగా ఇప్పుడు ఆ వీడియో వైరల్ కావడంతో దాడిగురించి బాధితుడు అఫ్జల్ హుస్సేన్ వివరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తాను స్థానిక పాఠశాలలో పనిచేస్తున్నాని తెలిపాడు. వందేమాతరం పాడటమన్నది తమ మతవిశ్వాసాలకు వ్యతిరేకమని వెల్లడించాడు. వందేమాతరం ఖచ్చితంగా పాడాలని ఎక్కడా రాసిలేదని అన్నారు. అందుకే ఆలాపించడానికి నిరాకరించానని చెప్పారు. కాగా వందేమాతరం పాడటానికి నిరాకరించడంతో తనపై స్థానికులు దాడికి దిగారని ఆయన తెలిపారు. ఈ దాడిలో తాను చనిపోయి ఉండేవాడినని వాపోయాడు. కాగా ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని అధికారులు తెలిపారు.

కన్యత్వాన్ని పరీక్షించడం నేరం!

- త్వరలో సర్క్యులర్

ముంబయి : కన్యత్వ పరీక్ష కోసం మహిళలను బలవంతం చేయడాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం నేరంగా పరిగణించనుంది. ఈ మేరకు రాష్ట్ర మంత్రి రంజిత్ పాటిల్ బుధవారం వెల్లడించారు. రాష్ట్రంలోని కొన్ని కమ్యూనిటీలు.. నూతన వధువు పెండ్లికి ముందు కన్య(వర్జిన్)గానే ఉన్నదని తేల్చేందుకు ఆమెపై పరీక్షలు జరిపే సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి. ఈ అంశంపై సామాజిక సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర హోం మంత్రి రంజిత్ పాటిల్ బుధవారం సమావేశమయ్యారు. ఈ వర్జినిటీ టెస్ట్‌ను లైంగికదాడి రూపంగానే భావించనున్నట్టు సమావేశానంతరం మంత్రి తెలిపారు. న్యాయ శాఖతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ పరీక్షను శిక్షార్హమైన నేరంగా ప్రకటిస్తూ సర్క్యులర్‌ను జారీ చేయనున్నట్టు వివరించారు. మహారాష్ట్రలోని కంజర్‌బట్ సహా పలువర్గాలు ఈ అభ్యంతరకర సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి. కాగా, మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గ్రాడ్యుయేట్లకే టికెట్టు ఇవ్వాలి

- మార్గదర్శకాలివ్వాలని సుప్రీంలో వ్యాజ్యం

న్యూఢిల్లీ : డిగ్రీ పట్టా పొంది, 75 ఏండ్లలోపు(ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి) వయసుగలవారికే రాజకీయపార్టీలు టికెట్టు ఇచ్చేలా మరదర్శకాలు ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టులో మంగళవారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ విజ్ఞప్తితోపాటు నేరపూరిత కేసుల్లో నిందితులుగా ఉన్న చట్టసభ్యులను విచారించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్న ఈ వ్యాజ్యాన్ని సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం సీజ్ చేసింది. చట్టసభ్యుల(ఎమ్మెల్యేలు, ఎంపీలు) విధులు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైనవని, అయితే మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ ప్రధాన్‌ల కన్నా వారు ఎందుకు తక్కువ విద్యార్హతలు కలిగిఉండాలని ఈ వ్యాజ్యంలో న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ ప్రశ్నించారు. చాలా రాష్ట్రాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ ప్రధాన్ల కోసం నిరక్షరాస్యులను పరిగణనలోకి తీసుకోరని వివరించారు. చట్టాలను, రాజ్యాంగాన్ని సవరించేవారు విద్యావంతులు కాకుంటే ప్రమాదమేనని ఈ మధ్యంతర వ్యాజ్యంలో తెలిపారు.

ఆ ఇల్లు ఖాళీ చేయండి

- ఎంపీలో లైంగికదాడి బాధితురాలి కుటుంబానికి అధికారుల ఆదేశం

ఇండోర్ : మధ్యప్రదేశ్‌లోని మందసోర్‌లో లైంగికదాడికి గురైన ఎనిమిదేండ్ల బాలిక కుటుంబానికి ఇండోర్‌లో ఇల్లు, ఒక షాప్‌ను గత బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే దీనిపై అప్పటి ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేయలేదని ఆ ఇల్లు ఖాళీ చేయాల్సిందిగా సదరు కుటుంబాన్ని ఇండోర్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఐడీఏ) బుధవారం ఆదేశించింది. గతేడాది జూన్‌లో మందసోర్‌లో చిన్నారిపై ఇద్దరు దుండగులు లైంగికదాడికి ఒడిగట్టిన ఘటన రాష్ట్రంలో దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీంతో అప్పటి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వం ఆ కుటుంబానికి ఇండోర్‌లో నివాసముండేందుకు ఒక ఇల్లు, ఒక షాపుతో పాటు బాధిత చిన్నారి, ఆమె ఇద్దరు తోబుట్టువులకు పేరొందిన పాఠశాలలో చేర్పించింది. అయితే అధికారిక ఆదేశాలు జారీ చేయకుండా ఒక ఇల్లును వేరొకరికి అప్పగించలేమని ఐడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్‌ఎల్ మహజన్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ స్థానంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడినప్పుడే తాము తిరిగి మందసోర్ వెళ్లిపోవాల్సి ఉంటుందని చాలా మంది చెప్పినట్టుగానే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని బాధిత చిన్నారి తండ్రి వాపోయారు.

గూగుల్‌లో 'స్వైన్ ఫ్లూ' సెర్చ్

- అంతకంతకూ పెరుగుతున్న శోధనలు

న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా 6,601 స్వైన్‌ఫ్లూ కేసులు(ఈ నెల3వరకు) నమోదయ్యాయి. స్వైన్ ఫ్లూ కేసుల సంఖ్య పెరిగిపోతుండటంతో ప్రజల్లో భయాందోళనలు కలుగుతున్నాయి. దీనితో ముందుజాగ్రత్తగా వ్యాధి గురించి తెలుసుకోవడానికి ప్రముఖ సెర్చ్ ఇంజన్ గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా స్వైన్‌ఫ్లూపై నెటిజన్ల శోధనల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నది. ఈ విషయంలో ఉత్తర, వాయువ్య భారత్ ముందు వరుసలో ఉన్నది. 2014-19 మధ్య స్వైన్‌ఫ్లూ గురించి సెర్చ్ చేసేవారి సంఖ్య పెరిగిపోయింది. ప్రధానంగా 2015లో ఫిబ్రవరి15-21 మధ్య శోధనల సంఖ్య పెరిగింది. కాగా 2016-19 మధ్య పరిశీలిస్తే శోధనల్లో 2017, 2019, 2018లు వరుసగా మూడు స్థానాల్లో నిలిచాయి. గతనెల 17న బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా స్వైన్‌ఫ్లూ సోకడంతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరనున్నారన్న సమాచారంతో శోధనలు పెరిగి 30వరకు కొనసాగుతూ వచ్చాయి. సెర్చ్ విషయంలో దేశంలో పంజాబ్ మొదటి స్థానంలో ఉన్నది. అత్యధిక స్వైన్‌ఫ్లూ కేసులు నమోదైన రాజస్థాన్ మాత్రం ఐదో స్థానంలో నిలిచింది. కాగా స్వైన్ ఫ్లూ సమాచారం కోసం ప్రజలు వివిధ పదాలతో సెర్చ్ చేస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా గూగుల్ ట్రెండ్స్ ప్రకారం టాప్ 5 సెర్చ్‌ల్లో స్వైన్‌ఫ్లూ, స్వైన్ ఫ్లూ లక్షణాలు, హిందీలో స్వైన్‌ఫ్లూ లక్షణాలు అనే పదాలు నిలిచాయి.

అధికారంలోకి వస్తే 'త్రిపుల్ తలాక్' చట్టం రద్దు

న్యూఢిల్లీ : వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తమ పార్టీ విజయం సాధిస్తే త్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షులు సుస్మితా దేవ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సమక్షంలో నిర్వహించిన ఏఐసీసీ మైనారిటీస్ సదస్సులో ఆమె మాట్లాడుతూ ముస్లిం మహిళల సాధికారత కోసం త్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టలేదనీ, ఈ బిల్లు ఉద్దేశం ముస్లిం పురుషులను శిక్షించడమేననీ అన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలపై కేంద్రం దాడి





సంస్థలపై బీజేపీకి గౌరవం లేదు

- రైతులకు 17 రూపాయలా ?
- నల్లధనం వివరాలేవీ?
- రాఫెల్‌పై జేపీసీ ఎందుకు వేయటం లేదు
- లోక్‌సభలో ప్రతిపక్షాల ఆగ్రహం

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ వ్యవస్థలపై దాడిని మోడీ సర్కార్ తీవ్ర తరం చేసిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. రైతులకు కేవలం రూ.17 ఇచ్చి అవమానించారని మండిపడ్డాయి. నాలుగున్నరేండ్ల మోడీ సర్కార్ పాలనలో దేశ ప్రజలు మోసపోయారని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీకి తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురువారం నాడు లోక్‌సభలో "రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం"పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. 'రాజ్యాంగబద్ధ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నది. బీజేపీకి దేశంలోని వ్యవస్థల పట్ల గౌరవం లేదు. దేశంలోని పేద ప్రజలు తమ గళాన్ని విప్పకుండా అణచివేసే ధోరణితో వ్యవహరిస్తున్నది. మనది ప్రజాస్వామ్య, లౌకికవాద, గణతంత్ర దేశం. ఎన్డీఏ ప్రభుత్వం వీటికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. వెనుకబడిన తరగతుల వారి రిజర్వేషన్లను కూడా తొలగించాలని భావిస్తోంది. న్యాయ వ్యవస్థ, ఆర్బీఐ, నీతి ఆయోగ్, ఎన్ఎస్ఎస్ఓ, సీబీఐ, ఈడీ సీవీసీ వంటి సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నది' అని ఖర్గే విమర్శించారు. మోడీ ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతుండడంతో దాన్ని కప్పిపుచ్చేలా పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం వుందని ఆయన వ్యాఖ్యానించారు. 'ప్రభుత్వం జీడీపీ వృద్ధి చెందుతోందని చెప్పుకుంటోంది. మరి దేశంలో నిరుద్యోగ సమస్య ఇంత తీవ్రంగా ఎందుకు ఉంది? పెద్దనోట్ల రద్దు సమయంలో ప్రభుత్వం అనేక హామీలు గుప్పించింది. దేశానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పింది. కానీ, నోట్ల రద్దు వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధనవంతులకు మాత్రం ఎటువంటి సమస్యలు ఎదురుకాలేదు' అని ఖర్గే ధ్వజమెత్తారు. నోట్ల రద్దు వ్యవస్థీకృత, చట్టబద్ధ దోపిడి అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా అన్నారని, అరవింద్ సుబ్రహ్మణ్యం, అమర్త్యసేన్ వంటి ఆర్థికవేత్తలు కూడా పెద్దనోట్ల రద్దుని విమర్శించారని చెప్పారు. 'రద్దయిన నోట్లలో 99.9 శాతం వెనక్కువచ్చాయని ఆర్బీఐ చెబుతోంది. మరి నల్లధనం గురించి వివరాలు ఎందుకు చెప్పడంలేదు' అని నిలదీశారు. 'రాఫెల్ ఒప్పందం విషయంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాల్సిందే. ఈ ఒప్పందంపై సుప్రీం కోర్టుకి కేంద్ర ప్రభుత్వం తప్పుడు వివరాలు అందించింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోడీ హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చట్లేదు. ధనవంతుల రుణాలను మాత్రం మాఫీ చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారు' అని ఖర్గే విమర్శించారు.

కాంగ్రెస్ ముక్తి భారత్ ఆలోచన గాంధీదే: ప్రధాని మోడీ

కాంగ్రెస్ ముక్తి భారత్ ఆలోచన మహాత్మ గాంధీదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, మహా కూటమితో దేశ ప్రజలకు ఒరిగేదేమీలేదని, కూటమి నేతలు కనీసం ఒకరినొకరు చూసుకునే పరిస్థితి లేదని అన్నారు. కలకత్తా వేదికగా కలిసిన మహా కూటమిని "మహా కల్తీ"గా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ 55 ఏండ్లలో చేయలేని అభివృద్ధిని తాము 55 నెలల్లో చేసి చూపామన్నారు. గత యూపీఏ హయాంలో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఎన్నడూ అమలు చేయలేదని ఆరోపించారు. నెహ్రూ, ఇందిర హయాంలో కేరళ, బెంగాల్‌లో హక్కులను కాలరాశారని, ఆర్టికల్ 352ను కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సార్లు ప్రయోగించిందని అన్నారు. కేరళలో మొట్టమొదట కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోసిందని, ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూడా అలాగే కూలదోశారని విమర్శించారు. తమ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయని, 'మోడీని విమర్శించే క్రమంలో దేశాన్ని ద్వేషిస్తున్నార'ని అన్నారు. న్యాయ వ్యవస్థలో మేం జోక్యం చేసుకోవడం లేదని, న్యాయ వ్యవస్థను భయపెట్టేలా కాంగ్రెస్ పార్టీనే వ్యాఖ్యలు చేస్తోస్తున్నదని విమర్శించారు. ఈ నాలుగున్నరేండ్లలోనే ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని, బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశామని, దోపిడీదారులు దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ చూస్తూ కూర్చున్నదని, అవినీతిపరులపై చర్యలు చేపట్టేందుకు మేం వెనుకాడేది లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ భారత సైన్యాన్ని అవమానించిందని విమర్శించారు. భారత వాయుసేన బలోపేతం కావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, అందుకే రాఫెల్ అంశాన్ని వివాదం చేస్తోందని మోడీ విమర్శించారు..

అచ్చేదిన్ లేవు..అంతా చచ్చేదిన్..

- జీఎస్టీ, నోట్లరద్దుతో సామాన్యుడి బతుకులు ధ్వంసం
- రాఫెల్‌పై ఎందుకు వెనక్కి వెళ్తున్నారు?
- శారదా కుంభకోణంపై తృణమూల్, బీజేపీ నాటకాలు : సీపీఐ(ఎం)నేత మహమ్మద్ సలీం



దేశ ప్రజలకు అచ్చేదిన్ తీసుకొస్తామని ప్రగ్భాలు పలికారని, కానీ చచ్చేదిన్ తీసుకొచ్చారని సీపీఐ(ఎం) లోక్‌సభ పక్ష ఉపనేత మహ్మద్ సలీం విమర్శించారు. గురువారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడిన ఎండి సలీం మోడీ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం జరిగిందని తాము నాలుగున్నరేండ్లుగా ఘోషిస్తున్నామని, కానీ ఆ కేసు వైపు బీజేపీ సర్కార్ కనీసం చూడలేదని విమర్శించారు. బాధితుల ఆందోళనలతో భారత సర్వోన్నత న్యాయ స్థానం జోక్యం చేసుకొని స్వతంత్ర విచారణ జరపాలని ఆదేశించిందని అన్నారు. రాఫెల్ విషయంలో తాము జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తుంటే, ఎందుకు ప్రభుత్వం వెనక్కి పోతుందన్న విషయం సభకు చెప్పాలని అన్నారు. రాఫెల్ ఒప్పందంలో ప్రభుత్వం చెప్పినట్టు ఏ తప్పు జరగక పోతే, విచారణ ఎందుకు వేయడం లేదన్నారు. ఈ పరిణామాలను పూర్తిగా గమనిస్తే దొంగే మరో దొంగను దొంగా... దొంగా అన్నట్టుగా ఉందని వ్యంగ్యం వ్యాఖ్యానించారు. అవినీతిపై యుద్ధం చేస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్న బీజేపీ తన పార్టీపై వచ్చిన ఆరోపణల విషయాన్ని ఎందుకు పక్కనబెడుతుందని నిలదీశారు. అచ్చేదిన్ తీసుకువస్తామని చెప్పి మోడీ అందలం ఎక్కారని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుతం దేశ ప్రజానీకానికి అచ్చేదిన్‌కి బదులు సచ్చేదిన్ తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగంలో నోట్ల రద్దు, జీఎస్టీ సవరణ వంటి అంశాలు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చెప్పిన ప్రతి వ్యాఖ్యానికి బీజేపీ ఎంపీలు ఎంపిలు బల్లలు చరిచారని, ఆ నిర్ణయాలతో దేశ ప్రజానీకానికి అదనంగా ఏం లబ్ది చేకూర్చారని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యేందుకు కారణమైన నిర్ణయాలను ఏ విధంగా సమర్థించుకుంటారని కేంద్రాన్ని నిలదీశారు. నేషనల్ సాంపిల్ సర్వే చెప్పిన విషయాలను మరిచిపోయారా? ఆ అంశాలు రాష్ట్రపతి ప్రసంగంలో ఎందుకు రాలేదు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కనీస పార్లమెంటరీ సాంప్రదాయాలను పట్టించుకోకుండా, ఉన్నత కులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్ట రూపకల్పనలో ఆగమేఘాల మీద చర్యలు తీసుకున్నారని విమర్శించారు. మనమంతా పార్లీమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్నామని, ఏ నిర్ణయమైనా ముందు సభలో అర్థవంతమైన చర్చ జరగాలని తెలిపారు. ఇక ఆయుష్మాన్ భారత్ పథకానికి ప్రభుత్వం రూ. 2000 కోట్లు కేటాయించిందని అయితే అందులో మోడీ ప్రచారానికే రూ. 435 కోట్లు ఖర్చు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇంత స్థాయిలో ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం ఏమాత్రం మంచి పరిణామం కాదని అన్నారు. 2014 ఎన్నికల ప్రచార సమయంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రచారం చేశారని, వాస్తవంలో మాత్రం మోడీ వచ్చాక సుమారు 11 మిలియన్ ఉద్యోగాలు పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ వల్ల చిన్న, మధ్యతరహా వ్యాపారులు పూర్తిగా నష్టపోయారని వివరించారు. పంజాబ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లోని రైతాంగం ఇప్పటికీ ఆందోళన చేస్తున్న పరిస్థితి దేశంలో ఉందని చెప్పారు. నోట్ల రద్దు కారణంగా దేశంలోని నల్లధనం వెలికి తీస్తామని మోడీ డాంభీకాలు పలికారని, నల్లధనం ఎంతమేర బయటికి తీసుకు వచ్చారో దేశ ప్రజానీకానికి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ చూస్తే ఇక మంచి రోజులు ఎవరికి వచ్చాయో అర్థం చేసుకోవచ్చని వ్యంగంగా వ్యాఖ్యానించారు. ఏమీ చేయకుండానే, ఏదో చేశామని చెప్పుకోవడం మోడీ సర్కార్‌కే చెల్లిందని ఆగ్రహించారు.

గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ఆగని మృత్యుగోస

10 నెలల్లో 161 మంది చిన్నారుల మృతి

- చేరిన ప్రతి ఆరుగురిలో ఒకరు మరణం..
- ఆర్టీఐ వివరణ ద్వారా వెలుగులోకి..
- దిద్దుబాటు చర్యలు చేపట్టని యోగి సర్కారు



లక్నో : ఉత్తరప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని సీఎం యోగి ఆదిత్యనాథ్ బయటి రాష్ట్రాల్లో ఊదరగొడుతున్నారు. 'ముందు మీ రాష్ట్రం సంగతి చూసుకో' అంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ నిలదీస్తే.. ఉత్తరప్రదేశ్‌లో అంతా సవ్యమే అంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. కానీ, ఆయన సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్‌లోనే పరిస్థితులు మరింత దుర్భరంగా ఉండటం గమనార్హం. గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ మెడికల్ ఆస్పత్రిలో పిల్లల మరణాలు ఏ మాత్రమూ తగ్గుముఖం పట్టడం లేదు. 10 నెలల కాలంలో 997 మంది చిన్నారులు వివిధ కారణాలతో ఆస్పత్రిలో చేరితే వారిలో 161 మంది(16 శాతం మంది) చనిపోవడం కలవరపెడుతున్నది. ఎన్‌సెఫలైటిస్(మెదడువాపు) వ్యాధితో 113 మంది చిన్నారులు ఆస్పత్రిలో చేరగా.. వీరిలో 15 మంది చనిపోయారు. కాగా.. ఏ కారణంగా పిల్లల మరణాలు సంభవించాయనే దానిపై ఆస్పత్రివర్గాల వద్ద పూర్తి వివరాలు లేకపోవడం గమనార్హం. 2018 జనవరి నుంచి నవంబర్ మధ్యలో ఆస్పత్రిలో మరణాల వివరాలు ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆర్‌టీఐ ద్వారా పొందిన సమాచారాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) అధికార ప్రతినిధి, రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఇందుకు సంబంధించి సంజయ్ సింగ్.. ఓ మీడియాసంస్థతో మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీకి, యూపీలో యోగికి తమ నేరాలను కప్పి పుచ్చుకునేందుకు డేటాను తారుమారు చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. అంతేకాక.. రాష్ట్రంలో పిల్లల మరణాల అంశం.. యోగి ఆదిత్యనాథ్ సర్కారుకు నవ్వులాటగా మారిందని ఎద్దేవా చేశారు. యూపీలో అధికారంలో ఉండకముందు.. పార్లమెంటులో యోగి పదే పదే పిల్లల మరణాల విషయాన్ని లేవనెత్తారని తెలిపారు. తీరా యోగి అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని, ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు.

కృత్రిమ ఆక్సిజన్ కొరత నిజమే..

బీఆర్‌డీ ఆస్పత్రిలో 2017 ఆగస్టులో కృత్రిమ ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడంతో 60 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. కాగా.. ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత లేనే లేదని రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెట్టింది. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించారన్న సాకుతో కఫీల్‌ఖాన్ అనే వైద్యుడిని అరెస్టు చేశారు. ఆయన 9 నెలలపాటు జైలు శిక్ష కూడా అనుభవించాడు. కాగా.. దీనిపై ఇటీవల ఓ ఆర్టీఐ దరఖాస్తుకు ప్రభుత్వం వివరణ ఇచ్చిన క్రమంలో నిజాన్ని ఒప్పుకోక తప్పలేదు. ఆగస్టు 10, 11, 12, 17 తేదీల్లో 54 గంటలపాటు కృత్రిమ ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయిన మాట వాస్తవమేనని ప్రభుత్వం అంగీకరించింది. అటు అలహాబాద్ హైకోర్టు కూడా 2018 ఏప్రిల్ 30న ఆక్సిజన్ కొరత విషయాన్ని ప్రస్తావించింది. యోగి సర్కారు తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు తనను బలిపశువును చేసిందని కఫీల్‌ఖాన్ మీడియాతో మాట్లాడుతూ.. ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చిందని తెలిపారు. జరిగిన దానిలో తన తప్పేమీ లేదని అలహాబాద్ హైకోర్టు కూడా తేల్చినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసే బదులు.. వైద్యారోగ్య వ్యవస్థను పటిష్టం చేసే దిశగా కృషి చేస్తే బాగుంటుందన్నారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

అఖిలేశ్‌యాదవ్.. యూపీ సీఎంగా ఉన్న కాలంలో.. బీఆర్‌డీ ఆస్పత్రివర్గాలు ప్రతిరోజు హెల్త్ బులెటిన్‌ను ప్రకటించేవి. దీన్ని ఆధారంగా చేసుకొని.. పిల్లల మరణాలు అంతకంతకూ పెరుగుతున్నాయని యోగి వీలు చిక్కినప్పుడల్లా విమర్శలు చేసేవారు. కానీ, తీరా యోగి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత సీన్ మొత్తం రివర్స్ అయ్యింది. బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్‌డీ ఆస్పత్రిలో హెల్త్‌బులెటిన్ విడుదల చేసే విధానాన్ని పూర్తిగా నిలిపివేయడం గమనార్హం.

చిన్నారుల మరణాల విషయమై బీఆర్‌డీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గణేశ్ కుమార్‌ను ప్రశ్నించగా.. ఆర్టీఐ వివరణ గురించి తనకు తెలియదని, దీనిపై తానేమీ మాట్లాడలేనని తెలిపారు. అయితే.. ఆస్పత్రిలో పరిస్థితి గతంలో కంటే ఇప్పుడు మెరుగైందని ఆయన చెప్పారు.

ఎన్‌జీటీ.. రూ.5 కోట్ల జరిమానా..

మెడికల్ వ్యర్థాలను పారవేయడంలో సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదంటూ బీఆర్‌డీ ఆస్పత్రికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) రూ.5 కోట్ల జరిమానాను కూడా విధించడం గమనార్హం. గతేడాది నవంబర్‌లో బీఆర్‌డీ ఆస్పత్రిని ఎన్‌జీటీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా అనేక పారిశుధ్యపరమైన లోపాలను బృందం గుర్తించింది. మెడికల్ వ్యర్థాలను వేసేందుకు నాలుగు రకాల వేర్వేరు డస్ట్ బిన్‌లను ఉంచాల్సి ఉన్నా అలాంటి ఏర్పాట్లేమీ లేవు. దీంతో ఆస్పత్రి మొత్తం దుర్గంధభరితంగా ఉండటంతో ఎన్‌జీటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాక మెడికల్ వ్యర్థాలను ఆస్పత్రి ఆవరణలోనే పారబోసి, తగులబెట్టడాన్ని సీరియస్‌గా పరిగణించిన ఎన్‌జీటీ.. రూ.5 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది.

15 రోజుల్లో 'పీఎం-కిసాన్' లబ్దిదారుల సమాచారం

- మార్చి 31లోపు రైతులకు మొదటి విడత సాయం
- వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్




న్యూఢిల్లీ : పీఎం-కిసాన్ సమ్మాన్ యోజనా కోసం ఐదెకరాలలోపు సాగు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల సమాచారాన్ని 15 రోజుల్లో సేకరిస్తారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ తెలిపారు. ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. తమ అధికారులు రాష్ట్రాలతో ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారని, వారు 15 రోజుల్లో లబ్దిదారుల సమాచారం అందిస్తారని భరోసానిచ్చినట్టు చెప్పారు. పలు పథకాల డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద రైతుల ప్రాథమిక సమాచారం ఇప్పటికే ఆయా రాష్ట్రాల వద్ద ఉన్నదని, ఆ సమాచారాన్ని పరిశీలించి మంత్రిత్వ వెబ్‌సైట్‌లోకి అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. అమలులో ఎలాంటి లొసుగులు ఉండబోవని, మధ్యవర్తులు ఉండబోరని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాల పలు పథకాల కింద సేకరించిన సమాచారంతో సరిపోల్చుతూ ఈ ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తారని అన్నారు. పీఎం-కిసాన్ సమ్మాన్ యోజనా కింద చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సహాయంగా ఏడాదికి రూ. 6వేలు (మూడు విడతల్లో) అందజేస్తారు.

సహాయం తక్కువ మొత్తమే కదా..

ఏడాదికి ఆరు వేల రూపాయలంటే.. నెలకు రూ. 500 మాత్రమే రైతులకు అందజేయడంపై విమర్శకులు.. తక్కువ మొత్తంలోనే ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని పెదవి విరుస్తున్నారు. అయితే దీనిపై మంత్రి స్పందిస్తూ.. రైతులకు తెలుసు ఆ సహాయం ఎంత విలువైందోనని అన్నారు. ఏసీ రూముల్లో ఉండేవారికి ఇది అర్థం కాదని, దేశంలోని గ్రామాల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని చెప్పారు. అలాగే, తమకు వనరులు పెరిగినప్పుడు ఈ ఆర్థిక సహాయాన్నీ మరింత పెంచుతారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలూ దీనికి అదనంగా సహాయాన్ని అందించి రైతులను ఆదుకోవచ్చని చెప్పారు. పలుపథకాల కింద రైతులు పొందుతున్న సబ్సిడీలను కొనసాగిస్తూనే పీఎం-కిసాన్ సమ్మాన్ యోజనాను అమలు చేస్తారని తెలిపారు. రైతులకు ఆ సబ్సిడీలు ఆపేస్తే.. గందరగోళం ఏర్పడుతుందని అన్నారు.

మా పచ్చని పొలాలు ఇవ్వం..

- బుల్లెట్ రైలుకు వ్యతిరేకంగా గుజరాత్‌లో రైతుల ఆందోళనబాట




నవసరి, గుజరాత్ : ప్రధానమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్మించతల పెట్టిన బుల్లెట్ రైలుకు రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. ఈ రైలుకు మా పచ్చని పొలాలు ఇచ్చేదిలేదంటూ దాదాపు 29 గ్రామాల రైతులు బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. బుల్లెట్ రైలుకు వ్యతిరేకంగా వారి ప్రధానమైన 14 అభ్యంతరాలను పేర్కొంటూ రైతులు అధికారులకు వినతిపత్రాన్ని అందచేశారు. రైలు కోసం ప్రభుత్వం గ్రీన్ బెల్టును సేకరిస్తున్నది అని రైతు నాయకుడు జయేశ్ పాటిల్ చెప్పారు. 'ఇందు కోసం దాదాపు రెండు లక్షల చెట్లు నరకనున్నారు. పచ్చదనానికి తూట్లు పొడిచే చర్యలను మేం ఒప్పుకునేదిలేదు' అని స్పష్టంచేశారు. అలాగే తమ పచ్చని పొలాలను వదలుకోబోమని 29 గ్రామాల రైతులు ర్యాలీ సందర్భంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. బుల్లెట్ రైలు మార్గం నిర్మాణం కోసం పొలాలను సేకరించి 2023లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. రూ. 3,500 కోట్లతో దాదాపు 508 కిలోమీటర్ల మేర నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే చర్యలు మొదలుపెట్టింది.

ఉత్తరాది రైతన్నకు కేరళ ఆపన్న హస్తం

- పప్పు ధాన్యాలు, ఉల్లి రైతుకు ఆసరాగా బడ్జెట్‌లో ప్రత్యేక పథకం

తిరువనంతపురం : తమ ఉత్పత్తులకు మరింత మెరుగైన ధరల కోసం పోరాడుతున్న ఉత్తరాది రైతాంగానికి కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఆపన్న హస్తం అందించింది. మద్దతు ధరలు లేక నిరాశలో కూరుకుపోయిన రైతాంగానికి అండగా నిలబడుతూ ప్రత్యేక పథకాన్ని బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద పౌర సరఫరాల శాఖ, కేరళ వినియోగదారుల సమాఖ్య కలిసి ఉత్తర భారతదేశ రైతుల నుంచి వారి వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు సేకరిస్తాయి. ఆ వ్యవసాయ ఉత్పత్తులను ఉత్పత్తి కేంద్రాల్లోనే నిల్వ వుంచి షెడ్యూల్ ప్రకారం కేరళకు తరలిస్తారు. ధాన్యం, పప్పు ధాన్యాలు, ఉల్లి వంటి నిత్యావసర వస్తువులను సేకరించనున్నారు. తీవ్రంగా ధరలు పడిపోయిన నేపథ్యంలో నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయిన ఉల్లి రైతులకు కేరళ ప్రభుత్వం సంఘీభావంగా నిలిచింది. సరైన ప్రోత్సాహక ధరతో రైతుల సహకార సంఘాల నుంచి ఇటువంటి ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించింది. కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇజాక్ ట్విట్టర్ వేదికగా ఈ ప్రకటన చేశారు. కాగా ఈ ప్రతిపాదిత పథకానికి సంబంధించిన విధివిధానాలపై ఇంకా కసరత్తు జరుగుతున్నదని పౌర సరఫరాల శాఖ సీనియర్ అధికారి తెలిపారు. వచ్చే ఒకటి రెండు వారాల్లో విధి విధానాలపై ఒక స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. సాధారణంగా కేరళ ఇతర రాష్ట్రాల నుంచి నిత్యావసరాలైన పప్పు



ధాన్యాలను, కూరగాయలను టెండరు పిలవడం ద్వారా సేకరిస్తూ వుంటుంది. కేరళ తన అవసరాల నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే పప్పు ధాన్యాలపైనే ఆధారపడుతూ వుంటుంది. గత నెల రోజుల కాలంలో జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్) ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి కొన్ని వస్తువులను కొనుగోలు చేశామని ఆ అధికారి తెలిపారు. ఉదాహరణకు కర్నాటక నుండి దేశీవాళి శనగలను దిగుమతి చేసుకున్నామని, రాజస్థాన్ నుండి పెసలు, మినుములను, మధ్యప్రదేశ్ నుండి పెసరపప్పును దిగుమతి చేసుకున్నామన్నారు. అయితే వీటన్నింటినీ నాఫెడ్ నేరుగా సేకరించింది. కానీ మొదటిసారిగా మధ్య దళారీల ప్రమేయం లేకుండా స్థానిక పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తోంది.

సమస్యలు ముందుకు రావద్దు..

అందుకే క్యాబినెట్ వెనక్కు..



- రాష్ట్ర ఆర్థిక పరిస్థితే కారణమంటున్న విశ్లేషకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'రాష్ట్ర క్యాబినెట్ ఉంటే ప్రజలందరూ తమ సమస్యల పరిష్కారం కోసం మంత్రుల వద్దకు వస్తారు. వారి సమస్యలు తీర్చాలంటే నిధులు కావాలి. ఇప్పటికిప్పుడు ఇది సాధ్యమయ్యే పని కాదు.. అలాంటప్పుడు అసలు మంత్రివర్గమన్నదే లేకుండా పోతే ఎలాంటి సమస్యా ఉండదు కదా...?' క్యాబినెట్‌పై పభుత్వ పెద్దల వ్యూహమిదేనన్న చర్చ ఇప్పుడు సర్వత్రా కొనసాగు తున్నది. ఈ కారణంతోనే మంచి రోజుల సాకు చెప్పి క్యాబినెట్‌ను ఏర్పాటు చేయకుండా తాత్సారం చేస్తున్నారని వినికిడి. టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సర్కారుపై ప్రజల ఆకాంక్షలు విపరీతంగా పెరిగిపోయాయి. ముఖ్యంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, పెన్షన్ల పెంపు, నిరుద్యోగ భృతి తదితరాంశాలపై జనాలు గంపెడాశలు పెట్టుకున్నారు. వీటన్నింటినీ ఇప్పటికిప్పుడు పరిష్కరించాలంటే పెద్ద మొత్తంలో డబ్బు కావాలి. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటనే నిధులు విడుదల చేసేందుకు వీలుగా లేదని సమాచారం. మరోవైపు భారీ అప్పులు ఖజానాకు పెనుభారంగా మారాయి. తాజాగా విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ ఎన్టీపీసీ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయటం గమనార్హం. మనది ధనిక రాష్ట్రమంటూ చెబుతున్న ప్రభుత్వాధినేతలు.. ఇలాంటి అప్పులను సకాలంలో ఎందుకు చెల్లించలేకపోతున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలి పోతున్నది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలోనే క్యాబినెట్‌ను ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తు న్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోపాటు ఎమ్మెల్సీ, పార్లమెంటు ఎన్నికలన్నీ పూర్తయిన తర్వాత అప్పటి పరిస్థితులనుబట్టి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ యోచిస్తున్నట్టు సమాచారం. ఇదే సమయంలో పత్రికలకు లీకులు ఇవ్వటం ద్వారా ఇదిగో క్యాబినెట్.. అదిగో క్యాబినెట్ అంటూ ఊరిస్తున్నారని తెలిసింది. పార్లమెంటు ఎన్నికలు పూర్తయిన తర్వాత సామాజిక సమీకరణాల ప్రాతిపదికన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారని అధికార పార్టీ వర్గాలు చెబుతు న్నాయి. అప్పటి వరకూ కష్టపడి పని చేయాలని, తద్వారా పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఆదేశించారు. గెలుపు కోసం కృషి చేసిన వారిని గుర్తించి.. ఆ తర్వాత మంత్రివర్గంలో వారికి పెద్ద పీట వేయాలని కూడా కేసీఆర్ భావిస్తున్నట్టు తెలి సింది. ఈ కారణంతోనే రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం రాబోతున్నా.. ఓటాన్ అకౌంట్‌ను బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉన్నా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయటం లేదు, కనీసం ఆర్థిక మంత్రిని కూడా నియమించటం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గ ఏర్పాటనేది సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది.

ఖనిజ సంపద.. ప్రగతికి ఆయువు పట్టు

- భూగర్భ విజ్ఞాన శాస్త్రంపై అవగాహన పెరగాలి : సిహెచ్ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఖనిజాలు దేశ ప్రగతికి ఆయువు పట్టు లాంటివని, మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని భారతీయ భూ విజ్ఞాన సర్వేక్షణ శిక్షణా సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సిహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. భూగర్భ విజ్ఞాన శాస్త్రం గురించి మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందన్నారు. హైదరాబాద్‌లోని కవాడీగూడలో గల కేంద్ర ప్రభుత్వ సముదాయంలో పత్రికా సమాచార కార్యాలయ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ విజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థ 1976లో హైదరాబాద్ కేంద్రంగా స్థాపించబడిందని, అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, శాస్త్రవేత్తలకు కావలసిన భూగర్భ విషయ పరిజ్ఞానాన్ని అందిస్తోందని వివరించారు. ఇప్పటి వరకు 32000 మంది భూ సంబంధ వృత్తి నిపుణులు ఈ శిక్షణా సంస్థ ద్వారా శిక్షణ పొందినట్టు ఆయన తెలిపారు. తమ ప్రాంతీయ శిక్షణా విభాగాలు నాగపూర్, కలకత్తా, లక్నో, జైపూర్, షిల్లాంగ్‌లలో ఉన్నాయని, నాలుగు క్షేత్ర స్థాయి శిక్షణ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ భూగర్భ శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం తమకు ప్రాధాన్యమని, ఈ మధ్య కాలంలో అంతర్జాతీయ విద్యార్థులు కనబరుస్తున్న ఆసక్తి, డిమాండ్‌కి తగినట్టు శిక్షణ సదుపాయాలు కల్పించినట్టు, ఇప్పటివరకు ప్రపంచ నలుమూలల నుంచి దాదాపు 62 దేశాలకు చెందిన 433 మంది విద్యార్థులు ఈ సంస్థ ద్వారా శిక్షణ పొందినట్టు తెలిపారు. భువి సంవాద్ కార్యక్రమం ద్వారా పలు విశ్వవిద్యాలయ అధ్యాపకులకు, విద్యార్థులకు శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 2,500 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందారని అన్నారు. "అందరికీ శిక్షణ మరియు సామర్థ్యం పెంపొందించుట" అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన భూగర్భ శాస్త్రవేత్తలు ఖనిజాన్వేషణలో, పలు ప్రాజెక్టుల రూపకల్పనలో విశేషంగా రాణిస్తున్నారని చెప్పారు. పత్రికా సమాచార కార్యాలయ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ టి.వి.కె రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంతో పాటు వివిధ దేశాలకు చెందిన విద్యార్థులకు భారతీయ భూ విజ్ఞాన సర్వేక్షణ శిక్షణా సంస్థ ద్వారా ఖనిజ అన్వేషణలో శిక్షణ అందిస్తున్నారని ఆయన అన్నారు. జీఎస్ఐ డైరెక్టర్ డా. తారక్ నాథ్ పాల్ మాట్లాడుతూ యువతలో భూగర్భ విజ్ఞాన శాస్త్రం గురించి ఆసక్తి ఏర్పరచేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్ వెంకటేశ్వరరావు

కుల గణనకు ప్రధాని అంగీకారం : నూకారపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ వ్యాప్తంగా కులవారీగా కుల గణన చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీని బడుగుల సంగ్రామ పరిషత్ అధ్యక్షులు, సూర్య దినపత్రిక చీఫ్ ఎడిటర్ నూకారపు సూర్యప్రకాశ్‌రావు ఢిల్లీలో గురువారం కలిశారు. కులగణనకు ప్రధాన మంత్రి అంగీకారం తెలిపారని సూర్యప్రకాశ్‌రావు చెప్పారు.

స్పీకర్‌కు సీఎం కేసీఆర్ పరామర్శ

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తల్లి మృతిచెందడంతో ఆయనను సీఎం కేసీఆర్ గురువారం పరామర్శించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చేరుకున్న ముఖ్యమంత్రి.. అక్కడి నుంచి స్పీకర్ స్వగ్రామం పోచారం గ్రామానికి రోడ్డుమార్గం ద్వారా వెళ్లారు. స్పీకర్ నివాసానికి చేరుకున్న సీఎం ముందుగా పాపవ్వ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన తల్లితో ఉన్న అనుబంధాన్ని పోచారం శ్రీనివాసరెడ్డి కేసీఆర్‌తో పంచుకున్నారు. సీఎం వెంట ఎంపీ కవిత, మాజీ స్పీకర్ మధుసుదనాచారి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ హెలికాప్టర్‌లో బాన్సువాడకు చేరుకున్నారు. అలాగే శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్, మాజీ మంత్రి నాయిని నర్సింహరెడ్డి, శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, గంప గోవర్ధన్, జీవన్‌రెడ్డి, గుణేష్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ వీజీగౌడ్, జిల్లా పరిషత్ చైర్మన్ దఫేదర్ రాజు, ఎలక్షన్‌రెడ్డి తదిత రులు స్పీకర్‌ను పరామర్శించారు. సీఎం కేసీఆర్‌ను స్పీకర్ శ్రీనివాసరెడ్డి కుమారుడు భాస్కర్‌రెడ్డి బాన్సువాడ నుంచి స్వాగతం పలికారు.



మహిళలపై ప్రేమోన్మాదుల దాడులు

- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులను త్వరగా శిక్షించాలి: ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు జ్యోతి, రమేష్
- హైదరాబాద్‌లో భారీగా మానవహారం, దిష్టిబొమ్మల దహనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళలు, బాలికలపై దాడులు పెరుగుతున్నాయని, నిందితులను సత్వరం విచారించి కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. తీవ్ర నేరాలు జరిగినప్పుడు వెంటనే శిక్షలు పడకపోవడంతో నిందితులకు భయం లేకుండా పోతున్నదని.. అందువల్ల ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఇంటర్ విద్యార్థిని మధులికపై ప్రేమోన్మాది దాడి, టీవీ నటి ఝాన్సీ ఆత్మహత్యను నిరసిస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీల సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్‌లో నారాయణగూడ చౌరస్తాలో భారీ మానవహారం నిర్వహించాయి. అనంతరం నిందితుల దిష్టిబొమ్మలను దహనం చేశాయి. ఈ సందర్భంగా ఐద్వా జాతీయ నాయకులు టి.జ్యోతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్ మాట్లాడుతూ మధులికను తీవ్రంగా గాయపర్చిన నిందితుడుని, టీవీ నటి ఝాన్సీ ఆత్మహత్య చేసుకోవడానికి కారుకులైన దోషులను వెంటనే శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధులికను ప్రేమించాలని వెంటపడ్డ ప్రేమోన్మాది భరత్, తనను వివాహం చేసుకోవాలంటే నటన మానేయాలని, కుటుంబ సభ్యులతో సంబంధాలు తెంచుకోవాలని వంటి ఆంక్షలను ప్రేమికుడు సూర్య విధించాడని.. దీంతో తీవ్ర మానసిక క్షోభకు గురైన ఝాన్సీ ఆత్మహత్య చేసుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఆడపిల్లలపై చులకనభావం, అసమానతలను రూపుమాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

ఐద్వా నాయకుల పరామర్శ



అంతకుముందు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లులక్ష్మీ, ఉపాధ్యక్షురాలు ఆశాలత తదితరులు మధులిక కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మానవహారం కార్యక్రంలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆశాలత, అరుణజ్యోతి, వినోద, సృజన, స్వర్ణ, పద్మ, రాణిభాయి, నాగలక్ష్మీ, జావెద్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

మరో ఇద్దరికి గాయాలు

- ఓమ్ని వాహనాన్ని ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్
- జడ్చర్ల జాతీయ రహదారిపై ఘటన

నవతెలంగాణ-జడ్చర్ల

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల 44వ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. జడ్చర్ల సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కావేరమ్మపేట సమీపంలోని మునావర్ దాబా ముందు జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న మారుతి ఓమ్ని వాహనాన్ని వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఓవర్ టేక్ చేయబోయి ఢీకొట్టింది. దీంతో ఓమ్ని వాహనంలో ప్రయాణిస్తున్న హన్వాడ మండలం కొత్తపేట గ్రామం కొత్తతండాకు చెందిన పి.రవి నాయక్(38), అతని భార్య సుజాత(32) రోడ్డుపై ఎగిరి పడ్డారు. సుజాత అక్కడికక్కడే మృతిచెందింది. రవినాయక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి రవినాయక్ మృతిచెందాడు. మృతుడు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. మృతదేహాలను బాదేపల్లి ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో భద్రపరిచినట్టు సీఐ తెలిపారు.



మృతి చెందిన రవి

గంధపు చెక్కలా సమాజసేవలో అరిగిపో గానీ, ఇనుపముక్కలా తుప్పు పట్టకు.
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య


సంపాదకీయం

పంచాయతీల గోస

కొత్త పంచాయతీలు అధికారికంగా కొలువుదీరాయి. నూతన సర్పంచులకు ప్రభుత్వం, అధికారాలు, విధులకు సంబంధించిన శిక్షణా ప్రక్రియ ప్రారంభించడం ఆహ్వానించ దగింది. జిల్లాకొక సర్పంచితోపాటు మాస్టర్ ట్రైనర్లకు, ఇతర ముఖ్యులకు ప్రగతిభవన్ వేదికగా ఒక దఫా శిక్షణ పూర్తి చేశారు. స్వయంగా సీఎం కేసీఆర్ పాల్గొనడం విశేషం. ఇదంతా ఒక భాగం. గ్రామసీమలను అభివృద్ధి చేయాలని చెబుతూనే పన్నులు కచ్చితంగా వసూలు చేయాలని సీఎం నొక్కి వక్కాణించడం గమనార్హం. ప్రగతిభవన్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల నియోజక అభివృద్ధి పథకం ద్వారా నిధులు వస్తాయని సెలవిచ్చారు. దాదాపు ఏటా రూ.7236 కోట్లు సమకూరుతాయని చెప్పారు. నిజంగా ఈ నిధులతో పల్లెలు పచ్చతోరణాలవుతాయా అన్నదే అసలు సమస్య. ఆ మాత్రం నిధులు కూడా అందలేదన్నది నిజం.

ఏడాదికి రూ.16లక్షలతో ఏమి అభివృద్ధి చేయగలరు? ఆయన మాటల్లోనే ప్రస్తుతం గ్రామ పంచాయతీలు కరెంటు బిల్లులు కూడా కట్టుకోగల స్థితిలో లేవు. వాటి ఆదాయ మార్గాలు కత్తిరించి రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలో వేసుకున్నారు. రాష్ట్ర ప్రణాళికా బడ్జెట్‌లో తగిన వాటా పంచాయతీలకు కేటాయించకుండా మాటలతో సాధించేది శూన్యం కదా!

పంచాయతీల గోస అర్థం చేసుకోకుండా సీఎం ప్రసంగ పాఠం నిర్వీర్యపోయేలా చేస్తున్నది. హైకోర్టు ఆదేశిస్తే గానీ, ఎన్నికలు నిర్వహించని రాష్ట్ర ప్రభుత్వం, ప్రగతిభవన్‌లో మార్గదర్శకాలు చెప్పడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. కరెంటు బకాయిలు ఉండరాదని, నూరుశాతం పన్నులు వసూలుచేయని సర్పంచులూ కార్యదర్శుల్ని సస్పెండ్ చేస్తామని హెచ్చరించడం ఆందోళనకు గురిచేస్తున్నది. ఇప్పుడు ఇదే సంగతి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉంది. శాసనసభ ఎన్నికలు పూర్తికాగానే ప్రజల నుంచి పన్నులు రాబట్టాలని యోచించడం ఆందోళనకరమైన పరిణామమే. 14వ ఆర్థిక సంఘం నిధులు మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి గత ఐదేండ్లుగా పంచాయతీలకు పైసా అందలేదు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీసం గౌరవ వేతనాలు సైతం క్రమం తప్పకుండా చెల్లించని స్థితిలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. పంచాయతీలు, మున్సిపాల్టీలకు 72, 73వ రాజ్యాంగ సవరణల ద్వారా సంక్రమించిన 29 అధికారాలకు తూట్లు పొడిచింది. రాజ్యాంగం హక్కుగా కల్పించిన అధికారాల్లో కోత పెట్టి 18 మాత్రమే అమలుచేస్తున్నారు. వాటిపై కూడా ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలతోపాటు తెలంగాణ ఏర్పడిన అనంతర టీఆర్ఎస్ ప్రభుత్వమూ దృష్టిపెట్టలేదు. ఇందుకు చట్టసభల ప్రతినిధులే అడ్డంకిగా ఉన్నారనే, ఆటంకాలు సృష్టిస్తున్నారనే



విమర్శలూ ఉన్నాయి. కొత్త రాష్ట్రంలోనూ పంచాయతీల గోస తీరనే లేదు. కొత్తగా 4500 పంచాయతీలను ఏర్పాటు చేసిన గులాబీ ప్రభుత్వం, 'తాంబూలాలిచ్చాం తన్నుకు చావండీ..' అన్న రీతిన వ్యవహరిస్తున్నది. వాటి ఉనికి కోసం ప్రత్యేకంగా నిధులిస్తామని చెప్పాల్సిందిపోయి, పన్నులు వసూలు చేసుకోవాలని ఉచిత సలహాలు, సూచనలు ఇవ్వడం విడ్డూరం. వామపక్షాల చొరవతో వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద గ్రామసీమల్లో పనులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన 10శాతం మ్యాచింగ్ గ్రాంటు నిధులను సైతం ఇవ్వకుండా ఆలస్యం చేసింది. గ్రామజ్యోతి ప్రారంభమయ్యాక పంచాయతీలకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులిస్తామన్న బాస గురించిన ఊసే లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఖర్చు పెట్టాల్సిన సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లిస్తున్నది. మిషన్ కాకతీయ, భగీరథ, ఇతర ప్రాజెక్టుకు ఖర్చుపెడుతున్నదనే విమర్శలు ఉండనే ఉన్నాయి. సర్పంచులకు చెక్‌పవర్ సైతం అధికారంలోకి వచ్చిన మూడేండ్ల తర్వాతగానీ కట్టబెట్టలేదు. కొత్త పంచాయతీరాజ్ చట్టం పేర ఉన్న నామమాత్ర అధికారాలను సైతం చట్టసభలకు దఖలు పరిచింది. తద్వారా పంచాయతీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరభ్యంతర పత్రం పంచాయతీల నుంచి తీసుకోవాలనే అధికారం ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ అధికారానికి కత్తెరేసింది.

గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)ల పేర పల్లెల్లో జరుగుతున్న అకృత్యాలు ఎన్నెన్నో. ప్రజాప్రతినిధులకు కనీస విలువ లేకుండా పోయింది. రాష్ట్రంలో ఉపాధి అవకాశాల్లేక పట్టణాలు, నగరాలకు వలసపోతున్న నేపథ్యంలో పన్నులు వసూలు చేయాలనీ లేకపోతే కార్యదర్శుల్ని సస్పెండ్ చేస్తామని స్వయంగా సీఎం మాట్లాడటం ఏమాత్రం సహేతుకం కాదు. కరువుకాటకాలకు నిలయమైన పంచాయతీల ఆర్థిక దుస్థితిని అర్థం చేసుకుని, ఆర్థికంగా ఆదుకోవడం, అన్ని విధాలా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. హైదరాబాద్ మినహా 30గ్రామీణ జిల్లాల్లో 2.02కోట్ల జనాభా ఉంది. వీటికి యేటా 14వ ఆర్థిక సంఘం కింద రూ.1628కోట్లు వస్తాయని సర్కారు చెబుతున్నది. అలాగే తమ తోడ్పాటుతో మొత్తం రూ.3256కోట్లు అందుతాయని అంటున్నది. నిజంగా అందినా సీఎం చెప్పిన ప్రకారమే 500 జనాభాగల పంచాయితీకి కేవలం రూ.16లక్షలు కేటాయిస్తారు. ఏడాదికి రూ.16లక్షలతో ఏమి అభివృద్ధి చేయగలరు? ఆయన మాటల్లోనే ప్రస్తుతం గ్రామ పంచాయతీలు కరెంటు బిల్లులు కూడా కట్టుకోగల స్థితిలో లేవు. వాటి ఆదాయ మార్గాలు కత్తిరించి రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలో వేసుకున్నారు. రాష్ట్ర ప్రణాళికా బడ్జెట్‌లో తగిన వాటా పంచాయతీలకు కేటాయించకుండా మాటలతో సాధించేది శూన్యం కదా!

ప్రజావాణి

పిల్లలకు ఓటమి తట్టుకోవడం నేర్పాలి

ఆధునిక కాలంలో కాలంతో పాటుగా పరుగులు తీస్తూ ప్రకృతిని శాసించే స్థాయిలో సాంకేతికంగా ఎంతో పురోగమించాం. ఎన్నో అవకాశాలు, వసతులు, సౌకర్యవంతమైన జీవన విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ఇదే సమయంలో ఒత్తిడితో కూడిన చదువులు, ఉద్యోగాలు, ఆర్థికంగా ఆకాశాన్ని అందుకోవాలనే ఆలోచనలు, విలాసవంతమైన జీవన విధానాలతో సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్ల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. బతక గలం అనే మనోధైర్యం నేటి తరంలో కొరవడుతున్నది. మార్కులు, ర్యాంకులే ప్రాతిపదికగా, చిన్న తనం నుంచే ఐఐటీలు, మెడికల్ ఫౌండేషన్ పేరుతో వారి బాల్యాన్ని మొగ్గలోనే చిదిమేసే స్థాయిలో, ఒత్తిడితో కూడిన విద్యావిధానం, క్రమశిక్షణ కొరవడటం, విచక్షణలేమి ఇవన్నీ కలసి విద్యార్థులను మానసిక వికలాంగులుగా తయారు చేస్తున్నాయి. చిన్నపాటి సమస్యను కూడా పరిష్కరించుకోలేని దుస్థితిలోకి విద్యార్థిలోకం నెట్టి వేయబడుతున్నది.ప్రస్తుతం సమాజాన్ని పరిశీలిస్తే ఎన్నో విపరీత ధోరణులు కన్పిస్తున్నాయి. విద్యార్థులకు విద్యార్థిదశ నుంచే సమస్యలు ప్రారంభమవుతున్నాయి. వాటిని పరిష్కరించుకునే శక్తి వారికి లేకపోవటం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు వారి సమస్యల పట్ల శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు 24 గంటలూ చదివే యంత్రాలుగా మారుతున్నారు. వీటిని నివారించి భావి పౌరులుగా వారిని తీర్చిదిద్దేందుకు, జీవన నైపుణ్యాల పట్ల అవగాహన కల్పించేందుకు అవసరం ఎంతైనా ఉంది. పిల్లల శక్తి సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్య నిర్ధారణ చేసుకోవాలి. పరీక్షల సమయంలో పిల్లలతో తల్లి తండ్రులు ఎక్కువ సమయం గడపాలి. పిల్లలకు మేమున్నాం అనే భరోసాను తల్లి తండ్రులు ఇవ్వాలి. పిల్లలకు ఓటమిని తట్టుకోవడం నేర్పాలి.

డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్.

ఏటీయం కార్డుల మార్పులతో వినియోగదారుల ఇబ్బందులు

ఏటీయం కార్డులు జనరేట్ చేసుకుని పిన్ నెంబర్‌ను సెలక్ట్ చేసుకోమని కొన్ని బ్యాంకులు చెప్పటం వల్ల విద్యార్థులు, యువకుల పరిస్థితి సైతం అగమ్యగోచరంగా తయారైంది. చిప్ మార్పు పేరుతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో కొన్ని బ్యాంకులు వినియోగదారులకు ఏటీయం కార్డులతో పాటు పిన్‌నెంబర్‌ను బ్యాంక్‌లో నేరుగా ఇచ్చేవారు. వినియోగదారులకు అటంకం కలిగించకుండా సేవలను అందించేవారు. ఇప్పుడా సౌకర్యం లేకపోవడంతో ముఖ్యంగా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటీయం గతంలో కార్డు తీసుకున్నప్పుడు అద్దెకు ఉంటే ఆ ఇంటి అడ్రసు ఇస్తున్నారు. బదిలీ అయినా బ్యాంక్‌లో అదే చిరునామా కొనసాగటంతో పాత అడ్రసుకు వెళ్ళి తిరిగి వెనక్కు వెళ్ళిపోతున్నాయి. వారు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ అసౌకర్యాన్ని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకుని బ్యాంక్‌లలో గతంలోలాగానే పిన్ నెంబర్ ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాలి. ముఖ్యంగా సామాన్యులు, నిరక్షరాస్యులు నేటి టెక్నాలజీ వేగాన్ని అందుకోలేకపోతున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని వెలసులుబాటు కల్పించాలి.

ఎ.ఆర్.ఆర్.రావు, ఖమ్మం.

డార్విన్ సూత్రానికి నోబెల్ బహుమతి



డాక్టర్ దేవరాజు మహారాజు

డార్విన్ సూత్రం ఆధారంగా చేసిన ప్రయోగాలకే 2018 సంవత్సరానికి స్వీడిష్ రాయల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నోబెల్ ప్రకటించింది. 3.7 బిలియన్ సంవత్సరాలకు ముందు ఈ భూమి మీద జీవం ఆవిర్భవించింది. వాతావరణానికి అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ పరిణామం చెందుతూ వస్తూ ఉందని డార్విన్ సూత్రం చెపుతోంది. ఉదాహరణకు ధ్రువప్రాంతాల్లో ఉన్న చేపల రక్తంలో 'యాంటీఫ్రీజ్ ప్రొటీన్' ఉండడం వల్ల, నీరు గడ్డకట్టి ఉన్నా అవి అక్కడ సులభంగా

నోబెల్ బహుమతి స్థాపించిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ స్వయంగా ఒక రసాయనిక శాస్త్రవేత్త. ఆయన పేరుతో ఉన్న ఈ బహుమతిని మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు అందించే ఇలాంటి రసాయనిక శాస్త్రవేత్తలకు అందడం చాలా సబబుగా ఉంది. డార్విన్ సిద్ధాంతం పనికిరాదని, ఈ దేశంలోని విద్యాసంస్థల్లో దాన్ని పాఠ్యాంశంగా బోధించకూడదన్న గౌరవ ప్రభుత్వ మూర్ఖులకు ఈ నోబెల్ బహుమతి ఒక చెంపదెబ్బ!

ఈదగలుగుతున్నాయి. ఇతర ప్రాంతాల్లోని సముద్రపు చేపలకు ఆ సౌలభ్యం ఉండదు. ఎందుకంటే వాటి రక్తంలో యాంటీ ఫ్రిజ్ ప్రొటీన్లు అభివృద్ధి కాలేదు. ధ్రువప్రాంతపు చేపలరక్తంలో ఆ పరిణామం జరిగిందన్నమాట!

మేరీ క్యూరీ 1911లో నోబెల్ సాధించిన తొలి మహిళా శాస్త్రవేత్త. ఆమె తర్వాత నోబెల్ స్వీకరించిన ఫ్రాన్సెస్ హెచ్. ఆర్నాల్డ్ ఐదవ మహిళ. ఈమె పరిశోధనల వల్ల మానవాళికి గొప్ప మేలు జరగబోతూ ఉంది. నోబెల్ బహుమతికిచ్చే ప్రయిజ్ మనీ తొమ్మిది మిలియన్‌ల స్వీడిష్ క్రోనాలో సగభాగం ఫ్రాన్సెస్ హెచ్ ఆర్నాల్డ్ (62)కు దక్కితే, జార్జ్ పి.స్మిత్ (77), సర్ గ్రిగరీ పి. వింటర్ (67) అనే మరో ఇద్దరు శాస్త్రవేత్తలకు మిగతా సగం డబ్బు సమానంగా పంచారు. దానితో 2018 సంవత్సరానికి రసాయనిక శాస్త్ర విభాగానికి నోబెల్ బహుమతి ముగ్గురికి లభించినట్టయ్యింది. మహిళా శాస్త్రవేత్త ఫ్రాన్సెస్ ఆర్నాల్డ్ అమెరికాలోని పసడినాలోని కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్. ముగ్గురు కొడుకులకు తల్లి. కుటుంబ సమస్యల్ని, సమాజంలోని సవాళ్ళను ఎదుర్కొంటూ సింగిల్ మదర్‌గా పిల్లల్ని పెంచారు. బ్రెస్ట్ కాన్సర్ వస్తే తట్టుకుని నిలబడి తన పరిశోధనల్ని కొనసాగించిన ధీరవనిత. మరీ ముఖ్యంగా చెప్పుకోవాలంటే ఆమె చదివింది జీవశాస్త్రం కాదు. 1979లో ఫ్రాన్సిస్ ఆర్నాల్డ్ మెకానికల్ ఎయిరో స్పేస్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ తీసుకున్నప్పుడే ఆమె ఒక దృఢ సంకల్పంతో ఉన్నారు. మానవాళికి ఉపయోగపడే ఏదో ఒక కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి రూపకల్పన చేయాలని నిశ్చయించుకున్నారు. తొలిదశలో ఇంజనీర్‌గా సౌరశక్తిపై కృషి చేస్తుండేవారు. అప్పుడే వైజ్ఞానిక ప్రపంచంలో చాలామంది పరిశోధకులు డీఎన్ఏ టెక్నాలజీ గురించి విరివిగా చర్చలు జరుపుతుండేవారు. ఇక భవిష్యత్తు అంతా డీఎన్ఏ పరిశోధనల మీదే ఉండబోతూ ఉందని గ్రహించిన ఆమె, జీవశాస్త్రం వైపు దృష్టి మరల్చారు. ఒక ఎయిరో స్పేస్ ఇంజనీర్ స్వయంగా జీవశాస్త్ర మూలసూత్రాలు తెలుసుకుని, అధ్యయనం చేసి, పరిశోధనలు చేసి, అందులో అత్యున్నత స్థాయికి చేరుకుని, నోబెల్ సాధించడం మామూలు విషయం కాదు. తొలిదశలో ఆమె అనుకున్న విధంగా ఒక కొత్త సాంకేతిక విజ్ఞానం నిజంగానే ఆమె మానవాళికి అందించినట్టయ్యింది. తన ఇంజనీరింగ్ పరిజ్ఞానం ఎంజైమ్‌ల ఇంజనీరింగ్‌కు అన్వయించి, నూతన ఎంజైమ్‌ల ఆవిష్కరణకు దారులు వేశారామె.

ఇతర విషయాలలో చదువు కొనసాగించి, జీవ శాస్త్రంలోకి రావడం వల్ల ఫ్రాన్సిస్ ఆర్నాల్డ్, ఇతర జీవశాస్త్రవేత్తలు ఆలోచించిన విధంగా కాకుండా ఒక నూతన దృక్పథంతో జీవపరిణామాన్ని చూడగలిగారు. అలాగే పరిష్కరించగలిగారు. ప్రకృతి చర్యలకు విరుద్ధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించకుండా ప్రకృతి చర్యలకు అనుగుణంగా పరిశోధనలు కొనసాగించడమే సబబు.. అని ఆమె నిశ్చయించుకున్నారు. దానికి తోడు 'క్వాంట' పత్రికలో జెస్సీ బ్లూమ్ రాసిన ఒక వ్యాసం ఆమెను ఆలోచనలో పడేసింది. "జీవ పరిణామమనగానే వేలవేల ఏండ్ల క్రితం అంతరించిపోయిన శిలాజాల (FOSSILES) అధ్యయనమని చాలా మంది అనుకుంటారు. కానీ, అలా కాకుండా పరిణామ చర్యల్ని రసాయనిక ప్రయోగశాలలో జరిపిస్తే ఏమో మంచి ఫలితాలు వస్తాయేమో. పరిణామం అంటే అంతదాకా ఉన్న ఆలోచనలు మారతాయేమో. కొత్త ఫలితాలు వస్తాయేమో" అని ఒక ఆశాభావం వెలిబుచ్చాడు జెస్సీ బ్లూమ్. ఇంతకూ ఆయన ఎవరో కాదు, ఫ్రాన్సిస్ ఆర్నాల్డ్ పూర్వ విద్యార్థి. పరిణామానికి దారితీసే విలువైన ఏ మాలిక్యూల్ కూడా ఏ రసాయనిక శాస్త్రవేత్తా ఏ ప్రయోగశాలలో తయారు చేయలేదు. సహజ సిద్ధంగా ప్రకృతిలో జీవ ప్రపంచమే తయారు చేస్తూఉంది. అంటే ప్రయోగశాలలో అయినా సరే, మాలిక్యూల్స్‌ల తయారీ జీవులతోనే తయారు చేయించాలి.. అనే వాస్తవాన్ని ఆమె గ్రహించారు.

1980లో ఫ్రాన్సిస్ ఆర్నాల్డ్ బాక్టీరియాకు చెందిన ఒక ఎంజైమ్ సబ్టిలిసిన్ (SUBTILISIN)ను పునర్నిర్మించారు (REDESIGN). అది నీటిలో లేక సంబంధించిన ఇతర ద్రవాలలో కాకుండా డిమిథైల్ ఫార్మాల్డి హైడ్ (డీఎమ్ఎఫ్) వంటి ఆర్గానిక్ సాల్వెంట్ (ORGANIC SOLVENT)లో కరిగే విధంగా చేశారు. ఇతర జీవశాస్త్రవేత్తల వలె జన్యులిపి (GENETIC CODE) మార్చే ప్రయత్నం చేశారు. అయితే ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. తరువాత చేసిన ప్రయత్నాలలో ఎంజైమ్ జనటిక్ కోడ్‌లో 'రాండమ్ మ్యుటేషన్స్' (RANDOM MUTATIONS)ను సృష్టించారు. బాక్టీరియాలో వేల వేల రకాల సబ్టిలిసిన్‌లు తయారయ్యాయి. అలా చేయగా, చేయగా ఒక సబ్టిలిసిన్ రకం 256 రెట్లు డీఎమ్ఎఫ్‌లో బాగా పనిచేసింది. ఈ ప్రయత్నాల వల్ల జీవపరిణామాన్ని మనం 'సూచించిన' విధంగా జరిపించొచ్చు.. అనే ధీమా ఆమెకు కలిగింది. అదే నిర్ధారించబడింది. డార్విన్ సూత్రాన్ని ప్రయోగ నాళికలో ప్రవేశపెట్టి సహజంగా చాలా ఆలస్యంగా జరిగే జీవ



పరిణామాన్ని వెయ్యిరెట్లు వేగవంతం చేసి ఫలితం సాధించారన్నమాట! దీన్నే "నిర్దేశించిన" పరిణామం అని అనొచ్చు. జన్యువులు ఎన్నికను, వాటి మార్పును నిర్దేశించి, అవసరమైన ప్రొటీన్లు అభివృద్ధి పరుచుకుని, ఎప్పుడో జరగబోయే పరిణామ దశల్ని నిర్దేశించి త్వరగా జరిగేట్లు చేయడమన్నమాట! విలియం పి.సి.స్టెమ్మర్ అనే డచ్ పరిశోధకుడు కూడా DNA SHUFFLING చేసి, ఇవే ఫలితాలు సాధించారు. కానీ, ఆయన తన 56వ యేట 2013లోనే కన్నుమూశారు. అందువల్ల ఆయనకు నోబెల్ తప్పిపోయింది.

డీఎన్ఏలను తిరగరాయడం వల్ల ఫ్రాన్సిస్ ఆర్నాల్డ్ అద్భుతమైన ఫలితాలు ప్రయోగశాలలో.. ప్రయోగ నాళికలో సాధించారు. పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించని జీవ ఇంధనాన్ని (BIOFUELS) తయారుచేయగలిగారు. అతి చల్లటి నీటిలో కూడా సమర్థవంతంగా పనిచేయగల వాషింగ్ డిటర్జెంట్స్ ఉత్పత్తి చేయగలిగారు. అంత చేసినా ఆ విజయాన్ని ఆమె తన ఖాతాలో వేసుకోలేదు. "ఇవి నేను స్వతహాగా సృష్టించిన నమూనాలేమీ కావు. ప్రకృతిని అర్థం చేసుకుని, ప్రకృతి నమూనాలకు ప్రతిరూపాలు చేయగలగడమే నేను సాధించిన విజయం.." అని ఆమె ఎంతో వినమ్రంగా ప్రకటించుకున్నారు. ప్రకృతి సూత్రాలను అర్థం చేసుకోవడం ఒక ఎత్తయితే, దాని ద్వారా మానవాళికి మహోపకారం చేయగలగడం మరొక ఎత్తు. అంత చేసినా ప్రకృతికి ఒదిగి ఉండగలగడం మరో గొప్ప సంస్కారం! తమకు తప్ప ఇతరులకు ఎవరికీ ఏ విధంగానూ ఉపయోగపడని పనులు చేసి గొప్ప మానవసేవ చేస్తున్నామని ప్రకటించుకునే వారిని ఏమందాం? మనిషి అనాలోచితంగా ఎంత దుర్మార్గంగా ప్రవర్తించినా ప్రకృతి అన్నింటినీ చక్కబెట్టుకుంటూ వస్తూ ఉంది. అందుకైనా మనుషులు ప్రకృతి పట్ల కృతజ్ఞతా భావంతో మసలుకోవాలి. భూమిలోనూ, పర్యావరణంలోనూ ఎక్కడా కలిసిపోని, కరిగిపోని ప్లాస్టిక్స్, పెస్టిసైడ్స్, హెర్బిసైడ్స్, యాంటీ బయాటిక్స్ విపరీతంగా వదిలేస్తున్నాం. దానికి పరిష్కారమేమిటీ? వాటిని నిర్మూలించగలిగే ఒక కొత్త ఎంజైమ్‌ను ఈ శాస్త్రవేత్త కొనుక్కోగలిగారు.

ఇది ఇలా ఉండగా అమెరికాలోని కొలంబియా మిస్సోరి యూనివర్సిటీకి చెందిన జార్జ్ పి.స్మిత్; బ్రిటన్‌లోని కేంబ్రిడ్జి – యం.ఆర్.సి. లేబొరెటరీ ఆఫ్ మాలిక్యులర్ బయాలజీకి చెందిన సర్ గ్రిగరీ.పి.వింటర్(67) వేరువేరుగా రసాయనిక శాస్త్రంలో మరో అద్భుతాన్ని సాధించారు. బాక్టీరియో ఫాగీ (BACTERIOPHAGE)ని రూపొందించారు. ఇది కొత్త ఎంజైమ్‌ల్ని రూపొందించుకోగలదు. ఈ బాక్టీరియాపై జరిగిన పరిశోధనల వల్ల మందుల ఉత్పత్తి (PHARMACEUTICALS)లో కొన్ని విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు చక్కని మందు తయారైంది. అది మార్కెట్లోకి కూడా వచ్చింది. కొన్ని రకాల కేన్సర్‌లకు ఉపశమనం లభించబోతోంది. కొన్ని రకాల విషపదార్థాల (TOXINS) ప్రభావం శరీరంపై పడకుండా (ANTIBODIES) కాపాడబడతాయి. నోబెల్ బహుమతి స్థాపించిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ స్వయంగా ఒక రసాయనిక శాస్త్రవేత్త. ఆయన పేరుతో ఉన్న ఈ బహుమతిని మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు అందించే ఇలాంటి రసాయనిక శాస్త్రవేత్తలకు అందడం చాలా సబబుగా ఉంది. డార్విన్ సిద్ధాంతం పనికిరాదని, ఈ దేశంలోని విద్యాసంస్థల్లో దాన్ని పాఠ్యాంశంగా బోధించకూడదన్న గౌరవ ప్రభుత్వ మూర్ఖులకు ఈ నోబెల్ బహుమతి ఒక చెంపదెబ్బ!

వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త బయాలజీ ప్రొఫెసర్, మెల్‌బోర్న్ నుంచి.

ఎన్నికల చుట్టూ రాజకీయాలు ఎంతకాలం?



సిహెచ్. మధు

ఎన్నికలు రాగానే భారత రాజకీయాలకు భయంజ్వరం పట్టుకొంటుంది. అధికారపిచ్చి తలకెక్కిన భారత రాజకీయాలతో కష్టమే! మామూలు జ్వరమైతే మందులకో మంత్రాలకో తగ్గుతుంది. కానీ, అధికార జ్వరమిది తొందరగా పోదు. భయం జ్వరంతో పిచ్చిపిచ్చి ప్రేలాపనలు ఎన్నో.. అయ్యేపని, కానిపని, ఎన్నో మాట్లాడుతారు. ఎలాగో అలా ఓటర్లను వలలో వేసుకోవాలి. తనకు ఎదురులేదని నిరూపించుకోవాలి. అందులో భాగమే అగ్రవర్ణాల పేదలకు పదిశాతం రిజర్వేషన్లు.

ఎన్నికలకు ఇంకా నాలుగు నెలలే ఉన్నాయి. నరేంద్రమోడీ గద్దెనెక్కి నాలుగున్నరేండ్లు గడిచాయి. ఈ నాలుగున్నరేండ్లలో నోట్ల రద్దు, జీఎస్టీ, రాష్ట్రాల అధికారం మీద పెత్తనం, రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థల వల, స్వతంత్ర్య రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు.. ఇలా చేయకూడనివెన్నో చేసేసారు. చేయాల్సిన పనులు, అవసరమైన పనులు మాత్రం చేయలేదు. ఎన్నికలలో యిచ్చిన వాగ్దానాలు ఒక్కటీ నెరవేర్చలేదు. విదేశీ బ్యాంకులలో మూలుగుతున్న 75లక్షల కోట్లు తెచ్చి ప్రతి యింటికి 15లక్షలు పంచుతాననే మాట నరేంద్రమోడీ మర్చిపోయారు. ఏటా కోటి ఉద్యోగాల కల్పన వట్టిమాటే కాగా, ఉన్న ఉద్యోగాలే ఊడిపోతున్న దుస్థితి. బీజేపీ ఆ వాగ్దానాలన్ని చుట్టచుట్టి అయోధ్య చిచ్చులో పారేసింది. ఈ నాలుగున్నరేండ్ల కాలంలో ఏ ఒక్క వాగ్దానం నెరవేర్చని నరేంద్రమోడీ ప్రభుత్వం అకస్మాత్తుగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు అంటూ చట్టం తెచ్చి రెండు రోజులలో ఏ చర్చా లేకుండా, మంచీ చెడూ బేరీజులు లేకుండా లోక్‌సభ–రాజ్యసభల్లో ఆమోదం పొందగలిగింది. నరేంద్రమోడీ ప్రభుత్వం ఈ బిల్లును తెస్తే.. అన్ని రాజకీయ పక్షాలు ఆమోదం తెలిపాయి. బిల్లు ఎందుకు? ఏమికథ? ఉన్నత న్యాయస్థానం అంగీకరిస్తుందా? ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఏ విధంగా ఉపకరిస్తుంది? అసలు రిజర్వేషన్లు ఎంతకాలం? ఈ అనుమానాలు మాత్రం ఇప్పట్లో తీరేలా లేవు! అందరూ రిజర్వేషన్‌ల ద్వారా లాభపడాలని చూస్తున్నారు. రిజర్వేషన్‌లు ఇప్పుడు బడుగు బలహీన వర్గాల జీవన మనుగడకు కాకుండా ఓటు బ్యాంకు సాధనాలుగా మారిపోయాయి. 50శాతం మించకూడదనే సుప్రీంకోర్టు ఆదేశాలను ఎవరూ పాటించటం లేదు. సుప్రీం కోర్టు ఆదేశాలకు లెక్కేలేకుండా పోయింది. ఇంచుమించు అన్నీ రాజకీయ పక్షాలు బిల్లు ఆమోదానికి ముద్ర వేసాయి. ఈ బిల్లు కేవలం అగ్రవర్ణ ఓట్ల కోసం నరేంద్రమోడీ ప్రభుత్వం తెచ్చింది. కాగా అదే ఓట్ల కోసం ప్రతిపక్షాలూ మద్దతు తెలిపాయి. మాటవరసకు ఏవో మాట్లాడారు. కానీ బిల్లును కాదనలేకపోయారు. ఎందుకూ? అందరికీ అగ్రవర్ణ ఓట్లు కావాలి.. బిల్లు

ఆర్థిక అంతరాలను తగ్గించాలనే దృష్టి ఏ పాలకపక్షానికి లేదు. కానీ ఓట్ల వేటలో రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. రెట్టింపు పెన్షన్‌లు, డబుల్ బెడ్‌ద్రూమ్‌లు, కళ్యాణలక్ష్మిలు ఇలా ఎన్నో ఎన్నో పోటా పోటీగా ప్రకటిస్తూ ప్రజలను బిచ్చగాళ్లుగా మార్చుతున్నారు. ప్రజలెప్పడూ అట్టడుగునే ఉండాలి. ప్రతి అవసరానికి తమవైపే ఆశగా ఎదురుచూడాలి. అప్పడే ఓట్లు రాల్చుకోవచ్చు.

లక్ష్యం స్పష్టంగా అర్థమౌతూనే ఉంది. అగ్రవర్ణాల ఓట్లు రాబట్టటానికే మోడీ ప్రభుత్వం ఓ వలవేసింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలని అన్నా అగ్రవర్ణ దృష్టితోనే బిల్లు తెచ్చారు. ఈ దేశంలోని అగ్రవర్ణ పేదలు ఎప్పటి నుండో తమకు రిజర్వేషన్లు అవసరమని డిమాండ్ చేస్తున్నారు. అగ్రవర్ణాలలో పేదలు ఎంతమేరకు ఉన్నారు? ఎంతశాతం ఉన్నారు? ఏ ప్రాతిపదికపై వారిని నిర్ణయిస్తారు? ఈ వివరాలేమీ ఈ బిల్లు ద్వారా అగ్రవర్ణాల ఓట్లను మాత్రం గెల్చుకోవచ్చు. అందుకే ఇదంతా... ఓట్ల కోసమే... ఎంతకాలం ఈ ఓట్ల రాజకీయాలు..? ఎంతకాలం ఓట్ల కోసం రిజర్వేషన్ల వల..?



ప్రజల ఓట్ల కోసం ప్రజలను వంచించడం అనాదిగా పాలకవర్గ పార్టీలకు, నాయకులకు ఒక ఫ్యాషన్‌గా మారింది. అధికారం పిచ్చి అందరికీ తలకెక్కింది. ఏది మంచి? ఏది చెడు అన్న విచక్షణే లేదు. ఎవరో ఏదో మాట్లాడితే అర్థం చేసుకోవచ్చు. భారతదేశ ప్రధాన మంత్రిగా తనను తాను గొప్పగా చెప్పుకునే నరేంద్రమోడీకి, తన చరిష్మాకు ఎదురే లేదని దిక్కులు పిక్కటిల్లేలా చెప్పుకునే నరేంద్రమోడీకి ఈ అవసరం ఎందుకొచ్చింది. మూడు రాష్ట్రాల ఎన్నికలలో బీజేపీ ఘోరంగా ఓడిపోయిన తర్వాత కొత్త ఎత్తుగడలకు రూపకల్పన చేశారు. ఈ కొత్తచట్టం వలన అగ్రవర్ణ పేదలు లాభపడుతారా? ఏవిధంగా లాభపడతారు? అగ్రవర్ణాలలో పేదలున్న మాట నిజమే. అగ్రవర్ణ పేదలను ఆదుకోవటం తప్పుకాదు. పేదలు ఎవరైనా పేదలే! మనదేశంలో 80శాతం పేదలున్నారు. ఎలాగో బతుకుతున్నారు. నూటికి ఒకశాతం కోటీశ్వరులున్నారు. మోడీ ఎందుకోసం తెచ్చారు ఈ బిల్లు.. అగ్రవర్ణాల ఓట్ల కోసం తెచ్చారు. అగ్రవర్ణాల పేదలకు న్యాయంజరగాల్సిన మాట నిజమే! ఈ మాట అంగీకరించిన తర్వాత ఒక ప్రశ్న సహజంగా వస్తుంది. స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన ప్రభుత్వాలన్నీ.. మోడీ ప్రభుత్వంతో సహా.. ఎవరైనా ఈ దేశంలోని పేదలకు న్యాయం చేసారా? పేదల గూర్చి ఆలోచించారా? నిజంగా ఆలోచిస్తే.. పేదల బతుకులు ఇలా ఉండేవా? ఆర్థిక అంతరాలు ఇంత పెరిగేవా? కోట్ల సంఖ్యలో నిరుద్యోగులు ఉండేవారా? లక్షల సంఖ్యలో ఆత్మహత్యలు జరిగేవా? దేశ సంపద మొత్తం ఒకశాతం వద్ద పోగయ్యేదా? ఈ పాతికేండ్లలో రిజర్వేషన్ల మూలంగా అణగారిన వర్గాలు ఏమైనా లాభపడినాయా? ఉద్యోగాలు అసలు లేవు. కొత్త రిక్రూట్‌మెంట్స్ లేవు. రిటైర్‌మెంట్స్‌ను కూడా భర్తీ చేయటం లేదు. పాతికేండ్లుగా రిజర్వేషన్లు నామమాత్రంగా మారిపోయాయి. రిజర్వేషన్ల మూలంగా ఇప్పటి వరకు రిజర్వేషన్లు ఉన్నవారే అనుభవించటానికి ఏమీ లేనప్పుడు కొత్తగా అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేన్లతో లాభమేమిటి? చదువులో కొంతపని చేయవచ్చు. ఏటా ఒక కోటిపైగా ప్రతీ సంవత్సరం విద్యార్థులు నిరుద్యోగులుగా మారుతున్నారని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్ అన్నారు. రిజర్వేషన్లు ఉన్న వారికే ఉద్యోగాలు లేవు. కొత్తగా ఈ 10శాతానికి ఉద్యోగాలు ఎక్కడి నుంచి తెస్తారు? ఇదంతా ఓట్ల కోసం అగ్రవర్ణాలను ఆకర్షించటానికే..!

అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు అణగారిన వర్గాలను అవమానించటం గానే భావించాలి. రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్లు ఎందుకు కల్పించారు. ఒక్క ఆర్థిక దృష్టితో కల్పించలేదు. తరతరాలుగా కొన్ని కులాలు అణచివేతకు, అంటరాని తనానికి, వివక్షకు గురయ్యాయని, వీరు అగ్రవర్ణాలతో సమానంగా స్వాతంత్ర్య భారతంలో ఎదగాలని ఇచ్చారు. ఆర్థిక దృష్టి, ఉద్యోగ దృష్టి ఒక్కటే ప్రాతిపదిక కాదు. రిజర్వేషన్ల విషయంలో రాజ్యంగ నిర్మాతల అంతరంగం కుల నిర్మూలన. కానీ మోడీ ప్రభుత్వ అంతరంగం అధికార సాధన.

ఆర్థిక అంతరాలను తగ్గించాలనే దృష్టి ఏ పాలకపక్షానికి లేదు. కానీ ఓట్ల వేటలో రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. రెట్టింపు పెన్షన్‌లు, డబుల్ బెడ్‌ద్రూమ్‌లు, కళ్యాణలక్ష్మిలు ఇలా ఎన్నో ఎన్నో పోటా పోటీగా ప్రకటిస్తూ ప్రజలను బిచ్చగాళ్లుగా మార్చుతున్నారు. ప్రజలెప్పడూ అట్టడుగునే ఉండాలి. ప్రతి అవసరానికి తమవైపే ఆశగా ఎదురుచూడాలి. అప్పుడే ఓట్లు రాల్చుకోవచ్చు.

సెల్: 9949486122



'మాయమైపోతున్నడమ్మా...మనిషన్నవాడు' అంటూ ప్రతి ఒకరూ సాటి మనిషిని వెతుక్కోవలసిన పరిస్థితి. ఆధునిక యాంత్రిక యుగంలో మనిషి ఉనికి ప్రమాదస్థితిలో ఉంది. భాష, సంస్కృతి, మానవసంబంధాలు కనుమరుగైపోతున్న తరుణంలో వాటిని కాపాడుకుంటూ మన ఉనికిని కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ 'అస్థిత్వం' పేరుతో సంస్థను స్థాపించారు చింతలూరి మంజాల గౌర్. ఉపాధ్యాయురాలిగా మూడు దశాబ్దాల అనుభవం ఉన్న ఆమె కేవలం విద్యారంగానికే పరిమితం కాకుండా సమాజంలో అవగాహన పెంచాల్సిన ఉపాధి, న్యాయ రంగాల్లో సేవలందిస్తున్నారు. సామాజిక సేవ ద్వారా గ్రామీణప్రాంతాలకు ఆధునిక విజ్ఞానాన్ని అందిస్తున్న ఆమె పరిచయం..

ఉనికి కాపాడుకునేలా..

మా తాతగారు చింతలూరి సుబ్రమణ్యంగారు. గణితశాస్త్రంలో గోల్డ్‌మెడల్ అందుకున్న ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు. సి.వి.రామన్‌గారు ఆయన ఒకే బ్యాచ్. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు వైస్‌ఛాన్సలర్‌గా ఉన్న కాలేజీలో గణితం ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన ఇంజనీరింగ్ సిలబస్ రాసిన వారిలో ఒకరు. ఆరోజుల్లోనే కులాంతర వివాహాలతో పాటు అనవసరపు ఖర్చులేకుండా రిజిష్టర్ పెండ్లిలను ఆయన ప్రోత్సహించేవారు. నాన్న కృష్ణ గౌర్ కొల్‌కత్తాలో పనిచేస్తున్న సమయంలో నేను పుట్టాను. ఆ తర్వాత మా కుటుంబం హైదరాబాద్‌కు వచ్చేసింది. ఇక్కడ ఒక కంపెనీలో పనిచేస్తున్న సమయంలో మేం చాలా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాం. అమ్మ లక్ష్మిగౌర్ మాకు ఎంతో సపోర్ట్ ఇచ్చేవారు.

ఎనిమిదో తరగతి నుంచే..

ఇంట్లో ఇద్దరినీ చదివించే స్థోమత లేకపోవడంతో తమ్ముడు మనోజ్ గౌర్‌ని మాత్రమే చదివించాలనుకున్నారు. చదువుపై మక్కువ పెంచుకున్న నేను బడి మానడం ఇష్టం లేక ఎనిమిదో తరగతి నుంచే ట్యూషన్స్ చెప్పడం ప్రారంభించాను. అలా నా ఫీజులు నేను కట్టుకోవడంతో పాటు ఇంట్లో కొద్దిగా చేదోడుగా ఉండేదాన్ని. పదోతరగతి ప్రైవేటుగా రాసి మంచి మార్కులతో పాస్ అయ్యాను. ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేశాను. టీచర్‌గా వెంగళ్‌రావు నగర్ లోని సెయింట్ అల్ఫోన్సాన్ ఉన్నత పాఠశాలలో చేరాను. అక్కడ దాదాపు 12ఏండ్లు టీచర్‌గా డిసిప్లెయిన్ కమిటీ సభ్యురాలిగా పనిచేశాను. ఆ తర్వాత కొంపల్లిలోని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ లాబ్ ఇన్‌చార్జీగా దాదాపు ఐదేండ్లు పనిచేశాను. ఒకవైపు ఉద్యోగం చేస్తూ మరోవైపు ఉన్నతవిద్యను అభ్యసించాను. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ఇంగ్లీష్ కౌన్సెలర్‌గా సికింద్రాబాద్ పిజీ కాలేజ్‌లో బేగంపేటలోని మహిళా డిగ్రీ కాలేజ్‌లోనూ పనిచేశాను. సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్‌లో వర్బల్ అప్టిట్యూడ్‌లో శిక్షణ ఇవ్వడంతో వివిధ సంస్థలకు సేవలందించాను. సరూర్‌నగర్‌లోని లయోలా స్కూల్ అడ్వైజరీబోర్డు మెంబర్‌గా ఉన్నాను.

స్పోకెన్ ఇంగ్లీష్..

సులభంగా ఇంగ్లీష్‌లో మాట్లాడటానికి, గ్రామర్ నేర్చుకోవడానికి అవసరమైన కొన్ని బుక్స్ రాసాను. ఇంగ్లీష్ అంటే పిల్లల్లో ఒకలాంటి భయం. ముందుగా వారిలో ఉండే ఈ భయాన్ని తీసివేస్తే.. చాలా సులభంగా వారు ఇంగ్లీష్ నేర్చుకోగలుగుతారు. ఈ విషయంపై చాలా కాలేజీల్లో మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించాను. ఇందుకోసం 2015లోఎడ్యూరెజ్ అనే సంస్థను ప్రారంభించాం. ఈ సంస్థ ద్వారా బి.టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థు లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కేవలం విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయుల్లోనూ భాషానైపుణ్యాల కోసం వర్క్‌షాప్స్ ఏర్పాటుచేస్తున్నాం. సామాజిక సేవరంగంలో ఇంజనీరింగ్ విద్యార్థులు చేసే ప్రాజెక్ట్‌లో సహకారం అందించేలా సిఎంఆర్ సిఐపి విద్యాసంస్థలతో ఒప్పందం చేసుకున్నాం.

గ్రామాల అభ్యున్నతి కోసం..

మన దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి గ్రామాలే కేంద్రబిందువులు. గ్రామస్వరాజ్యంతోనే దేశం సుసంపన్నం అవుతుంది అని మన పెద్దలు చెప్పిన మాటే మా బాటగా మార్చుకున్నాం. పట్టణాల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక విద్య గ్రామాలకు తీసుకువెళ్ళాలన్న లక్ష్యంతో మా కార్యక్రమాలను విస్తరించాం. మొదటి విడతగా గ్రామజ్యోతి కింద మన తెలంగాణ రాష్ట్రం దత్తత తీసుకున్న సిరిసిల్ల నియోజకవర్గంలో నాలుగు గ్రామాలను ఎంపిక చేసుకుని ఇక్కడ విద్యార్థుల, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. అదే విధంగా స్మార్ట్ విలేజ్ స్మార్ట్ వార్డ్ ప్రాజెక్టులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని చోడవరం, వడ్డది గ్రామాలను తీసుకున్నాం. ఇక్కడి ప్రజలను చైతన్యవంతం చేస్తూ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తున్నాం.



చిన్న తరహా పరిశ్రమలకు అండగా..

అంగడి పేరుతో 2017లో చిన్నతరహా పరిశ్రమను ప్రారంభించాం. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ.. జూట్, పేపర్ ప్రాడక్ట్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. మహిళలకు ఉపాధి కల్పిస్తూ.. పర్యావరణాన్ని రక్షిస్తున్నాం.

సామాజిక సేవ దిశగా..

ఇంటలెక్చువల్లీ డిసెబుల్డ్ పిల్లల కోసం ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యా, ఉపాధి రంగాలతో పాటు సామాజిక సేవారంగంలోనూ చురుగ్గా పాల్గొంటున్నాను. నవజోతి మహిళా మండలి సభ్యురాలిగా, హైదరాబాద్ జిల్లా మహిళా మండల సమాఖ్య కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలిగా, జన జాగృతి సేవా సమితి కోసం కోశాధికారిగా, తలాసేమియా సికిల్ సెల్ సొసైటీ సభ్యురాలిగా, మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలిగా సేవలందిస్తున్నాను.

ఉనికి ముఖ్యం..

మేం చాలా ఓల్డ్‌ఏజ్ హోమ్స్, ప్రభుత్వ స్కూల్స్‌కు వెళ్లినప్పుడు అక్కడ పరిస్థితులను చూసిన తర్వాత ఒక ఆలోచన వచ్చింది. మనం ఎటు పోతున్నాం.. అన్న ఆలోచన.. పెద్దలను ఓల్డ్‌ఏజ్ హోమ్స్‌కు, పిల్లలను హస్టల్స్‌కు పంపించి నేటి తరం మానవసంబంధాలను మరిచిపోతుంది అనిపించింది. దీనిపై పనిచేయాలనుకుంటున్న సమయంలో మన భాష, సంస్కృతి ఎటు పోతుంది... మన ఉనికిని మనం కోల్పోతున్నాం అనిపించింది. భాషను, సంస్కృతిని పరిరక్షించుకుంటే విలువలు, మానవసంబంధాలు మెరుగుపడుతాయి అన్న ఆలోచనతో 'అస్థిత్వం' సంస్థను ప్రారంభించాం. రమాదేవి, షేక్ నసీమా బేగం ఈ సంస్థ ఏర్పాటులో ఎంతో సహకరించారు. స్కూల్స్, కాలేజీల్లో తెలుగుభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నాం. ఇంటలెక్చువల్లీ డిసెబుల్డ్ పిల్లల కోసం ప్రత్యేకంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నాం. పోటీల్లో వచ్చిన వ్యాసాలు, చిత్రాలను పుస్తకం రూపంలో తీసుకువస్తున్నాం. వివిధ రంగాల్లో భాషాభి వృద్ధి కోసం పాటుపడుతున్న వారిని గుర్తించి మాతృభాషాది నోత్సవం రోజు వారిని సత్కరిస్తున్నాం. ఇటీవల రూపొందించిన మాతృక డాక్యుమెంటరీని అస్థిత్వం సంస్థకు అంకితం ఇచ్చారు. మానవసంబంధాలను పటిష్టపరుస్తూ.. మన ఉనికిని కాపాడుకునేలా డాక్యుమెంటరీలను రూపొందిస్తున్నాం.

న్యాయసేవలు అందిస్తూ..

విద్య, ఉపాధి రంగాలలో పనిచేస్తున్న సమయంలో న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న అనేక మంది మహిళలు తారసపడ్డారు. వారికి ఉచితంగా న్యాయసేవలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ లీగల్ ఎయిడ్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సహకారంతో హైదరాబాద్‌లో 19లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్నాం. పారా లీగల్ వాలంటీర్స్‌గా కొంతమందికి శిక్షణ ఇచ్చి వారి సహాయంతో కౌన్సెలింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్నాం. స్థానికంగా ఉన్న కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసే లీగర్ ఎయిడ్ క్లినిక్‌లో ఇద్దరు పారా లీగల్ వాలంటీర్లు, ఒక ప్యానల్ లాయర్ అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

కథల రూపంలో..

సమాజంలో సమస్యలు ఎదుర్కొంటున్నవారు ఎందరో ఉన్నారు. వారి సమస్యలను .. వాటిని అధిగమించి జీవితాన్ని ఎలా మలుచుకున్నారో తెలిపే ఇతివృత్తాలతో కథలను వారిచేతనే రాయించి పుస్తకరూపంలో తీసుకువస్తున్నాం.

వి. యశోద





క్లోరిన్ శాతం ఎక్కువైతే...

ఎంతో ఖరీదు పెట్టి నగలని ఇష్టంగా కొంటాం. వాటిల్లో ముత్యాలు, విలువైన రాళ్ల, వజ్రాలు ఉంటాయి. ఇలా ఎన్నో రకాల విలువైన నగలు ఉంటాయి. చిన్న నిర్లక్ష్యం జరిగినా త్వరగా పాడవుతాయి. అలా కాకుండా వాటిని జాగ్రత్తగా కాపాడుకునేందుకు కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరి.

- ఏవైనా నగలే అన్నట్టుగా అన్నిరకాల నగలనీ ఒకేచోట కుప్పగా పెట్టకూడదు. రాళ్లనగలు, ముత్యాల నగలూ ఒకేచోట ఉండకూడదు. ఉంటే ఒకదానితో ఒకటి రాపిడికి గురై గీతలు పడి ఆభరణం అందమంతా పోతుంది.



- పెద్ద పెద్ద హారాలను, విలువైన చెవి పోగులను ఒకేచోట కాకుండా వేర్వేరు వెల్వెట్ సంచులు కొని విడివిడిగా పెట్టాలి. అప్పుడు అన్నింటినీ కలిపి ఓ పెద్ద పెట్టెలో భద్రపరచుకోవచ్చు.
- ముత్యాలతో చేసిన నగలను చాలా జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ఇవి రసాయనాల ప్రభావానికి గురయ్యే ఆస్కారం చాలా ఎక్కువ. ముఖ్యంగా తలకు వాడే స్ప్రేలు వీటి అందాన్ని తొందరగా దెబ్బ తీస్తాయి. అందుకని జుట్టు అలంకరణ, దుస్తుల అలంకరణ పూర్తి అయిన తర్వాతనే స్ప్రేలు, పరిమళాలు చల్లుకున్న తర్వాతే నగలు ధరించడం మంచిది.
- పగడాలు, దంతాల నగలని బ్రష్ పెట్టి శుభ్రం చేస్తే గీతలు పడతాయి. అందుకని మెత్తని వస్త్రంతో కానీ, దూదితో కానీ అద్దినట్టుగా శుభ్రం చేయాలి.
- కుళాయి నీటిలో క్లోరిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఆ నీటితో శుభ్రం చేస్తే వాటి అందం దెబ్బతింటుంది.
- ముత్యాలను దారాలతో గుచ్చితే కనుక ఆ దారాన్ని రెండేళ్లకోసారి మార్చడం తప్పనిసరి. ముత్యాల నగలను కచ్చితంగా మెత్తని పాతవస్త్రంలో మాత్రమే చుట్టి భద్రపరచుకోవాలి. ❄

ఇట్లా చేద్దాం

తలంటుకునే ముందు వెంట్రుకలకు కలబంద రసం పూసి అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు నిగనిగ మెరుస్తుంది.



ఒక మహిళకు పెళ్లయినా, కాకపోయినా ఆమెకు నచ్చిన దుస్తుల్ని ధరించే స్వేచ్ఛ ఉంది. అమ్మాయిలకు సుద్దులు చెప్పే ఈ సంస్కృతికి ఎప్పటికి తెరపడుతుందో.

- విద్యుల్లేఖ రామన్

మధుమేహానికి మంచి ఔషధం



బొప్పాయి చెట్టులోని ప్రతీ భాగం ఔషధ విలువలు కలిగిందే. పచ్చి బొప్పాయిల్లో ఉండే పెప్టిన్ మూత్ర వ్యాధుల్ని అరికట్టి ప్లీహగ్రంథి, కాలేయ వాపులను తగ్గిస్తుంది. సూర్యరశ్మి వల్ల కొందరికి శరీరంపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. వాటిని పచ్చి బొప్పాయి రసం తగ్గిస్తుంది. కాయల నుంచి స్రవించే పాలలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది అరుగుదలకు బాగా సహకరిస్తుంది. అందుకే ఈ పాలను ఔషధాలు, చూయింగ్ గమ్‌ల తయారీకి ఉపయోగిస్తున్నారు. పేలుడు పదార్థాల తయారీల్లోనూ వాడుతున్నారు. మిగతా పండ్లతో పోల్చితే బొప్పాయిలో కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇందులో ఉండే విటమిన్లూ ఎక్కువే. కానీ చక్కెరలు తక్కువుంటాయి. కాబట్టే స్థూలకాయులకు, మధుమేహం ఉన్నవారికి మంచి ఔషధం.

ఈ పండు గుజ్జులో హానికారక బాక్టీరియాను నశింపచేసే గుణముంది. యాంటీ బయాటిక్స్ వాడిన తరువాత శరీరంలోని మంచి బాక్టీరియా కూడా కొంత నశిస్తుంది. దాన్ని తిరిగి ఏర్పరిచేందుకు బొప్పాయి ఉపయోగపడుతుంది. శరీరంలోని పలు జబ్బులకు కారణం క్రమబద్ధమైన ఆహారం తీసుకోకపోవడమే. వాటిని మటుమాయం చేసేందుకు తరచూ బొప్పాయి పండును ఆహారంగా సేవించాలంటున్నారు. పులియబెట్టిన బొప్పాయి నుంచి పపైన్ అనే ఆయింటుమెంటు తయారు చేస్తారు. అది మంచి నొప్పి నివారిణి. ఆసియా దేశాల్లో బొప్పాయి గింజలను మిరియాలకు బదులుగా వాడుతారు. ఇవి ఘాటులో మిరియాలకు ఏ మాత్రం తీసిపోవు. గింజలను ఎండబెట్టి పొడిచేసి నేతితో కలిపి తీసుకుంటే కడుపులో పురుగులు నశిస్తాయి. నరాల వాపు తగ్గేందుకు ఆకులు బాగా ఉపయోగపడుతాయి. వాటిని వేడి నీటితో కలిపి నూరి నరాలపై రాస్తే వాపు తగ్గుతుంది.

ఇబ్బంది ఎక్కడ?

నెలలు నిండే కొద్దీ గర్భంలో బిడ్డ నిండైన రూపం దిద్దుకుంటుంది. అంత సమయం పాటు ఆగకుండా ముందే పుట్టేస్తే, పూర్తిగా తయారవాల్సిన అవయవాల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోతుంది. అలా పుట్టిన పిల్లలను నెలలు నిండి పుట్టిన పిల్లలతో సమానంగా ఆరోగ్యకరంగా మార్చడం అనేది వైద్యుల, తల్లితండ్రుల చేతుల్లోనే ఉంటుంది. ప్రి మెచ్యూర్, ఎక్స్‌ట్రీమ్ ప్రి మెచ్యూర్.... ఈ రెండు కోవలకు చెందిన పిల్లల ఎదుగుదల క్రమాన్ని వాళ్లు పుట్టినప్పటి నుంచి కాకుండా నెలలు పూర్తిగా నిండి పుట్టిన సమయం నుంచి లెక్క వేయవలసి ఉంటుంది. అలాగే ఎదిగే క్రమంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపరంగా చూస్తే, ఎక్స్‌ట్రీమ్‌తో పోల్చుకుంటే ప్రి మెచ్యూర్ పిల్లలు కొంత మేలు!



నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు కొన్ని ఉన్నాయి.

చూపు సమస్యలు: చూపు, వినికిడి సమస్యలు అత్యంత సహజం. కంటి చూపుకు సంబంధించి... మెల్లకన్ను రావొచ్చు. కంటి చూపు తగ్గొచ్చు. వినికిడి సమస్యలు కూడా ఉంటాయి.

ఎదుగుదల: బోర్లా పడడం, తల నిలబెట్టడం, కూర్చోవడం, నిలబడడం, వస్తువులను పట్టుకోవడం.. ఈ అంశాల్లో కొంత ఎదుగుదల తగ్గవచ్చు. మాటలు కూడా ఆలస్యమవవచ్చు.

హైపర్ యాక్టివ్: ప్రి మెచ్యూర్ పిల్లల్లో ఎ.డి. హెచ్.డి సిండ్రోమ్ (ఎటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ సిండ్రోమ్) తలెత్తవచ్చు.

వినికిడి సమస్యలు: పుట్టిన వెంటనే పరీక్ష చేసినా, ప్రతి మూడు నెలలకు వినికిడి పరీక్షలు అవసరమవుతాయి. అంతా మామూలుగా ఉంటే ఏడాది వయసుకు వచ్చిన తర్వాత పరీక్ష చేయించాలి.

నాడీ సంబంధమైన ఎదుగుదల: ప్రి మెచ్యూర్ బేబీలలో మోటార్ (నడక, అవయవాల కదలికలు, సెన్సరీ (స్పర్శ, స్పందించే గుణం) కాగ్నిటివ్ (తెలివితేటలు)... ఈ అంశాల్లో సమస్యలు తలెత్తవచ్చు. ఈ సమస్యలన్నీ మెదడులో ఇన్‌ఫెక్షన్ లేదా రక్తస్రావం అయితే డెవల్‌పమెంట్ సమస్యలు తలెత్తుతాయి. రక్త పరీక్ష కోసం పసికందులకు పదే పదే సూది గుచ్చడం వల్ల కూడా మెదడు మీద ప్రభావం పడి రక్తస్రావం జరగవచ్చు. గర్భిణికి మధుమేహం అదుపు తప్పినా, పోషకాలు తగ్గినా, ఇన్‌ఫెక్షన్లు ఉన్నా నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలో మెదడు ఎదుగుదల తగుమాత్రంగా ఉండకపోవచ్చు. ఈ కారణాల వల్ల మెదడు ఎదుగుదల కుంటుపడి, తెలివితేటల మీద ప్రభావం పడవచ్చు. ఈ నష్టం జరిగిపోయిన తర్వాత సరిదిద్దే చికిత్సలు లేవు, కాబట్టి ఇలా జరగకుండా నియంత్రించుకోవడం ఒక్కటే మార్గం!

ముందే జాగ్రత్త పడాలి! : నెలలు నిండకుండా పిల్లలు పుట్టే అవకాశం ఉన్న గర్భిణులు ఎంతో ముందుగానే సకల సదుపాయాలూ ఉన్న ఆస్పత్రికి చేరుకోవాలి. ఆ ఆస్పత్రిలో ప్రసవం జరిగిన వెంటనే పిల్లలకు అందించవలసిన వైద్య సౌకర్యాలు అన్నీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. నెలలు నిండకుండా పుట్టే పిల్లల షుగర్ లెవెల్స్, శరీర ఉష్ణోగ్రతలను క్రమంలో పెట్టాలి. లేదంటే, నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు నాలుగు రోజుల్లోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అలా జరగకుండా పిల్లలను ఇంక్యుబేటర్‌లో ఉంచి, వెంటిలేటర్ సహాయంతో వైద్యం అందించగలగాలి. ❄

స్ట్రెచ్‌మార్క్స్ పోవాలంటే..?



గర్భం ధరించినప్పుడు బరువు పెరగడం, రంగు మారడం వల్ల గీతలు పడతాయి. వాటినే స్ట్రెచ్‌మార్క్స్ అంటారు. ఈ సమయంలో ఉన్నట్టుండి బరువు పెరగడం వల్ల చర్మం అడుగున ఉన్న ఫైబర్ విరిగి స్ట్రెచ్‌మార్క్స్ వస్తాయి. కొన్నిసార్లు వంశపారంపర్యంగా ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు గర్భంలో ఉన్నప్పుడు, బిడ్డ మరీ బరువుగా ఉన్నప్పుడు కార్టిజోన్ ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు, స్టెరాయిడ్ క్రీము వాడినా, హార్మోను అసమతుల్యత ఉన్నా ఇలా స్ట్రెచ్‌మార్క్స్ రావచ్చు. ఈ సమస్య వచ్చిన తరువాత కాకుండా ముందు నుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే స్ట్రెచ్‌మార్క్ మరీ ఎక్కువగా రాకుండా జాగ్రత్త పడవచ్చు.

- పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలి. జంక్‌ఫుడ్, స్వీట్ పదార్థాలు, శీతపానీయాలకు దూరంగా ఉండాలి.
- యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, ఈ, ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవాలి. అంటే నిమ్మపండ్లు, తోటకూర, క్యారెట్, క్యాప్సికం, పుచ్చకాయ వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి.
- మంచినీళ్లు, పండ్లు, కూరగాయలు తగు మోతాదులో తీసుకోవాలి. అలాగే యోగా, స్ట్రెచెస్ వేయడం, క్రమం తప్పకుండా నడవాలి. ఒకేసారి బరువు పెరగకుండా చూసుకోవాలి.
- కలబంద గుజ్జులో ఒక చెంచా ఆలివ్ నూనె, కోకో బటర్ కలిపి పొట్టపై పూతలా వేసుకోవాలి. అరగంటయ్యాక చల్లని నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచుగా చేస్తుంటే స్ట్రెచ్‌మార్క్స్ కొద్దిగా తగ్గుతాయి. ❄



తడిబట్టతో తుడిస్తే...

- ఫర్నిచర్ మీద పెన్సిల్ గీతలు, క్రేయాన్ మరకలు, సిరా మరకలు పడ్డాయా? అయితే తడిపిన స్పాంజ్ మీద కొంచెం బేకింగ్ సోడా చల్లి దాంతో ఆ మరకల మీద రుద్దండి.
- ఒక లీటర్ నీళ్ళలో కొంచెం బేకింగ్ సోడా వేసి ఆ నీటితో ఫ్లాస్క్‌ను శుభ్రం చేస్తే దానిలోని వాసనలన్నీ మాయమవుతాయి.
- తడిపిన స్పాంజ్ మీద కొంచెం బేకింగ్ సోడా చల్లి దాంతో ఫ్రిజ్‌ను తుడిస్తే శుభ్రంగా ఉంటుంది. ఒక చిన్నబాక్స్‌లో కొంచెం బేకింగ్ సోడాను ఉంచి దాన్ని ఫ్రిజ్‌లో ఉంచితే దుర్వాసనలన్ని పోయి చక్కగా ఉంటుంది.
- కొంచెం బేకింగ్ సోడాను పేస్టులాగా చేసి దాన్ని వంటగదిలో గ్యాస్ స్టవ్ చుట్టు పక్కల జిడ్డుగా ఉన్న చోట రాసి ముందు తడిబట్టతో ఆపై పొడిబట్టతో తుడిస్తే శుభ్రపడుతుంది
- కొంచెం వేడి నీళ్ళలో ఒక చెంచా బేకింగ్ సోడా వేసి దానిలో మురికిగా ఉన్న దువ్వెనలు, బ్రష్‌లు వేసి, కొంచెంసేపు తర్వాత మంచి నీళ్ళతో కడిగితే మురికి పోతుంది ❄

ఢిల్లీలో వడగండ్ల వాన



ఎకరాకు రూ.10 వేలివ్వాలి

- ఏఐకేఎంఎస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సాయం ఎకరాకు రూ.6 వేలు సరిపోదనీ, రూ.10 వేలు చెల్లించాలని ఆలిండియా కిసాన్ మజ్దూర్ సభ (ఏఐకేఎంఎస్) డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఏఐకేఎంఎస్ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర అధ్యక్షులు వి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగయ్య ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో కంటితుడుపు చర్యగా ఐదెకరాల్లోపు రైతులకు రూ.6 వేల సాయం చెల్లిస్తామని ప్రకటించిందని తెలిపారు. రైతులకు ఎకరాకు చెల్లించే సాయం రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పోడు, కౌలు, వ్యవసాయ కూలీలకూ రూ.10 వేలు చెల్లించాలని కోరారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం సమగ్ర పంట ఖర్చుల మీద 50 శాం మద్దతు ధర ప్రతిపాదించాలని తెలిపారు. రైతు రుణ విముక్తి ప్రతిపాదన చేయకుండా, పసుపు పంట క్వింటాలుకు రూ.15 వేలు, ఎర్రజొన్నకు రూ.3,500 ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఉపాధి పనులు వెంటనే ప్రారంభించి కూలీలకు విస్తృతంగా పనులు కల్పించాలని కోరారు. రోజుకూలీ రూ.500 చెల్లించాలని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలోని సౌకర్యాన్ని కూలీలకు కల్పించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సేకరించే తునికాకు 50 ఆకుల కట్టకు ధర రూ.30 చెల్లించాలని కోరారు. ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని తెలిపారు.

పూల రవీందర్‌కు ఆట మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి ఖమ్మం-నల్లగొండ-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీఆర్టీయూ బలపర్చిన అభ్యర్థి పూల రవీందర్‌కు ఉత్తమ ఉపాధ్యాయుల అసోసియేషన్ (ఆట) మద్దతు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావును కలిసి మద్దతు లేఖను అందించామని ఆట అధ్యక్షులు బెక్కంటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ రంగాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

జల సంరక్షణ అందరి బాధ్యత

కేంద్ర జలసంఘం చైర్మెన్ మసూద్ హుస్సేన్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

జల సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని కేంద్ర జలసంఘం చైర్మెన్ మసూద్ హుస్సేన్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ తరహాలో ఇది ఒక ఉద్యమంలా ముందుకు సాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. జలసంరక్షణ-మన బాధ్యత అనే అంశంపై స్థానిక జెన్‌కో ఆడిటోరియంలో జరిగిన మొదటి హిందీ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంప్రదాయ పద్ధతులతో నీటిని పరిరక్షించాలని, జల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటిని రక్షించే బాధ్యత కేవలం ప్రభుత్వానిదే అనే అభిప్రాయం పోవాలన్నారు. మానవాళి మనుగడకు ప్రకృతి సిద్ధంగా లభిస్తున్న నీరు ఎంతో ముఖ్యమని మసూద్ చెప్పారు. ప్రపంచ జనాభాలో 18 శాతం భారత దేశంలో నివసిస్తుండగా ప్రపంచ వ్యాప్తంగా లభ్యమయ్యే నీటిలో కేవలం 4 శాతం మాత్రమే ఇక్కడ లభ్యమవుతున్నదని ఆయన వివరించారు. నీటి నిర్వహణ పైనే ఆర్థిక అభివృద్ధి ఆధారపడి ఉన్నదన్నారు. దేశంలో గంగ, బ్రహ్మపుత్ర, నర్మద, తపతి, కావేరి, మహానది, గోదావరి, కృష్ణ వంటి నదులు ప్రవహిస్తున్నాయని తెలిపారు. తక్కువ నీటిని వినియోగించుకోవటానికి వ్యవసాయంలో బిందు సేద్యం వంటి విధానాలను రాష్ట్రాలు అమలు చేయాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవటం, కలుషితం కావడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. గంగా ప్రక్షాళణ వంటి కార్యక్రమాల ద్వారా నదులను పరిరక్షించుకోవటానికి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని వివిధ రాష్ట్రాలు కోరుతున్నాయని మసూద్ తెలిపారు. దేశంలో చిరపుంజి వంటి ప్రాంతాల్లో 1200 మిల్లీమీటర్లు, మరికొన్ని ప్రాంతాల్లో కేవలం 200 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదవుతున్నదని గోదావరి బోర్డు చైర్మెన్ ఏకే జైన్ అన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్ సంస్థ చీఫ్ ఇంజినీర్ రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో లభ్యమయ్యే నీటిలో 85 శాతం వ్యవసాయానికి, 15 శాతం తాగునీటికి వినియోగిస్తున్నట్టు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్యుడు ఆర్కే గుప్త మాట్లాడుతూ జల సంరక్షణ గురించి పాఠ్యాంశాల్లో చేర్చినట్టు తెలిపారు. మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో జలసంరక్షణ కోసం జరగుతున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. వీటి గురించి ప్రజలందరికీ తెలియచేయాలన్నారు. కేంద్ర జలసంఘం సంయుక్త కార్యదర్శి శేరి మోతీలాల్ స్వాగతం పలికారు.

ఉపాధ్యాయుల పదోన్నతులపై కసరత్తు

ప్రభుత్వానికి చేరిన విద్యాశాఖ ప్రతిపాదనలు

- పరిశీలిస్తున్న ఆర్థిక శాఖ అధికారులు
- ముఖ్యమంత్రి ఆమోదించగానే ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుపై కసరత్తు ప్రారంభమైంది. ఉపాధ్యాయులకు పదోన్నతులు ఎలా కల్పించాలన్న దానిపై సమాలోచన జరుగుతున్నది. ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు సంబంధించిన ప్రతిపాదనలను పాఠశాల విద్యాశాఖ రూపొందించి ప్రభుత్వానికి పంపించింది. ఈ ప్రతిపాదనలను ఆర్థిక శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలిస్తున్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనల అమలును హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు ఉన్న అడ్డంకి తొలగిపోయింది. సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కనున్నాయి. ఏకీకృత సర్వీసు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమనీ, ఇవి చెల్లవనీ ప్రభుత్వ ఉపాధ్యాయులు సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారు. వచ్చేనెల 25న సుప్రీం కోర్టులో ఏకీకృత సర్వీసు నిబంధనల అంశంపై విచారణ జరగనుంది. దీంతో సుప్రీంకోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకొని న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఆర్థిక శాఖ అధికారుల ఆమోదం పొందగానే ఆ ప్రతిపాదనల దస్త్రం న్యాయశాఖ, జీఏడీ అధికారులు పరిశీలిస్తారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చూసి ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిస్తారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఏకీకృత సర్వీసు నిబంధనల దస్త్రంపై సంతకం చేసిన తర్వాత ఉత్తర్వులు వెలువడతాయి. అనంతరం పాఠశాల విద్యాశాఖ పదోన్నతుల ప్రక్రియను చేపడుతుంది. క్యాడర్ వారీగా పోస్టులు, ఖాళీలు, పదోన్నతులకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లాల వారీగా విద్యాశాఖ అధికారుల నుంచి సేకరిస్తుంది. ఆ తర్వాత అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పదోన్నతుల ప్రక్రియను చేపడుతుంది. రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు సీనియార్టీ ఆధారంగా గెజిటెడ్ హెడ్మాస్టర్, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, స్కూల్ అసిస్టెంట్లుగా వివిధ క్యాడర్ల వారీగా పదోన్నతులు లభిస్తాయి.

ఉపాధ్యాయులపై ఉక్కుపాదం

ఉద్రిక్తంగా ఫ్యాప్టో సీపీఎస్ ఆందోళన

- ఎక్కడికెక్కడ నిర్బంధం, వందలాది మంది అరెస్ట్
- వామపక్షాల ఖండన
- మండలిలో పీడీఎఫ్ బైటాయింపు
- నేడు చర్చకు యనమల హామీ



అమరావతి: ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సీపీఎస్‌కు వ్యతిరేకంగా గళమిప్పిన గురువులపై ఎక్కడికక్కడ నిర్బంధాన్ని ప్రయోగించింది. జిల్లాలోనే అరెస్టలకు దిగింది. అయినా, ఫ్యాప్టో మేరకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు గురువారం విజయవాడకు చేరుకోవడంతో మరింతగా బలప్రయోగానికి దిగింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపాధ్యాయులు అసెంబ్లీకి చేరుకోకూడదన్న ప్రభుత ఆదేశాలతో పోలీసులు విజయవాడ నగరంలోని అన్ని వీధుల్లో జల్లెడ పట్టారు. ఉపాధ్యాయ ఉద్యమానికి కేంద్రస్థానంగా ఉన్న యూటీఎఫ్ కార్యాలయాన్ని తెల్లవారుజామునే ముట్టడించారు. అక్కడే ఫ్యాప్టో ఛైర్మన్ బాబురెడ్డిని అరెస్ట్ చేశారు. బీసెంట్ రోడ్డులో ప్రదర్శనగా వెడుతున్న ఉపాధ్యాయులతో పాటు ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీకె. లక్ష్మణరావును అదుపులోకి తీసుకున్నారు. ఇంత నిర్బంధమున్నా భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు ఏలూరు రోడ్, ధర్నా చౌక్ తదితర ప్రాంతాలకు చేరుకుని భైటాయించారు. వీరందరని బలవంతంగా అరెస్ట్ చేసి వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్లలో ఉన్న ఉపాధ్యాయలును సీపీఐ(ఎం) రాష్ట్ర కార్మదర్శి పి. మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు పరమార్శించారు. ఉపాధ్యాయుల పోలీసుల తీరును వామపక్షాలు ఖండించాయ. మరోవైపు ప్రభుత్వ వైఖరిని శాసనమండలిలో పీడీఎఫ్ సభ్యులు నిలదీశారు. సీపీఎస్ అంశంపై వాయిదాతీర్మానమిచ్చిన వారు, తక్షణమే చర్చను చేపట్టాలని డిమాండ్ చేస్తూ పోడియంలో బైటాయించారు. అరెస్టలకు వ్యతిరేకంగా నినాదాలుచేశారు.

నా'నో' అనేసినట్టే!

'దేశం గర్వించదగ్గ కారు అవుతుంది' , 'ఇది నా మానసపుత్రిక' దేశంలో పేరెన్నికగల పారిశ్రామికవేత్త రతన్‌టాటా పదేండ్ల కిందట ఎంతో ఆర్భాటంగా చెప్పిన మాటలివి. సరైన ప్రణాళిక వ్యయ అంచనా, వినియోగదారుల అభిరుచి, మార్కెట్ స్థితిగతులను అంచనా వేయనినాడు.. ఎంత గొప్ప నిర్ణయమైనా చతికిలపడుతుంది. దానికి తాజా ఉదాహరణ 'టాటా కలల కారు నానో'. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' విశ్లేషణాత్మక కథనం..



ఫైల్

- పదేండ్లకే కంచికి చేరిన 'టాటా నానో' కథ
- భావోద్వేగాలకు వ్యాపారంలో ప్రాధాన్యతనివ్వడమే ప్రధాన కారణం
- ఏబీఎస్ నియమాలు, క్రాష్ టెస్ట్, బీఎస్-6 ప్రమాణాలకు అనువుగా కారును మార్చలేకపోవడం కూడా!
- పెరుగుతోన్న వ్యయం, పెట్టుబడులలేమి, కష్టమర్ల నుంచి కానరాని ఆదరణ!

జై

ఎన్నో ఆశ్చర్యానందాలను మోసుకొస్తూ.. సక్సెస్ అవుతుందనుకున్న టాటా నానో కారు దశాబ్దకాలంలోనే పతనావస్థకు చేరుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. 'పీపుల్స్ కారు'గా ప్రముఖులచే కీర్తించబడ్డ ఈ కారు అమ్మకాలు ఈ ఏడాది జనవరిలో జీరోకు పడిపోవడం గమనార్హం.

ప్రణాళికలు లేవు

టాటా మోటార్స్ ఉత్పాదన 'నానో కారు' అమ్మకాలు ఈ ఏడాది శూన్యస్థాయికి చేరుకున్నాయి. ఈ జనవరిలో ఒక్క నానో కారు కూడా అమ్ముడుపోలేదని.. అలాగే, ఒక్క నానో కారును కూడా సదరు నెలలో సంస్థ తయారు చేయలేదని టాటా మోటార్స్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కు ఇచ్చిన నివేదికలో పేర్కొంది. కాగా, గతేడాది జనవరి నెలలో 83 నానో కార్లను సంస్థ తయారు చేయగా.. దేశీయ మార్కెట్లో 62 నానో కార్లు అమ్ముడయ్యాయి. అమ్మకాల్లో ఆశించిన ఫలితాలు నమోదు కాకపోవడం.. కొనుగోలుదార్ల నుంచి అనాసక్తి, పెట్టుబడులలేమి, ఈ ఏడాది అక్టోబర్ నుంచి వాహనాల నూతన భద్రతా ప్రమాణాలు, 2020 ఏప్రిల్ నుంచి వచ్చే బీఎస్6 కాలుష్య నియంత్రణ ప్రమాణాలు వెరసి.. నానో కారు అప్‌గ్రేడ్ ఫీచర్లను రూపొందించే ప్రణాళికలు ఇప్పటికైతే ఏమీ లేవని టాటా మోటార్స్ సేల్స్ విభాగం చేతులెత్తేసింది.

ఆరంభం అదుర్స్

ద్విచక్ర వాహనాలు నడిపే సామాన్య, దిగువ మధ్యతరగతి కుటుంబం అంతటికీ సరిపోయే చిన్న కారు అందించే లక్ష్యంతో రతన్ టాటా 2008లో నానో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అదే ఏడాది ఆటో ఎక్స్ పోలో మొదటిసారిగా ప్రదర్శించబడిన నానో.. ఆ మరుసటి ఏడాది అంటే 2009లో మార్కెట్లోకి వచ్చింది. ఉత్పత్తి ప్రారంభించిన తొలినాళ్లలో ఎంతో ప్రచారం దక్కించుకున్న ఈ కారు బుకింగ్స్ కోసం చాలామంది ఎగబడ్డారు. చిన్న కార్లలో అప్పటివరకూ వెలిగిపోతున్న మారుతీ 800 ధరలు, అమ్మకాలు ఒక్కసారిగా 20శాతం దాకా పతనం అయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తొలుత నానో కార్లు బుకింగ్ చేసిన వారికి టాటా సంస్థ రూ.లక్షకే అందించింది. కాగా, టాటా మోటార్స్ ఈ కారును పశ్చిమ బెంగాల్‌లోని నందిగామ్ దగ్గర ఉత్పత్తి చేయాలనుకున్నప్పటికీ, కొన్ని రాజకీయ కారణాల మూలంగా కంపెనీ ఈ ప్లాంట్ ను గుజరాత్‌లోని సనంద్‌కు తరలించింది.

కంచికి ఇలా..

నానో కారు ప్రాజెక్టు ప్రారంభం జరిగి కొన్ని నెలలు గడవకముందే సదరు ప్రాజెక్టుపై సమస్యల నీలినీడలు పడ్డాయని చెప్పొచ్చు. మార్కెట్లోకి వచ్చాక ఈ కారు ఇంజిన్‌లో మంటలు వస్తున్నాయన్న ఫిర్యాదులు ఒకవైపు. 'అత్యంత చౌకైన కారు' అన్న ప్రచార వ్యూహం నెగటివ్ గా మారడం, వ్యయాల్ని మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ధారించడంలో వైఫల్యం, ధరల్ని క్రమంగా పెంచడం, కోట్ల నష్టం వాటిల్లినా భావోద్వేగాలకు వ్యాపారంలో ప్రాధాన్యత ఇవ్వడం, ఏప్రిల్ 2019 నుంచి అమల్లోకి వచ్చే యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టం(ఏబీఎస్) నియమాలు, అక్టోబర్ 2019లో నిర్వహించబడే క్రాష్ టెస్ట్ కు సంసిద్ధతకాకపోవడం, 2020 ఏప్రిల్ నాటికి బీఎస్-6 ప్రమాణాలు పాటించాల్సిందేనని సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా కారు మోడల్ లో మార్పులు చేపట్టే పరిస్థితులు లేకపోవడం, పెట్టుబడుల కొరత వెరసి టాటా కలల కారును కంచికి చేరేలా చేశాయి.

ఆసక్తికర అంశాలు

- ప్రారంభంలో రూ. లక్షతో మొదలైన నానో ప్రస్థానం.. పెరిగిన వ్యయాల మూలంగా 2017 వచ్చేసరికి నానో ధర రూ.2,15,000 అయ్యింది.
- ఏడాదికి 2,50,000 నానో కార్ల తయారీకి సైతం వనరులను సిద్ధం చేసిన టాటా మోటార్స్.. ప్రస్తుతం ఒక్క కారును కూడా ఉత్పత్తి చేయలేని దశకు చేరింది.
- 2005లో టాటా ఏస్ ట్రక్‌ను అందుబాటు ధరలో విపణిలోకి తెచ్చిన తర్వాత తక్కువ ధరకే కార్లను ఉత్పత్తి చేయాలని రతన్‌టాటా సంకల్పించారు. కాగా, సైరస్ మిస్త్రీ, చంద్రశేఖర్ వంటి ప్రముఖులు 'నానో'పై పెదవివిరుపులు చేయడం కొసమెరుపు!

మార్చి 6న పీజీఈసెట్ నోటిఫికేషన్

- 13 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 28 నుంచి 31 వరకు రాతపరీక్షలు
- షెడ్యూల్ విడుదల



మాట్లాడుతున్న పాపిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్, ఎం ఫార్మసీ, ఫార్మా-బీ, ఎం ఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) నోటిఫికేషన్ మార్చి 6న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో పీజీఈసెట్ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మెన్ ఆర్ లింబాద్రి, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఓయూ వీసీ, పీజీఈసెట్ చైర్మెన్ ఎస్ రామచంద్రం, కన్వీనర్ ఎం కుమార్, పర్యవేక్షణ అధికారి పి రమేష్‌బాబు, కమిటీ సభ్యులు ఎస్ ఫాతిమా, పి లక్ష్మి నారాయణ, ప్రవీణ్‌కుమార్, భండారి, ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీజీఈసెట్ కన్వీనర్ ఎం కుమార్ షెడ్యూల్ విడుదల చేశారు. పీజీఈసెట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మార్చి 13 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. ఆలస్య రుసుంతో మే 25వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశముందని తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.1000, ఎస్సీ,ఎస్టీలకు రూ.500 చెల్లించాలని సూచించారు. పీజీఈసెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో మే 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. హైదరా బాద్, వరంగల్‌లో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొ న్నారు. మే 22 నుంచి 27వ తేదీ వరకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేం దుకు అవకాశముందని తెలిపారు. ఇతర వివరాలకు http://pgecet. tsche.ac.in లేదా http://www. tsche.ac.in వెబ్‌సైట్లను సంప్రదిం చాలని సూచించారు. 2018-19 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 129 ఇంజినీరింగ్ కాలేజీల్లో ఎంఈ/ఎంటెక్, 96 కాలేజీల్లో ఎం ఫార్మసీ, 14 కాలేజీల్లో ఫార్మా-బీ, మూడు కాలేజీల్లో ఎం ఆర్క్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కార్ల్‌మార్క్స్ సమాధిపై దాడి




లండన్ : ఇరవయ్యో శతాబ్దాన్ని మలుపు తిప్పిన మహనీయుడు, సుప్రసిద్ధ తత్వవేత్త, ఆర్థిక వేత్త కార్ల్‌మార్క్స్ సమాధిపై మంగళవారం నాడు గుర్తు తెలియని దుండగులు కొందరు సుత్తితో దాడి చేసి అక్కడి శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్టు ఫ్రెండ్స్ ఆఫ్ హైగేట్ సిమెట్రీ ట్రస్ట్ పేర్కొంది. 1883లో తుదిశ్వాస విడిచిన మార్క్స్ భౌతిక కాయాన్ని లండన్‌లోని హైగ్రేట్ శ్మశానంలో ఖననం చేశారు. ఆ ప్రదేశంలో ఏర్పాటు చేసిన పాలరాతి స్మారక స్థూపంపై 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి (వర్కర్స్ ఆఫ్ ఆల్ ల్యాండ్స్ యూనిటీ) అని లిఖించారు. ఆ ఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందేననడానికి ఆధారాలున్నట్టు ఫ్రెండ్స్ ఆఫ్ హైగేట్ సిమెట్రీ ట్రస్ట్ పేర్కొంది. దీనిని పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఐయాన్ దుంగవెల్ తెలిపారు. దీనిపై విచారణ జరిపామని, ఎలాంటి ఆధారాలు దొరకనందున కేసును మూసివేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బిల్లు మంజూరుకు లంచం డిమాండ్

ఏసీబీకి పట్టుబడిన పంచాయతీరాజ్ డీఈ

- రూ. 60 వేలు స్వాధీనం, అరెస్ట్



నవతెలంగాణ- వేములవాడ రూరల్

పంచాయతీ భవన నిర్మాణానికి మంజూరైన నిధులు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన పంచాయతీరాజ్ డీఈ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అతని నుంచి రూ.60వేలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగిన ఈ ఘటన వివరాలు ఏసీబీ డీఎస్పీ కిరణ్‌కుమార్ తెలిపారు. బోయినిపల్లి మండలం తడగొండలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రభుత్వం రూ.13 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తి కోసం ప్రభుత్వం మరో రూ. 3లక్షలు అదనంగా మంజూరు చేసింది. ఈ నిధుల కోసం అప్పటి సర్పంచ్ కట్ట కనకవ్వ వేములవాడ పంచాయతీరాజ్ డీఈ మహేందర్‌రెడ్డిని సంప్రదించారు. అయితే, తనకు రూ.60వేలు ఇస్తే బిల్లు పాస్‌చేస్తానని డీఈ చెప్పాడు. దానికి సర్పంచ్ కట్ట కనకవ్వ అంగీకరించలేదు. బిల్లు పాస్ చేయాలని 6నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. విసుగు చెందిన ప్రస్తుత మాజీ సర్పంచ్ కనకవ్వ భర్త లచ్చయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు లచ్చయ్య డీఈ మహేందర్‌రెడ్డికి రూ.60 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని డీఈని అరెస్టు చేశారు.

ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి : ఎస్టీయూటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అన్ని క్యాడర్లలోని ఉపాధ్యాయులందరికీ పదోన్నతుల ద్వారా న్యాయం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రం (ఎస్టీయూటీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు బి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అవసరమైన ఉన్నత విద్యార్హతలుండి, ఏండ్ల తరబడి సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసినా పదోన్నతుల్లేక విద్యారంగం నిర్వీర్యమవుతోందని తెలిపారు. సుప్రీం కోర్టు ఇటీవల హైకోర్టు తీర్పుపై స్టే విధించి ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు మార్గం సుగమం చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికీ విధానాన్ని స్పష్టం చేయకపోవడంతో ఉపాధ్యాయులంతా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అందరికీ న్యాయం జరిగే విధంగా ఆలోచించి ఎస్జీటీలకు ఎస్ఏ, ఎల్ఎఫ్ఎల్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ పరిష్కారం ఎమ్మెల్సీ ఎన్నికల లబ్దిగా ఉండొద్దని కోరారు. విస్తృత ప్రయోజనాలు అందరికీ కల్పించే విధంగా విశాల దృక్పథంతో ప్రభుత్వ ఆలోచనా విధానముండాలని సూచించారు.

14న యాక్సిడెంట్ ఫ్రీ డే

- రాష్ట్ర రోడ్‌సేఫ్టీ అథారిటీ చైర్మెన్ కృష్ణప్రసాద్ వెల్లడి



నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడానికి, వాహన దారులలో అవగాహనను పెంచడానికి గాను ఈనెల 14న యాక్సిడెంట్ ఫ్రీ డే(రోడ్డు ప్రమాద రహిత దినం)గా పాటిస్తున్నామని రాష్ట్ర రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మెన్ టి.కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. అలాగే ఈనెల 4నుంచి 10వ తేదీ వరకు జరుపుతున్న రోడ్డు భద్రతా వారోత్సవాలను 14వ తేదీ వరకు పొడిగించినట్టు ఆయన తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా పాఠశాలలు మొదలుకొని కళాశాలల విద్యార్థుల వరకు రహదారుల భద్రతపైనా, ట్రాఫిక్ నిబంధనల పైనా అవగాహనను కల్పించడం జరుగుతుందన్నారు. మరోవైపు వివిధ కంపెనీలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులలో సైతం రోడ్డు ప్రమాదాలు, అవి జరుగుతున్న తీరు తెన్నులపైన అవగాహనను కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా నిర్లక్ష్యపు డ్రైవింగ్, స్పీడ్ అండ్ రాష్ డ్రైవింగ్, మద్యం సేవించి జరుపుతున్న డ్రైవింగ్‌ల కారణంగా ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయన్నారు. గతేడాది తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి తీసుకున్న నివారణ చర్యల కారణంగా చాలా వరకు ప్రమాదాలలో మృతుల సంఖ్యను తగ్గించగలిగామని కృష్ణప్రసాద్ వివరించారు. ఈ ఏడాది సైతం దానికి కొనసాగింపుగా పలు చర్యలను చేపడుతున్నామన్నారు. అదే సమయంలో వాహనదారులలోనూ హెల్మెట్ ధరించడం, నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేయడం, మొదలైన ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను పెంచడంపై దృష్టిని సారించామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 14న యాక్సిండెంట్ ఫ్రీ డే గా వాహనదారులందరూ పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ రోజు ఒక్క ప్రమాదం కూడా జరగకుండా అందరు సమిష్టిగా కృషిచేయాలన్నారు. ఆ రోజున అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ట్రాఫిక్, శాంతి భద్రతల పోలీసులు, ఆర్‌టీఏతో పాటు వివిధ శాఖలు సమన్వయంగా పని చేసేలా కార్యాచరణను రూపొందించినట్టు ఆయన తెలిపారు. అతి వేగంగా వాహనాలను నడపకుండా, మైనర్‌లకు వాహనాలు ఇవ్వకుండా తల్లి దండ్రులూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

పుస్తకాలు జ్ఞాన తెలంగాణకు పునాదులు

వ్యక్తి మస్తిష్కాన్ని కదిలించే శక్తి పుస్తకానిదే..:

'నవ తెలంగాణ బుక్‌హౌస్ ప్రారంభం'లో అల్లం నారాయణ



మాట్లాడుతున్న అల్లం నారాయణ

నవ తెలంగాణ -ఖమ్మం టౌన్

పుస్తకాలు జ్ఞాన తెలంగాణకు పునాదులనీ, మనిషి మస్తిష్కానికి వ్యాయామం లాంటివనీ తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ అన్నారు. గురువారం ఖమ్మంలోని మంచికంటి భవనం పక్కన నూతనంగా నిర్మించిన 'నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అల్లం నారాయణ మాట్లాడుతూ.. పుస్తక ప్రపంచాన్ని ఎంత విస్తరిస్తే అన్ని జ్ఞాన సమాజాలు నిర్మితమవుతాయని అన్నారు. నవ తెలంగాణ పుస్తక కేంద్రాలు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉండి గ్రామీణ ప్రాంతాల అవసరాలు తీర్చడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పుస్తకాలు శాస్త్రీయ జ్ఞానాన్ని అందించడం ద్వారా ఈ కేంద్రాలు ఆరోగ్యమైన జ్ఞాన తెలంగాణను నిర్మించడంలో ఉపయోగపడతాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వెనుకబడిన అట్టడుగు వర్గాల అభ్యున్నతి, బడుగు వర్గాల ప్రగతికి పుస్తకాలు ఎంతో తోడ్పడ్డాయని చెప్పారు. పఠనంతో సామాన్యుడు సైతం అసమాన్యుడిగా ఎదగడానికి పుస్తకాలు పునాదులుగా నిలుసాయన్నారు. కంప్యూటర్ మనిషిని యంత్రంగా మారిస్తే, పుస్తకం మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దుతుందని చెప్పారు.

పుస్తకానికి సమాజాన్ని మార్చే శక్తి: జూలూరి గౌరీ శంకర్

ప్రపంచ గతిని మార్చగల శక్తి పుస్తకాలకే ఉందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరీ శంకర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రాసిన 'తెలంగాణలో ఏం జరుగుతుంది' అన్న పుస్తకం రాష్ట్రంలో గొప్ప కదలిక తీసుకొచ్చిందన్నారు. తెలంగాణ భావజాలాన్ని సాహిత్యాన్ని మహత్తర మలిదశ ఉద్యమంగా మలిచిన శక్తి పుస్తకానికి ఉందని చెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రజాసంఘాలకు, రాజకీయ పార్టీలకు, ప్రజలకు తెలంగాణ సాహిత్యం దిశ నిర్దేశం చేసింది పుస్తకాలే అన్నారు. అక్షర జ్ఞానంతో కదిలే సమాజమే కొత్త చరిత్రకు తలుపులు తెరుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ కన్వీనర్ ఆనందాచారి, రామానందతీర్థ, గ్రామీణ విశ్వ విద్యాలయం డైరెక్టర్ కిషోర్ రెడ్డి, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మెన్ ఖమర్, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ కోయ చంద్రమోహన్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బుగ్గవీటి సరళ, నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి కృష్ణారెడ్డి, బ్రాంచి మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ఐఎస్ అంతు చూస్తాం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్ : సిరియాలో వరుస దాడులకు పాల్పడుతూ సిరియన్ల కంటిమీద కునుకులేకుండా చేస్తున్న ఐఎస్ మరో వారం రోజుల్లో అంతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తద్వారా ఉగ్రవాదులను తుదముట్టించాలనే తమ ఆశయం నెరవేరుతుందని పేర్కొన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రంప్ ప్రసంగించారు. సుమారు 70 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడారు. 'అమెరికా, దాని మిత్ర దేశాలతో పాటు సిరియన్ డెమోక్రటిక్ ఫోర్సెస్ కృషి కారణంగా.. ఐఎస్ పాలనలో ఉన్న సిరియా, ఇరాక్‌లోని చాలా ప్రాంతాలు విముక్తి పొందాయి. చాలా కష్టంతో కూడుకున్న ఈ పనిని పూర్తి చేసేందుకు ఆర్థిక, సైనిక సహకారాలు అందించి సిరియాకు అండగా నిలిచారు. ఇది సమిష్టి కృషి. ఐఎస్ ఉనికిని సమూలంగా రూపుమాపుతాం. ఇందుకు సంబంధించి వారం రోజుల్లోగా అధికారిక ప్రకటన చేస్తాను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా సిరియా నుంచి తమ సైన్యాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు గతేడాది డిసెంబరులో ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఐఎస్‌ను పూర్తిగా ఓడించిన కారణంగా సైనిక దళాలను వెనక్కి రావాల్సిందిగా ఆదేశించారు. 'సిరియాలోని ఉగ్రసంస్థలపై విజయం సాధించాం. నా పదవీ కాలంలో పూర్తిచేయాలనుకున్న లక్ష్యం అది' అని ఆయన ట్వీట్ చేశారు. కాగా, సిరియాలో మరో 1500 మంది ఐఎస్ సభ్యులు తలదాచుకుని ఉన్నట్టు అమెరికా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. సిరియాలో నిర్వహించిన ఉగ్రవ్యతిరేక ఆపరేషన్ కారణంగా మిలిటెంట్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్టు భావిస్తున్నాయి. అయితే, ఇక్కడే మకాం వేసిన 1500 మంది మిలిటెంట్లను తరిమివేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రచించినట్టు ట్రంప్ సర్కార్ చెబుతోంది.

ఇండోనేషియాలోకి బంగ్లాదేశ్ నుంచి వలసలు!

మెడాన్ : బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు ఎక్కువ అవుతున్నాయని ఇండోనేషియా ప్రభుత్వం కొంతకాలంగా చేస్తున్న వాదనకు బలాన్ని చేకూర్చేలా సుమారు రెండు వందల మంది పట్టుబడ్డారు. సుమత్రా ద్వీపంలోని మెడాన్ పట్టణంలో 193 మంది అక్రమంగా ఉంటున్నట్టు గుర్తించామని పోలీస్ అధికారులు ప్రకటించారు. తమకు అందిన సమాచారం మేరకు ఒక షాప్‌హౌస్‌లో తనిఖీలు నిర్వహించగా, దేశంలోని అక్రమంగా ప్రవేశించిన 193 మంది పట్టుబడినట్టు చెప్పారు. వీరిలో ఎక్కువ మంది ఇరవై నుంచి ఇరవై ఐదు ఏండ్ల లోపువారేనని అధికారులు పేర్కొన్నారు. వీరిలో ఎవరి వద్ద కూడా ధ్రువీకరణ పత్రాలుగానీ, దేశంలోకి వచ్చేందుకు అవసరమైన ఇతర డాక్యుమెంట్లుగానీ లేవని స్పష్టం చేశారు. బహుశా వీరు సముద్ర మార్గంలో పడవల్లో తమ దేశంలోకి ప్రవేశించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఈయూ, ఇటలీతో బలమైన ద్వైపాక్షిక సంబంధాలు : ఇరాక్

బాగ్దాద్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ), ఇటలీ దేశాలతో బలమైన ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తామని ఇరాక్ అధ్యక్షుడు బర్హామ్ సాలిహ్ ఉద్ఘాటించారు. గురువారం ఇటలీ ప్రధాని గ్యూసెప్ కోంటె బగ్దాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సాలిహ్, కోంటె భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై సుదీర్ఘ మంతనాలు జరిపారు. ఇరాక్‌లో పెట్రేగిపోయిన ఉగ్రసంస్థల నిర్మూలనకు ఇటలీ సహకరిస్తోందని చెప్పారు. ఇటలీ ప్రధానిగా కోంటె బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇరాక్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

పాక్‌లో రోడ్డు ప్రమాదం : 16 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 16 మంది మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...పాక్‌లోని ఖైబర్ ఫక్తున్‌క్వా ప్రాంతంలో ప్రయాణికులను తీసుకెళ్తున్న రెండు వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 16 మంది ప్రయాణికులు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంగా వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అధికారుల అనుమానిస్తున్నారు. ప్రయాణికులను తీసుకెళ్తున్న ఒక వ్యాన్ డెరా ఇస్మాయిల్ ఖాన్ నుంచి పెషావర్‌కు వెళ్తుండగా కరక్‌లోనిని సిపెనా బండి గ్రామం వద్ద ప్రయాణికులతో వెళ్తున్న ట్రక్‌ను ఢీకొందని పోలీసులు తెలిపారు. రెండు వాహనాలు ఢీకొన్న సమయంలో వ్యాన్‌లోని సీఎన్‌జీ సిలిండర్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు స్పష్టం చేశారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించామని, కేసు దర్యాప్తు జరుగుతోందని వారు తెలిపారు.

ఇస్తాంబుల్‌లో కుప్పకూలిన భవనం



ఇస్తాంబుల్ : టర్కీలోని అతిపెద్ద నగరమైన ఇస్తాంబుల్‌లో ఎనిమిది అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఆ భవనంలోని 14 అపార్ట్‌మెంట్లలో 43 మంది నివసిస్తున్నట్టు అధికారులు తెలిపారు. భవనంలో మూడు అంతస్తులు అక్రమంగా నిర్మించినట్టు ఇస్తాంబుల్ గవర్నర్ తెలిపారు. ఇది అకస్మాత్తుగా కూలడానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని వెల్లడించారు. అత్యవసర బృందాలు శిథిలాలు వెలికితీత కార్యక్రమాన్ని చేపట్టాయి.

స్వీడన్ ప్రధాని సలహాదారుగా ప్రవాస భారతీయురాలు



స్టాక్‌హోం : స్వీడన్ ప్రధాని సలహాదారుగా ప్రవాస భారతీయురాలు నీలా విఖేపాటిల్ నియమితులయ్యారు. ఆమె మహారాష్ట్రకు చెందిన ప్రముఖ విద్యావేత్త అశోక్ విఖే పాటిల్ కుమార్తె.స్వీడన్‌లో ఇటీవల అధికారం చేపట్టిన సోషల్ డెమోక్రాట్ గ్రీన్ పార్టీ కూటమి నాయకుడు స్టీఫెన్ లోవన్ వద్ద కొంతకాలంగా నీల పనిచేస్తున్నారు. స్టీఫన్ గత నెలలో స్వీడన్ ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన నీలను తన రాజకీయ సలహాదారురాలిగా నియమించుకున్నారు. 'నీల... స్వీడన్ ప్రధాన మంత్రి రాజకీయ సలహాదారుగా నియమితులయ్యారు. ఆర్థిక విభాగం, పన్నులు, బడ్జెట్, గృహనిర్మాణం వంటి విభాగాల బాధ్యతలను కూడా నిర్వహిస్తారు' అని ఆమె తండ్రి అశోక్ పాటిల్ చెప్పారు.

అంతేకాకుండా తన కుమార్తె స్టాక్‌హోం మున్సిపల్ కార్పొరేషన్ (ఎస్ఎంసీ) సిటీ కౌన్సిల్‌కు కూడా ఎన్నికయ్యారని చెప్పారు. నీల గత ప్రభుత్వం హయాంలోనూ రాజకీయ సలహాదారురాలిగా పనిచేశారు. ఆమె గ్రీన్ పార్టీలో క్రియాశీలకకార్యకర్త. అంతేకాకుండా గ్రీన్ పార్టీ ఎన్నికల కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. కాగా స్వీడన్‌లో జన్మించిన నీల బాల్యం అహ్మద్‌నగర్‌లోనే గడిచింది.

స్వీడన్‌లోని గోతెన్‌బర్గ్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నీల ఎంబీఏ డిగ్రీ పట్టా పొందారు. నీల తాత బాలాసాహెబ్ విఖే పాటిల్ గతంలో కేంద్ర మంత్రి గా పని చేశారు. ఇక ఆమె మేన మామ రాధాకృష్ణ విఖేపాటిల్ మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు.

అప్పీలుకు వెళ్లితే శిక్షాకాలాన్ని పెంచారు...!

- మరో 13ఏండ్లు జైలులోనే బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు



రియో డి జనేరియో : బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులాడిసిల్వా శిక్షాకాలాన్ని బ్రెజిల్ ఉన్నత న్యాయస్థానం మరో 13ఏండ్లకు పెంచింది. మనీలాండరింగ్, అవినీతి కేసుల్లో లులాడిసిల్వాపై మోపిన ఆరోపణలు రుజువైన సంగతి తెలిసిందే. కింది కోర్టు ఇచ్చిన తీర్పుపై బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేశారు. లులాడిసిల్వా 2003 నుంచి 2010 వరకు బ్రెజిల్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన పదవిలో ఉండగా పలు కన్‌స్ట్రక్షన్ కంపెనీల నుంచి భారీ మొత్తంలో ముడుపులు స్వీకరించిన ఆరోపణలు ఎదుర్కొన్నారు.మరో ప్రాజెక్టు మరమ్మతుల నిమిత్తం భారీ మొత్తంలో అవినీతికి పాల్పడటమే కాకుండా, నిధుల దుర్వినియోగానికి ప్లాల్పడ్డ ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2017లో ఈరెండు కేసులపై విచారణ చేపట్టిన న్యాయస్థానం లూలాడిసిల్వాకు 9ఏండ్ల జైలుశిక్ష విధించింది. దిగువ కోర్టు తీర్పుపై అప్పీలు చేసిన లూలాకు ఉన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది.

అఫ్ఘాన్‌కు ప్రపంచ బ్యాంక్ సాయం

కాబూల్ : అఫ్ఘనిస్థాన్‌కు 235 మిలియన్ డాలర్లు (రూ.16,78,95,75,000) సాయం చేయనున్నట్టు ప్రపంచ బ్యాంక్ ప్రక టించింది. అఫ్ఘనిస్థాన్‌లో అభివృద్ధి కోసం తామందించే నిధులు ఉపయోగించుకోవాలని సూచించింది. సాయం పట్ల అఫ్ఘాన్ ఆర్థిక శాఖ మంత్రి హుమాయున్ ఖయోమీ హర్షం వ్యక్తం చేశారు. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్ మెంట్‌కు, సంస్థల సంస్కరణలకు 75 మిలియన్ డాలర్లు(రూ.5,35 ,83,75,000) ఇంటర్నెషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్స్ కోసం 25 మిలియన్ డాలర్లు (రూ.1,78,61,25,000), అఫ్ఘనిస్థాన్ రీకన్‌స్ట్రక్షన్ ట్రస్ట్ ఫండ్‌కు 50మిలియన్ డాలర్లు (రూ.3,57,22,50,000) మంజూరయ్యాయని చెప్పారు.

నేటినుంచి దక్షిణ భారత చరిత్ర మహాసభలు

ప్రారంభించనున్న సీఎస్ ఎస్‌కె జోషి

- 1500 మంది ప్రతినిధుల రాక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ భారత చరిత్ర మహాసభలకు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) ముస్తాబైంది. 39వ దక్షిణ భారత చరిత్ర మహాసభలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 10వ తేదీ వరకు జరుగుతాయి. ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో దక్షిణ భారత చరిత్ర మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కో జోషి హాజరవుతారు. ఈ మహాసభలకు గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల నుంచి 1,500 మంది ప్రతినిధులు పాల్గొంటారు. ఓయూ చరిత్ర శాఖ వందేండ్లు పూర్తి చేసుకోబోతున్నది. అందులో భాగంగానే దక్షిణ భారత చరిత్ర మహాసభలు ఓయూలో జరుగుతున్నాయి. ఓయూలో దక్షిణ భారత చరిత్ర మహాసభలు తొలిసారిగా 1986లో జరిగాయి. మళ్లీ 32 ఏండ్ల తర్వాత ఈ అవకాశం ఓయూకు దక్కింది.

ఓయూలో తెలంగాణ అధ్యయన కేంద్రం : రామచంద్రం

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో తెలంగాణ అధ్యయన కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ఓయూ వీసీ ఎస్ రామచంద్రం చెప్పారు. ఇప్పటికే కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు ఆమోదించిందని వివరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) నిధులు రూ.20 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. తెలంగాణ అధ్యయన కేంద్రం ద్వారా తెలంగాణ చరిత్ర, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలపై సమగ్రంగా పరిశోధన జరుగుతుందన్నారు. తెలంగాణ సమగ్ర సమాచారం ఓయూలో నిక్షిప్తం చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా సమాచారం అడిగితే వెంటనే ఇచ్చే విధంగా తీర్చిదిద్దుతామని అన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకునేటపుడు ఈ చరిత్ర ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ చరిత్ర నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. అందుకే మరుగున పడిపోయిన చరిత్రను వెలికితీయడమే ఈ కేంద్రం ఉద్దేశమని చెప్పారు. విశ్వవిద్యాలయానికి ఆవిష్కరణలకు కేంద్రాలుగా విలసిల్లాలని ఆకాంక్షించారు.

త్వరలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ

త్వరలోనే విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ అవుతాయని రామచంద్రం చెప్పారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేసేందుకు అవకాశం లేదన్నారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా సుప్రీం మార్గదర్శకాల ప్రకారం యూనివర్సిటీ




గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శాఖల వారీగా రిజర్వేషన్లు రూపొందించి అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఓయూలో 415 అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. త్వరలోనే భర్తీ అవుతాయని అన్నారు. ఈనెల 9న ఫ్యాకల్టీ సమాచార విధానం ప్రవేశపెడతామని చెప్పారు. అధ్యాపకుల పూర్తి వివరాలు అందరికీ అందుబాటులో ఉంటాయని అన్నారు.

టూరిస్టులకు తెలంగాణ 'ఆతిథ్యం'

కేరళ తరహాలో పర్యాటక కేంద్రంగా రాష్ట్రం

- 'హోం స్టే'లతో నూతన ఒరవడి
- విస్తృత ప్రచారానికి శ్రీకారం




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశ, విదేశాలకు చెందిన పర్యాటకు(టూరిస్టులకు)లను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుడుతున్నది. టూరిస్టులకు తెలంగాణ ఆతిథ్యం రుచి చూపించాలని నిర్ణయించింది. కేరళ తరహాలో హోం స్టే విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ విషయమై విస్తృత ప్రచారానికి పర్యాటక శాఖ సమాయత్తమవుతున్నది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను టూరిస్టులకు పరిచయం చేయడానికి పలురకాలుగా ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్రంలో అనేక చారిత్రాత్మక కట్టడాలు, పురాతన వస్తువులు, భారీ ప్రాజెక్టులు, విస్తరించిన దట్టమైన అడవులు, కృష్ణా, గోదావరి వంటి జీవ నదులు,400 ఏండ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరం ఇలా అనేక ప్రత్యేకతలు ఉన్న రాష్ట్రం పలు విదేశీయులు సైతం ఆకర్షితులవుతున్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం విశిష్టతలను ప్రపంచానికి చాటేలా టూరిజం శాఖ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. కొత్త ప్యాకేజీలు, ఆన్‌లైన్ బుకింగ్, హోటళ్ల అనుసంధానం, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం తదితర చర్యలు చేపట్టింది. దక్షిణ భారతదేశంలోనే అందమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న కేరళ రాష్ట్రం తరహాలో రాష్ట్రాన్ని మలచాలని ప్రయత్నాలు చేస్తున్నది.

తెలంగాణ పర్యాటక శాఖ టూరిస్టులను ఆకర్షించడానికి ఇటీవల 'హోంస్టే ఎస్టాబ్లీష్‌మెంట్ స్కీమ్'ను ప్రకటించింది. ఎక్కడెక్కడి నుంచో రాష్ట్ర పర్యటనకు వస్తున్న టూరిస్టులు సాధారణంగా హోటళ్లను ఆశ్రయిస్తుంటారు. వీరు హోటల్‌కే పరిమితం కావడంతో మన సంస్కృతి, సంప్రదాయాలు తెలిసే అవకాశం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో 'హోంస్టే'కు శ్రీకారం చుట్టింది. సొంతిల్లు ఉండి ఆసక్తి ఉన్న సాధారణ ప్రజలు తమ ఇండ్లలో ఆశ్రయం ఇచ్చి టూరిస్టులకు అతిథి మర్యాదలు చేయవచ్చు. అందుకు టూరిజం శాఖ అనుమతి తీసుకోవాలి. 'హోం స్టే అంటే టూరిస్టులు మన ఇంట్లోనే ఉంటారు. వారు తింటారు. మనతోపాటే ఉంటారు. వారికి కావాల్సిన సౌకర్యాలను ఇంటి యాజమాని ఏర్పాటు చేస్తాడు. అందుకు యాజమానే తగిన ప్యాకేజీ రూపొందిస్తారు'. దీంతో టూరిస్టులకు తెలంగాణ గొప్పతనం తెలియజేసే అవకాశం ఉందని సర్కారు ఆలోచన. హోంస్టే పద్ధతి కేరళలో దిగ్విజయంగా అమలవుతున్నదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ విధానాన్ని హైదరాబాద్‌లో ప్రవేశపెట్టి రెండున్నరేండ్లు గడిచినా...తగినంత ప్రాచుర్యం దక్కలేదు. దీంతో మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ క్రమంలో హోంస్టేపై విస్తృతంగా ప్రచారం చేసేందుకు టూరిజం శాఖ సిద్ధమవుతున్నది.

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం



అంతర్జాతీయ స్థాయి కైట్ పెస్టివల్, స్వీట్ పెస్టివల్ నిర్వహించిన సంగతి తెలిసిందే... చైనా, థాయిలాండ్, ఇండోనేషియా, టర్కీ వంటి దేశాల నుంచి నిపుణులు హైదరాబాద్ రావడంతో అభిమానులు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నారు. ' ప్రపంచ మార్పు కోసం బాలికలు ,మహిళలు చైతన్యవంతంగా పైకి ఎగరాలి' అనే నినాదంతో కైట్ పెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహించింది. 25 రాష్ట్రాల స్టాళ్లను స్వీట్ పెస్టివల్‌లో ఏర్పాటు చేశారు. గూగుల్ చరిత్రలో మొదటిసారిగా అంతర్జాతీయ కైట్, స్వీట్ పెస్టివల్‌ను గూగుల్ 360 డిగ్రీలలో ఉచితంగా ఫోటో షూట్ చేసి ప్రపంచానికి తెలియజేసిందని, ఇది తెలంగాణకు గర్వకారణమని పర్యాటక శాఖ ఉన్నతాధికారి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా కనిపించే ఒగ్గుడోలు, కోలాటం, బంజారా, లంబాడా, డప్పుల కళాకారులతో అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇప్పించింది. ముఖ్యంగా సమ్మక్క, సారక్క జాతర యూనెస్కో దృష్టిని ఆకర్షించింది. దీంతో తెలంగాణ టూరిజం శాఖ ఎనిమిది జాతీయ అవార్డులు దక్కాయి.



బ్రహ్మానందం బ్రహ్మాండంగా ఉన్నారు..

ఇటీవల గుండెకి సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్న బ్రహ్మానందాన్ని గురువారం అల్లు అర్జున్ ఆయన స్వగృహానికి వెళ్ళి పలుకరించారు. సరదాగా జోకులేసుకుంటూ ఇద్దరూ కలిసి సూపర్ ఫైన్ అంటూ ఇచ్చిన ఫొజులు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బ్రహ్మానందం బ్రహ్మాండంగా ఉన్నారని తెలుసుకున్న ఆయన అభిమానులు సైతం తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కామెంట్స్ పెడుతున్నారు.

భిన్న కథాంశం



శృతి శర్మ, నవీన్ పొలిశెట్టి

నవీన్ పొలిశెట్టి, శృతి శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'. స్వరూప్ ఆర్ఎస్‌జే దర్శకత్వంలో స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్క నిర్మిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ పూర్తయ్యింది. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్‌కి, టీజర్‌కి విశేషమైన స్పందన లభించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చిలో సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఇందులో నవీన్ డిటెక్టివ్‌గా నటిస్తున్నాడు. ఆయన పాత్రలో మంచి సెన్సాఫ్ హ్యూమర్ ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునే వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. ఆదరించాలని కోరుకుంటున్నాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె రాబిన్, సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, ఆర్ట్: క్రాంతి ప్రియం.

వైభవంగా నేనే ముఖ్యమంత్రి ప్రీ రిలీజ్ వేడుక



మోహన్, శశి, వాయుతనయ్, అట్లూరి నారాయణరావు, అల్లూరి సాంబశివరావు, ఫణికల్యాణ్

'స్వలాభం కోసం కాకుండా ప్రజలకి సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చే నిజయితీ గల రాజకీయ నాయకులను మాత్రమే మనం ఎన్నుకోవాలనే కథాంశంతో 'నేనే ముఖ్యమంత్రి' చిత్రాన్ని రూపొందించాం' అని అంటున్నారు నిర్మాత అట్లూరి నారాయణరావు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్, ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. మోహన్ రావిపాటి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో దేవిప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక నందిగామలోని చైతన్య కాలేజ్ గ్రౌండ్‌లో బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ, 'మనల్ని పాలించే నాయకులను ఎలాంటి వారిని ఎన్నుకోవాలి?, ఎలాంటి నాయకులను ఎన్నుకోవద్దు? అనే అంశాన్ని ఈ చిత్రం ద్వారా చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రమిది' అని అన్నారు. 'మా చిత్రంలో సమకాలీన రాజకీయ అంశాల గురించి చర్చించాం. అన్ని వర్గాలకి నచ్చే అంశాలతో పాటు అందర్నీ ఆలోచింపచేసే సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి. ఈ నెల 8న సినిమాని విడుదల చేస్తున్నాం. పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాం' అని మరో నిర్మాత ఆలూరి సాంబశివరావు తెలిపారు. చిత్ర దర్శకుడు మోహన్ రావిపాటి చెబుతూ, 'మన అభివృద్ధి కోసం మనకు ఎలాంటి నాయకుడు అవసరమో, ఎలాంటి నాయకుల అవసరం లేదో తేల్చి చెప్పే చిత్రమిది. నిజాయితీ పరులను ఎన్నుకోండి అని చెబుతున్నాం. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా సినిమా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాయు తనయ్, శశి, నందిగామ మున్సిపల్ చైర్మెన్ పద్మావతి, చైతన్య కాలేజ్ చైర్మెన్ జ్యోతి, రమేష్ దంపతులు పాల్గొన్నారు.



విశాల్

విశాల్ నటిస్తున్న నయా చిత్రం 'అయోగ్య'. తెలుగు 'టెంపర్' చిత్రానికి ఇది రీమేక్. వెంకట్ మోహన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్ర టీజర్ గురువారం విడుదలైంది. ఇందులో నెగటివ్ షేడ్స్ ఉన్న పోలీస్ అధికారి పాత్రలో విశాల్ చేసే యాక్షన్, విలనిజం ఆద్యంతం ఆకట్టుకుంటోంది. అంతేకాకుండా 'టెంపర్' చిత్రాన్ని యదాతథంగా తెరకెక్కించినట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది. ఇందులో రాశీఖన్నా కథానాయికగా నటిస్తుంది. ఎన్టీఆర్, కాజల్ జంటగా నటించిన 'టెంపర్'కి పూరీజగన్నాథ్ దర్శకత్వం వహించారు. ఇక్కడ భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమా బాలీవుడ్‌లో 'సింబా'గా రీమేకై ఘన విజయం సాధించింది. రణ్‌వీర్ సింగ్, సారా అలీ ఖాన్ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి రోహిత్ శెట్టి దర్శకత్వం వహించారు.

అరుదైన కాంబినేషన్..!



ఫరాఖాన్, రోహిత్‌శెట్టి

ఇటీవల 'సింబా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు రోహిత్ శెట్టి నిర్మాతగా ఓ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. దర్శకురాలు ఫరా ఖాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. రోహిత్ శెట్టి పిక్చర్స్ పతాకంపై నిర్మించబోయే ఈ చిత్రం గురించి రోహిత్ శెట్టి మాట్లాడుతూ, 'ఇది కచ్చితంగా ఓ అద్భుతమైన కలయిక అవుతుంది. ప్రతిభావంతులతో కలిసి పనిచేసేందుకు నేను ఎగ్జైటింగ్‌గా వెయిట్ చేస్తున్నా' అని తెలిపారు.

ఈ సందర్భంగా దర్శకురాలు ఫరాఖాన్ మాట్లాడుతూ, 'కొన్నిసార్లు మనం ఊహించనివి జరుగుతాయి. నా సోదర సమానుడు రోహిత్‌తో కలిసి పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది. కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తానని ప్రామీస్ చేస్తున్నా. ఇది వినోదానికి తల్లిలాంటి చిత్రమవుతుంది. సినిమాని ప్రారంభించేందుకు ఈగర్‌గా వెయిట్ చేస్తున్నా' అని చెప్పారు. మరి వీరి డిఫరెంట్ కాంబినేషన్‌లో ఎలాంటి సినిమా వస్తుంది, నటీనటులు ఎవరనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే ఉంది. రోహిత్‌శెట్టి దర్శకుడిగా 'సూర్యవంశీ' చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నవచిత్రం

వెటరన్ రీమేక్‌కి గ్రీన్‌సిగ్నల్!



సల్మాన్‌ఖాన్

సల్మాన్ ఖాన్ ప్రస్తుతం 'భారత్' చిత్రంలో నటిస్తున్న విషయం విదితమే. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో కత్రినా కైఫ్, దిశా పటానీ కథానాయికలుగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇది సౌత్ కొరియన్ హిట్ చిత్రం 'ఒడె టు మై ఫాదర్'కి రీమేక్. తాజాగా మరో రీమేక్‌లో నటించేందుకు సల్మాన్ సిద్ధమవుతున్నారని సమాచారం. సౌత్ కొరియాకు చెందిన యాక్షన్ కామెడీ 'వెటరన్' చిత్ర రీమేక్‌లో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. 2015లో విడుదలైన ఈ సౌత్ కొరియన్ చిత్రం భారీ విజయాన్ని సాధించింది. సౌత్ కొరియన్ సినిమా చరిత్రలోనే అత్యధిక కలెక్షన్లు రాబట్టిన నాలుగో చిత్రంగా నిలిచింది. ఈ చిత్ర రీమేక్ హక్కులను బాలీవుడ్‌కి చెందిన రీల్‌లైఫ్ ప్రొడక్షన్ సంస్థ దక్కించుకుంది. సల్మాన్ హీరోగా రీమేక్ చేయాలని ఈ సంస్థ భావిస్తోంది. దీనికి సల్మాన్ కూడా సుముఖతని వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఇందులోనూ సల్మాన్ స్పైగా కనిపించనున్నారట. అయితే ఈ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహిస్తారనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్. సల్మాన్ నటిస్తున్న 'భారత్' చిత్రాన్ని రంజాన్‌కి విడుదల చేయనున్నారు. త్వరలో 'దబాంగ్3'లో నటించనున్నారు. దీంతోపాటు డేవిడ్ ధావన్ తనయుడు రోహిత్ ధావన్ దర్శకత్వంలోనూ ఓ సినిమా చేయబోతున్నారట. మొత్తమ్మీద వరుస ప్రాజెక్టులతో సల్మాన్ బిజీ అవ్వబోతున్నారని వేరే చెప్పక్కర్లేదు.



హన్సిక

ప్రేమ పరిచయం ప్రారంభం

రజత్ రాఘవ్ హీరోగా, సిద్ధికా శర్మ, కరీష్మా కౌర్ హీరోయిన్లుగా శివ.ఐ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ప్రేమ పరిచయం'. ప్రేమ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఎం.పెరుమాండ్లు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. పారిశ్రామికవేత్త సుభాష్‌రెడ్డి ముహూర్తపు షాట్‌కు క్లాప్ ఇవ్వగా, చిత్ర నిర్మాత పెరుమాండ్లు కెమెరా స్విచాన్ చేశారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ, 'యువతీ యువకులు తెలిసీ తెలియక ఎన్నో పొరపాట్లు చేస్తుంటారు. అయితే వాటి ప్రభావం భవిష్యత్‌పై ఉంటుందని చెప్పే చిత్రమిది. రొమాన్స్‌తోపాటు అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. యువతకి చక్కటి సందేశాన్నిచ్చే సినిమా అవుతుంది. ఈ నెల 11 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని అన్నారు. 'దర్శకుడిగా నాకిది తొలి చిత్రం. ప్రేమ గురించి ఎన్నో చిత్రాలు వచ్చాయి. అసలు ప్రేమ ఎలా ప్రారంభమవుతుందనే విషయాన్ని లోతుగా సినిమాలో చూపిస్తున్నాం. సినిమా ద్వారా కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే నేచర్‌ని కూడా విజువల్స్ ఎఫెక్ట్స్ ద్వారా చూపిస్తున్నాం' అని దర్శకుడు శివ తెలిపారు. మామిడి హరికృష్ణ చెబుతూ, 'దర్శకుడు నాకు చాలా కాలంగా తెలుసు. ప్రేమ సినిమాల్లో ఇది భిన్నంగా ఉంటుంది' అని చెప్పారు. 'సబ్జెక్ట్ బాగుంది. రెండు కోణాలున్న పాత్ర పోషిస్తున్నా' అని హీరో తెలిపారు. 'మోడ్రన్ అమ్మాయిగా కనిపిస్తా' అని హీరోయిన్ సిద్ధికా శర్మ చెప్పారు.



సిద్ధికా శర్మ, రజత్ రాఘవ్, కరీష్మా కౌర్

డబ్బింగ్ మొదలైంది



అల్లరి నరేష్, దిల్‌రాజు, వంశీ పైడిపల్లి తదితరులు

మహేష్‌బాబు హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో 'మహర్షి చిత్రం రూపొందుతోంది. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అల్లరి నరేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర ఫిల్మ్స్, వైజయంతి ఫిల్మ్స్, పీవీపీ సినిమా పతాకాలపై ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర డబ్బింగ్ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పూజా కార్యక్రమంలో అల్లరి నరేష్, వంశీపైడిపల్లి, దిల్‌రాజుతోపాటు చిత్ర బృందం పాల్గొంది. రిషిపాత్రలో మహేష్ నటిస్తున్నారు. విద్యార్థిగా, కార్పొరేట్ సెక్టార్‌కి చెందిన వ్యక్తిగా, రైతుల కోసం తపించే వ్యక్తిగా విభిన్న కోణాలున్న పాత్రలో మహేష్ కనిపించనున్నారట. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్, సెకండ్ లుక్స్‌కి మంచి స్పందన లభించింది. వచ్చే నెలలో టీజర్‌ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 25న సినిమాని రిలీజ్ చేయబోతున్నారు.

సినిమానే సమాధానం చెబుతుంది



మమ్ముట్టి, విజయ్ చిల్లా, మహి.వి.రాఘవ్

మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర ప్రధానంగా 'యాత్ర' చిత్రం రూపొందింది. వైఎస్‌గా మమ్ముట్టి నటించారు. మహి వీ రాఘవ్ దర్శకత్వంలో శశిదేవి రెడ్డి, విజయ్ చిల్లా నిర్మించారు. నేడు (శుక్రవారం) సినిమా విడుదల కానుంది.

ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఈ సినిమా పట్ల పలు ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జగన్‌కి సపోర్ట్‌గానా, ఎన్నికల కోసమా అనే సందేహాలు కలుగుతున్నాయి. దీనికి సినిమానే సమాధానం చెప్పబోతుంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర గురించి తెలుగు ప్రజలకి తెలుసు. కానీ అది ఆయన రాజకీయ యాత్రలో ఎంత కీలకమో కొంతమందికే తెలుసు. వైఎస్ ప్రజలకి దగ్గరగా వెళ్ళాలనుకున్నప్పుడు ఎదురైన అనుభవాలు, ఆటంకాలను దాటుకుని, కడప దాటి ప్రతి గడపలోకి స్వయంగా వెళ్ళి పేదవాడి సమస్యలు తెలుసుకోవడానికి ఈ యాత్ర చేపట్టారు. డాక్టర్ రాజశేఖరుడిగా ప్రారంభించిన యాత్ర రాజన్నగా ముగిసిందంటే ఆయన ప్రజలకి అంతగా దగ్గరయ్యారనేది సత్యం. దాన్ని 'యాత్ర' సినిమా ప్రతిబింబిస్తుంది. ఆయన పాదయాత్ర 68 రోజులపాటు సాగితే, యాదృచ్ఛికంగా సినిమా కూడా 68 రోజుల్లో పూర్తయ్యింది. ఈ 68 రోజుల్లో రైతుల కష్టాలు, పేదవాళ్ళ ఆవేదనలు ప్రతి ఒక్కరి భావోద్వేగాలు రాజన్న మనసుతో వినడమే సినిమాలో కీలక ఘట్టం. ఎలాంటి రాజకీయాలు లేని రాజకీయ నాయకుడి కథే ఈ సినిమా. ఆద్యంతం భావోద్వేగపూరితంగా సాగుతుంది. క్వాలిటీ విషయంలో నిర్మాతలు రాజీపడకుండా నిర్మించారు. సినిమాకి మమ్ముట్టి నటన హైలైట్‌గా నిలుస్తుంది. కథ చెప్పినప్పుడే కథలోని పాత్రలు, వారి కష్టాలు మమ్ముట్టిని కలచివేశాయి. వైఎస్ పాత్రలో పరకాయ ప్రవేశం చేశారు. ఈ సినిమా చేస్తున్నామని చెప్పినప్పుడు వైఎస్ కుటుంబంగానీ, జగన్‌గానీ ఎక్కడా అభ్యంతరాలు చెప్పలేదు. అంతేకాదు 'మీ నాయకుడి చిత్రం మీరు తీస్తున్నారు. ఆయన గురించి మీకే బాగా తెలుసు. నాయన చేసిన పనులు చెప్పండి చాలు' అని చెప్పడం ఆయన గొప్పతనానికి నిదర్శనం. ఈ చిత్రాన్ని ఓవర్సీస్‌లో 180 స్క్రీన్స్‌లో, ఏపీ, తెలంగాణల్లో 500 స్క్రీన్లలో, ప్రపంచ వ్యాప్తంగా 970 స్క్రీన్లలో విడుదల చేస్తున్నాం. భారీ ఓపెనింగ్స్‌ని రాబట్టే చిత్రంగా నిలుస్తుందని నమ్ముతున్నాం' అని తెలిపింది.

తెనాలి రామకృష్ణ రెగ్యులర్ షూటింగ్ షురూ..

సందీప్ కిషన్, హన్సిక జంటగా జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకత్వంలో ఎస్ఎన్ఎస్ క్రియేషన్స్ పతాకంపై అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'తెనాలి రామకృష్ణ బీఏ బిఎల్'. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. 'ఔట్ ఎండ్ ఔట్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. గతంలో ప్రారంభమైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ని గురువారం కర్నూలులో ప్రారంభించాం. హీరో సందీప్ కిషన్, హన్సిక షూటింగ్‌లో పాల్గొంటున్నారు' అని చిత్ర బృందం తెలిపింది. మురళీ శర్మ, వరలక్ష్మి శరత్ కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: సాయి శ్రీరామ్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ఆర్ట్: కిరణ్.



సందీప్‌కిషన్

అంతా మోడీ చేశారు.?

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయమే తీసుకున్నట్టుగా తదనంతర పరిణామాల్ని పరిశీలిస్తే అర్థమవుతోంది. ఇదంతా తాను ఓ ప్రయివేట్ కంపెనీకి లబ్ది చేకూర్చేందుకు ముందస్తు ప్రణాళికతో వెళ్లినట్టుగానే కనిపిస్తుందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రకటన తర్వాత జరిగిన విషయాలను ఓ క్రమంలో పెట్టి చూస్తే ఎవరికైనా ఇది అర్థమవుతుంది.

2016 మే నెలలో అప్పటి రక్షణమంత్రి మనోహర్ పారికర్ మాట్లాడుతూ '36 రాఫెల్ జెట్ల సరఫరాకు సంబంధించిన షరతులు, నిబంధనలు, డెలివరీ కాలం, ధర, గ్యారెంటీపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదు' అన్నారు. అయితే, అదే నెలలో(4,మే,2016) కార్పొరేట్ పోర్టల్ 'ఇంటెలిజెన్స్ ఆన్‌లైన్'లో ప్రచురితమైన న్యూస్ స్టోరీలో ధరకు సంబంధించిన ఓ లీకేజ్ వార్త వచ్చింది. 36 దసాల్ట్ రాఫెల్ జెట్లకు 780 కోట్ల యూరోల(రూ.59000 కోట్లు) ధరతో కొనుగోలు చేయడంపై త్వరలోనే రక్షణమంత్రి తుది నిర్ణయానికి రానున్నారని ఆ కథనంలో ఉన్నది. రాఫెల్ జెట్ల ధర విషయం ఇప్పుడు బహిర్గతమై అందరూ చర్చించుకున్నది కూడా అదే ధర కావడం యాదృచ్ఛికమని ఎవరైనా భావించగలరా..? రాఫెల్ జెట్లను ఆ ధరకు కొనుగోలు చేయనున్నట్టు ఆ పోర్టల్‌కున్న ఆధారమేమిటి..? ఎవరా సమాచారాన్ని లీక్ చేశారు ? ఇందులో బీజేపీ అధినాయకత్వం పాత్ర ఎంత..? రక్షణ ఒప్పందంలో జాతీయ రక్షణ సలహాదారు అజిత్‌దోవల్ ప్రమేయం ఏమేరకు..? అనిల్ అంబానీకి సహాయపడటంలో వీరి పాత్ర ఏమిటి..? ఈ ప్రశ్నలకు సమాధానంగా మరో కీలక ఆధారం రికార్డయింది.

అదేకాక రాఫెల్ ఒప్పందంలోకి అనిల్ అంబానీ కంపెనీని తీసుకోవడంపై దసాల్ట్ కంపెనీ నుంచి అసంతృప్తి వ్యక్తమైందని తెలిపే కథనం కూడా ఉన్నది. 2015 సెప్టెంబర్‌లో ఎకనామిక్ టైమ్స్‌లో వచ్చిన కథనం ప్రకారం అనిల్ కంపెనీకి దసాల్ట్ ప్రాజెక్టుల్లో ఆఫ్‌సెట్ భాగస్వామ్యం కల్పించేది రక్షణ రంగంలో కాదని, పౌరసంబంధ ప్రాజెక్టులలో మాత్రమేనని రక్షణమంత్రిత్వశాఖ వర్గాలు చెప్పినట్టుగా ఆ కథనం తెలిపింది. ఇది అనిల్ కంపెనీకి ఏదో ఒక లబ్ది చేకూర్చడానికి ఓ పరిష్కారంగా జరిగిన సమాలోచనగా అర్థం చేసుకోవాలి. డిఫెన్స్ డీల్‌కు ప్రభుత్వం సిఫారసు చేసిన భారత కంపెనీ ఆర్థిక సామర్థ్యం పట్ల దసాల్ట్‌కు అభ్యంతరాలున్నందునే పౌర ప్రాజెక్టులకే ఆ కంపెనీని పరిమితం చేయాలని సూచించినట్టు భావించాలి.

సంక్షోభంలో కూరుకుపోయిన ఓ వ్యాపారవేత్తకు సహాయపడేందుకు రాఫెల్ డీల్‌ను ప్రధాని మోడీ ఎంచుకున్నారని తెలిపే మరో ఆధారం కూడా ఉన్నది. రాఫెల్ డీల్‌పై ఫ్రాన్స్, భారత్ ప్రభుత్వాల మధ్య అంతర్గత ఒప్పందం(ఐజీఏ)పై సంతకాలు(2016,సెప్టెంబర్ 23న) జరగడానికి రెండు నెలల ముందు ప్రచురితమైన ' ఏ పీస్ట్ ఆఫ్ ఉల్చర్స్'లో కొన్ని కీలక అంశాలున్నాయి. దీనిని పరిశోధక జర్నలిస్ట్ జోసీ జోసెఫ్ రాశారు. అందులో ఓ విదేశీ మహిళా దౌత్యవేత్తతో ఆయన జరిపిన సంభాషణలను 'ఇన్‌సైడర్స్ అండ్ ద అవుట్‌లాస్' అనే అధ్యాయంలో ప్రస్తావించారు. ఆ సంభాషణలన్నీ రాఫెల్ డీల్‌కు సంబంధించినవేనని ఎవరికైనా అర్థమవుతాయి. ఆ అధ్యాయంలో ఆయనకు ఆ దౌత్యవేత్త ఎంతో ఆసక్తిగా, ఉద్వేగపూరితంగా తెలిపిన వివరాల సారాంశం ఇలా ఉన్నది..

ఇదంతా ఎంతో అయోమయంగా అనిపిస్తోంది. ప్రభుత్వంలోని కొందరు అధికారులు, అధికార పార్టీకి చెందిన కీలక వ్యక్తి ఈ డీల్ పట్ల అమితాసక్తి చూపుతున్నారు. అందుకు ప్రతిఫలంగా వారేమి ఆశిస్తున్నారో తెలియదు. తమ దేశం(దౌత్యవేత్త దేశం) వందల కోట్ల డాలర్ల(వేలకోట్ల రూపాయల) విలువైన ఒప్పందంపై చర్చల్లో పురోగమన దశకు చేరుకున్నది. ప్రయివేట్ కంపెనీ నుంచి సరఫరాలకు సంబంధించిన ఈ డీల్‌లో భారత్‌కు చెందిన ఓ కోటీశ్వరున్ని భాగస్వామిని చేయనున్నారు. ఇద్దరు కీలక వ్యక్తులు ఆయన్ని ఈ డీల్‌లోకి తేవడం పట్ల ఎందుకంత ఆసక్తి చూపుతున్నారో విదేశీయురాలినైన తనకు అర్థంకావడంలేదు. అందులో ఒకరు అధికార పార్టీలో కీలక వ్యక్తి. ప్రధానికి విశ్వాసపాత్రుడిగా ఆయనకు పేరున్నది. మరొకరు రిటైర్డ్ ప్రభుత్వ అధికారి. నూతన ప్రభుత్వంలో ఆయన్ని ఓ కీలక పోస్ట్‌లో నియమించారు. పార్టీ నేత ఈ డీల్ పట్ల ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. ఎప్పటికపుడు ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ అధికారి ఈ డీల్‌పై చర్చల్లో పాల్గొన్నారు. అయితే, ఇది ఆయనకున్న అధికార పరిధిలోని అంశం కానందున మాకు ఆశ్చర్యం కలిగింది అంటూ విదేశీ దౌత్యవేత్త ఎంతో భావోద్వేగంతో తనతో ఈ విషయాలు పంచుకున్నారని జోసీ తన పుస్తకంలో వివరించారు. అయితే, జోసీ ఎవరి పేర్లుగానీ, ఆ విదేశీ దౌత్యవేత్త ఎవరన్నదిగానీ తన పుస్తకంలో వెల్లడించలేదు. కానీ, ఆ దౌత్యవేత్త చెప్పిన విషయాలన్నీ రాఫెల్ డీల్‌కు అతికినట్టు సరిపోతాయని పరిశీలకులు చెబుతున్నారు. ఆమె ప్రస్తావించింది అధికార పార్టీ(బీజేపీ) అధ్యక్షుడు అమిత్‌షా, జాతీయ రక్షణ సలహాదారు అజిత్‌దోవల్, ప్రజా సంబంధాల(పీఆర్) అధికారి సుహేల్ సేథ్‌గా న్యూస్‌క్లిక్ పోర్టల్ తన కథనంలో తెలిపింది.

ఈ కథనం ఆధారంగా చూస్తే ఫ్రాన్స్ రక్షణ ఉత్పత్తుల కంపెనీ దసాల్ట్‌కు ఇష్టంలేకున్నా అనిల్ కంపెనీకి ఆఫ్‌సెట్ భాగస్వామ్యం ఇప్పించడంలో వీరంతా తమతమ పాత్ర పోషించారని అర్థమవుతోంది. అనిల్ అంబానీ తరపున లాబీయింగ్ చేయడానికి వీరంతా ఎందుకు అంత ఆసక్తి చూపారన్నదే ప్రశ్న. దేశ రక్షణలో కీలకమైన వైమానిక దళం అవసరాలను కూడా ఈ డీల్ కోసం పక్కనపెట్టారా..? అన్న ప్రశ్న కూడా వస్తోంది. ఈ డీల్‌పై అప్పటి రక్షణమంత్రి పారికర్ పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు కూడా ఇది ప్రధాని మోడీ సొంత నిర్ణయంగానే పరిశీలకులు భావిస్తున్నారు. 2015,ఏప్రిల్ 13న పారికర్ ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు. రాఫెల్ డీల్‌పై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ' ఏ నిర్ణయం తీసుకోవాలో నాయకుడికి తెలుసు. ఆయనే ధైర్యంగా తీసుకున్న నిర్ణయం' అంటూ తేల్చేశారు. ఇందులో తన పాత్ర ఏమీలేదని పరోక్ష సంకేతాలిచ్చారు. ఆ తర్వాత రెండురోజులకు మరో ఇంటర్వ్యూలోనూ పారికర్ మరింత స్పష్టంగా ఇది ప్రధాని మోడీ నిర్ణయమని వివరణ ఇచ్చారు. 36 యుద్ధ విమానాల కొనుగోలు నిర్ణయం ప్రధాని మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హెూలాండే మధ్య జరిగిన చర్చల ఫలితమని పారికర్ తెలిపారు.

సిర్పూరు పేపర్ మిల్లు పున:ప్రారంభం

- ఏడో నెంబర్ యంత్రం ద్వారా పేపర్ ఉత్పత్తి

నవతెలంగాణ - కాగజ్‌నగర్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నాలుగున్నరేండ్ల కిందట మూతపడిన సిర్పూరు పేపర్ మిల్లు పున:ప్రారంభమైంది. గురువారం ఉత్పత్తి మొదలెట్టారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే ఈ మిల్లు మూతపడిన విషయం తెల్సిందే. షట్‌డౌన్ పేరిట మిల్లును అప్పటి యాజమాన్యం 2014, సెప్టెంబర్ 27న మూసేసింది. ఈ మిల్లు పునరుద్ధరణ కోసం స్థానిక ఎమ్మెల్యే కోనప్ప రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం, కార్మికుల పోరాటంతో జెకె గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మిల్లును తీసుకునేందుకు గత ఏడాది ముందుకొచ్చింది. గత ఏడాది ఆగస్టులో జెకె యాజమాన్యం మిల్లును తన ఆధీనంలోకి తీసుకుంది. మిల్లులోని యంత్రాలను పూర్తి స్థాయిలో ఆధునీకరించి గురువారం నుంచి పేపర్ ఉత్పత్తి ప్రారంభించారు. డైరెక్టర్ పవన్‌కుమార్ సూరి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మిల్లు వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) మయాంక్ జిందాల్, వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) అనిల్‌దీక్షిత్‌తో పాటు పలువురు అధికారులు, పట్టణ ప్రముఖుల సమక్షంలో ప్రారంభించారు. అనంతరం మిల్లు డైరెక్టర్ పవన్‌కుమార్ సూరి మాట్లాడుతూ.. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి మిల్లులోని అన్ని యంత్రాల ద్వారా ఉత్పత్తి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆధునిక యంత్రాలతో గత యాజమాన్యం చేసిన ఉత్పత్తి కంటే అదనంగా 40 శాతం పేపర్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

మా ఆదేశాలతోనే ఆటలా ?

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలను ఉల్లంఘించినందుకుగానూ సీబీఐ ప్రాసిక్యూషన్ ఇంచార్జి డైరెక్టర్ ఎస్.బాసురాం కూడా వ్యక్తిగతంగా హాజరు కావాలని ధర్మాసనం స్పష్టం చేసింది. దాంతోపాటు ఎకె శర్మను బదిలీలో భాగస్వామ్యమున్న అధికారుల పేర్లను తమకివ్వాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. ముజఫర్‌పూర్ షెల్టర్ హోంలో ఆశ్రయం పొందుతున్న బాలికలపై నిర్వాహకుల లైంగికదాడి విషయం వెలుగులోకి రావడం తీవ్ర దుమారాన్ని రేపిన సంగతి తెలిసిందే.. కాగా ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సీరియస్‌గా తీసుకున్నది. ఈ క్రమంలోనే కేసు విచారణ చేస్తున్న సీనియర్ అధికారి ఎ.కె శర్మను ఎట్టి పరిస్థితుల్లోనూ బదిలీ చేయవద్దని, దర్యాప్తు పూర్తయ్యేంతవరకూ అలాగే ఉంచాలని సుప్రీంకోర్టు గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కాగా.. సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా ఉన్న నాగేశ్వర్‌రావు.. ఎకె శర్మను సీఆర్‌పీఎఫ్ అడిషనల్ డీజీపీగా బదిలీ చేస్తూ జనవరి 17న నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇదేకాక.. నాగేశ్వర్‌రావు మరోరూపంలో కూడా చిక్కులు ఎదుర్కోనున్నారు. సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వర్‌రావు పాలనాపరమైన విధులకే పరిమితం కావాలని, ఎలాంటి విధానపరమైన నిర్ణయాలూ తీసుకోరాదని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను కూడా నాగేశ్వర్‌రావు ధిక్కరించినట్టు స్పష్టమవుతున్నది. సీబీఐ చీఫ్‌గా ఉన్న అలోక్‌వర్మ, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాలను కేంద్రం సెలవుపై పంపడంతో తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే.

ఇద్దరిపై వేటు.. ఇద్దరికి ప్రమోషన్

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) పాలనా వ్యవహారాలు గాడిన పడినట్టు కనిపించడం లేదు. అలోక్ వర్మ, రాకేశ్ ఆస్థానాల మధ్య వివాదంలో బయటపడిన లుకలుకలు సీబీఐని ఇప్పట్లో వీడేలా లేవు. సీబీఐలో సీనియర్ అధికారులుగా ఉన్న అనీశ్ ప్రసాద్, అభయ్ సింగ్‌ల.. పదవీకాలాన్ని తగ్గిస్తూ క్యాబినెట్ నియామకాల కమిటీ బుధవారం నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. వీరిలో అనీశ్ ప్రసాద్.. ఆస్థానాపై విచారణ చేపట్టిన బృందంలో కీలక సభ్యుడు కావడం గమనార్హం. త్రిపుర ఐపీఎస్ క్యాడర్ 2003 బ్యాచ్‌కు చెందిన ప్రసాద్‌ను తిరిగి సొంత రాష్ట్రానికే పంపుతూ నిర్ణయం తీసుకున్నారు. మధ్యప్రదేశ్ ఐపీఎస్ క్యాడర్ 2002 బ్యాచ్‌కు చెందిన అభయ్‌సింగ్ పోస్టింగ్ ఎక్కడన్నది ఇంకా ఖరారు కాలేదు. ఈ విషయమై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది.

మరోవైపు.. ఆస్థానా అనుచరులుగా ఉన్న ఇద్దరు సీబీఐ అధికారులకు ప్రమోషన్లు దక్కాయి. గుజరాత్ క్యాడర్‌కు చెందిన జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ సిన్హాకు అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. అంతేకాక.. ఛత్తీస్‌గఢ్ ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన డీఐజీ అమిత్‌కుమార్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు.

వేతన సమస్యను పరిష్కరించండి



(మొదటిపేజీ తరువాయి)

ధర్నా చేశారు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ఆశా కార్యకర్తలు కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యకం చేసి, అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతకు వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రోనాల్డ్ రోస్‌కు వినతిపత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోనూ ధర్నా చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ కార్యాలంయలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహులు ఆధ్వర్యంలో ధర్నా చేసి ఏఈకి వినతిపత్రం అందజేశారు. సిద్దిపేటలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవంత్ కుమార్ ఆధ్వర్యంలో ఆశాలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తరలొచ్చిన ఆశాలు ధర్నాలో పెద్దఎత్తున పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏవో గుండె రావుకు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పారితోషికం లేకుండా శుక్రవారం నుంచి చేపట్టాల్సిన ఎన్‌సీడీ సర్వే, కంటి వెలుగు కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

మద్దతు ధర కోసం రైతుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

నిధులు విడుదల చేయాలని కోరారు. పారిశ్రామికవేత్తలకు తగిన ప్రోత్సాహకాలు ఇచ్చి పసుపు పంటను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. పసు పు బోర్డు ఏర్పాటు చేసి పడగల్ నుంచి విదేశాలకు మార్కె టింగ్ సౌకర్యం ద్వారా బ్రాండు కల్పించాలని అన్నారు. పసు పు కొమ్ములు ఉడకబెట్టిన తర్వాత ఆరబెట్టడానికి ప్లాట్‌ఫాం లు, పంటను నిల్వ చేయ డానికి గోదాములు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లై న్‌లో అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. పసు పు రైతుకు మద్దతు ధర ప్రకటిం చకుంటే ఆత్మహత్యే శరణ్య మని శెట్టిపల్లి నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా రావడం లేదని అన్నారు. పారిశ్రా మికవేత్తలు సుగంధ ద్రవ్యాల్లో పసుపును విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారన్నారు. రైతులకు మాత్రం గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఆగ్ర హం వ్యక్తం చేశారు.

ఎర్రజొన్నకు రూ.3500 మద్దతు ధర ప్రకటించాలి

ఎర్రజొన్న పంటకు రూ.3500 ప్రకటించాలని రైతులు డిమాండ్ చేశారు. రాయితీ ద్వారా విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. విత్తనాలు ఇచ్చిన వ్యాపారులకే పంట విక్రయించాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు. గతేడాది మాదిరిగానే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

అధికారులను నిలదీసిన రైతులు

రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న జిల్లా వ్యవ సాయ అధికారి గోవింద్, ఉద్యానవన అధికారి నర్సింగ్ దాస్, మార్కెటింగ్ ఏడీ రియాజ్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ అక్కడికొచ్చారు. రైతుల డిమాండ్లను ప్రభు త్వం దృష్టికి తీసుకుపోతామని సంయ మనం పాటించాలని అన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో నాలుగు వేలకే లాక్ చేశారనీ, వ్యాపారులకు అధికారులు వత్తాసు పలు కుతున్నారనీ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారి గోవింద్ సమాధా నమిస్తూ.. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపో యేందుకు గడువు కావాలని కోరగా, రైతులు కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. సంయమనం పాటిం చాలని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు 11వ తేదీ వరకు గడువు కావాలని అదనపు సీపీ శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి గోవింద్ చెప్పారు. దాంతో రైతులు శాంతించారు. గడువు తేదీ వరకూ ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తామని రాస్తారోకో విరమించారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి

రైతు నాయకులు అన్వేష్‌రెడ్డి, ఏఐకేఎంఎస్ నాయకులు ప్రభాకర్, దేవరాం రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర లేని సందర్భంలో ఈ నిధి నుంచి చెల్లించాలన్నారు.

12 ఇంజినీరింగ్ కాలేజీలు మూత

- అదే దారిలో ఒక ఫార్మా కళాశాల
- జేఎన్టీయూహెచ్‌కు యాజమాన్యాల దరఖాస్తు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2019-20 విద్యాసంవత్సరంలో 13 వృత్తి విద్యా కాలేజీలు మూతపడనున్నాయి. ఇందులో 12 ఇంజినీరింగ్ కాలేజీలుంటే, ఒక ఫార్మా కాలేజీ ఉన్నది. ఇందుకు సంబంధించి ఆయా కాలేజీ యాజమాన్యాలు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్)కు దరఖాస్తు చేసుకున్నాయి. వచ్చే విద్యాసంవత్సరంలో కాలేజీలను నడపలేమని జేఎన్టీయూహెచ్‌కు దరఖాస్తు చేశాయి. 2018-19 విద్యాసంవత్సరంలో 205 ఇంజినీరింగ్ కాలేజీలున్న విషయం తెలిసిందే. 205 ఇంజినీరింగ్ కాలేజీల్లో 96,518 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరంలో 68,296 మంది విద్యార్థులు చేరారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో 28,222 సీట్లు మిగిలాయి. వచ్చే విద్యాసంవత్సరంలో 13 ఇంజినీరింగ్ కాలేజీలు మూత పడుతుండడంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉండే సీట్ల కన్నా వచ్చే విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ సీట్లు తగ్గనున్నాయి.

మూతపడుతున్న కాలేజీలు

1. అల్ హబీబ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
2. అయాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
3. జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్
4. కృష్ణమూర్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్
5. నిశిత కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
6. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
7. పల్లవి వీఐఎఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
8. ప్రిన్స్‌టన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
9. విద్యాభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
10. పీఆర్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కాలేజీ
11. ధృవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
12. షాజ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
13. కేబీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ

14.40 లక్షల ఎకరాలకు ఎస్సారెస్పీ నీరు

(మొదటిపేజీ తరువాయి)

కూలంకషంగా చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. ఎక్కడ ఏ సమస్య ఉందో గుర్తించి, దాన్ని అప్పటికప్పుడే పరిష్కరించారు. భూసేకరణకు, ఇతర పనులకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. గోదావరిలో పుష్కలంగా నీరుందని, ఈ నీటిని ఎత్తిపోయడానికి భారీ వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిన్నామని కేసీఆర్ చెప్పారు. నీటి ప్రవాహ ఉధృతిని పెంచటానికి చర్యలు తీసుకోవాలని, . ఎక్కడ ఏ పనిచేయాలో నిర్ణయించడానికి వెంటనే 50 మంది ఇంజనీర్లను నియమించాలని ఆయన ఆదేశించారు. దీని కోసం యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి, అంచనాలు రూపొందించాలన్నారు. కావాల్సిన నిధులు వెంటనే మంజూరు చేస్తామన్నారు. . శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రాంతం నుంచి మొదలుకుని చివరి ఆయకట్టు కలిగిన డోర్నకల్, తుంగతుర్తి, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల వరకు అన్ని దిక్కులకు నీరు అందాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ ఎస్కే జోషి, సీఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, ఓఎస్డి శ్రీధర్ దేశ్ పాండే, నీటి పారుదల ఈఎన్‌సీలు మురళీధర్, అనిల్ కుమార్, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీలు జె. సంతోష్ కుమార్, సీతారామ్‌నాయక్, ఎమ్మెల్యేలు ఈటల రాజెందర్, డీఎస్ రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బాల్క సుమన్, సుంకె రవిశంకర్, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, గంగుల కమలాకర్, ఆరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, గ్యాదరి కిశోర్, నన్నపునేని నరేందర్, వి. సతీష్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాల్లోని కీలక అంశాలు...

- కాకతీయ కాలువ- వరద కాలువ మధ్యనున్న లక్షా ఎకరాలకు సాగునీరు అందించాలి. అవసరమైన చోట తూములు ఏర్పాటు చేయాలి. వెంటనే ఈ పనుల కోసం సర్వే నిర్వహించి, పనులు ప్రారంభించాలి.
- ఎస్సారెస్పీ రెండవ దశలో అన్ని డిస్ట్రిబ్యూటరీలకు లైనింగ్ చేయాలి. దీనికోసం వెంటనే అంచనాలు రూపొందించి, టెండర్లు పిలవాలి. ఎండాకాలంలోపు పనులు పూర్తి కావాలి.
- ఎస్సారెస్పీ కాల్వల పనులు చేయడానికి ఎక్కడికక్కడ ఎక్కువ మంది కాంట్రాక్టర్లను నియమించాలి. అన్ని చోట పనులు సమాంతరంగా జరగాలి.
- అన్ని ప్రాజెక్టుల కాల్వలకు సంబంధించిన హద్దులను నిర్ణయించాలి. ప్రాజెక్టుల భూముల సమగ్ర వివరాలను (ఇన్వెంటరీ) రూపొందించాలి.
- కడెం గేటు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలి
- ఎస్సారెస్పీ పంట కాల్వలను ఎవరైనా దున్నుకుంటే, వాటిని పునరుద్ధరించాలి. ఈ విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపి, రైతులను ఒప్పించాలి.
- అన్ని ప్రాజెక్టుల ప్రొఫైల్ తయారు చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు ఆపరేషన్ రూల్స్ తయారు చేయాలి.
- ప్రాజెక్టుల నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయాలి. ఆ నిధులను బడ్జెట్ లోనే కేటాయిస్తాం.
- చనాఖా -కొరాటా పనులు మే 15 నాటికి పూర్తి కావాలి.
- దేవాదుల నీటిని తరలించే రామప్ప, లక్నవరం, ఘనపూర్, పాఖాల కాల్వల పనులను ఈ ఎండాకాలంలోనే పూర్తి చేయాలి.

దళిత బిడ్డకు ప్రపంచ గుర్తింపు



(మొదటిపేజీ తరువాయి)

విద్యనభ్యసించిన ఆయన, నృత్య శిక్షకుడు పేర్ని వెంకట్ వద్ద శిష్యుడిగా చేరాడు. కాంత్రిలోని టాలెంట్‌ను గుర్తించి వెంకట్ తన వెంట పలు కార్యక్రమాలకు తీసుకెళ్తూ ప్రోత్సహించారు. దీంతో క్రాంతి సలసల మరిగే నూనెలో చేతులు పెట్టడం, డ్రిల్లింగ్ మిషన్‌తో ముక్కులో గ్రైండ్ చేసుకోవడం, 32 కత్తులు ఏకకాలంలో నోట్లో మింగడం, కండ్లకు గంతలు కట్టుకొని మనిషి చుట్టూ పేర్చిన కొబ్బరి టెంకాయలు, పలు పండ్లను సుత్తితో కొట్టే విద్యలను నేర్చుకుని పలు ప్రదర్శనలు ఇచ్చాడు. ప్రధానంగా ఇంటర్నేషనల్ చెందిన సోనీ టీవీ, జీ టీవీ హిందీ, తెలుగు, తమిళంలో నిర్వహించే పలు రియాల్టీ షోల్లో పాల్గొని ఆయా ప్రోగ్రాముల్లో అందర్నీ ఆకట్టుకుని ప్రశంసలు పొందాడు. సోనీ టీవీ నిర్వహించిన రియాల్టీ షో లో పాల్గొని అక్కడ బాలీవుడ్ డైరెక్టర్ కరణ్ జోహార్ నోటి ద్వారా జై తెలంగాణ అని పించాడు. రియాల్టీ షోల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్రాంతి వీడియోలు అమెరికాకు చెందిన కొంతమంది పేస్ బుక్‌లో పెట్టారు. దీంతో ట్యాలెంట్ షో పాల్గొనాలని అమెరికా నుంచి ఆహ్వానం అందింది. లాస్ ఏంజెల్స్‌కు వెళ్లి రావడానికి అయ్యే ఖర్చులను ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి కాంత్రికి అందజేశారు.

డీసీసీలకు కొత్త ముఖాలు

- ఖమ్మం, హైదరాబాద్ నగరాలకు కూడా...
- 33 మందితో జాబితా విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎట్టకేలకు పాత, కొత్త జిల్లాలకు కాంగ్రెస్ అధ్యక్షులను అధిష్టానం ప్రకటించింది. మొత్తం 31 జిల్లాలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామానికి ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఆమోదం తెలిపారు. ఈమేరకు గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం, గ్రేటర్ హైదరాబాద్ నగర కమిటీల అధ్యక్షులను కూడా ప్రకటించారు. ప్రత్యేకంగా ఖమ్మం నగరానికి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దీపక్‌చౌదరిని నియమించింది. ఈమేరకు 33మందితో కూడిన జాబితాను విడుదల చేసింది. జిల్లాల అధ్యక్షుల నియామకంలో చాలా కాలంగా ప్రతిష్టంభన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా, టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు ఎవరికి వారే జిల్లా అధ్యక్షులు జాబితాలు సమర్పించినట్టు సమాచారం. ఉత్తమ్ సమర్పించిన జాబితా ఒక సామాజికవర్గానికి అనుకూలంగా ఉందంటూ ఆ పార్టీకి చెందిన ఓబీసీ నేతలు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షులను నియమించడంలో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. సామాజిక తరగతులు వారీగా జిల్లా అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. బీసీలకు 12, రెడ్డి 10, బ్రాహ్మణ 2, వెలమ 1, ఎస్టీ 2, ఎస్సీ 2, కమ్మ 2, ముస్లింలకు రెండు చొప్పున కేటాయించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే జగ్గారెడ్డి భార్య నిర్మలాగౌడ్, ఎమ్మెల్యే గండ్ర వెంకట్రామణారెడ్డి భార్య గండ్ర జ్యోతి, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిలకు పదవులు దక్కాయి.

పండితులు, పీఈటీల పదోన్నతుల జీవో నేడు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రేడ్-2 భాషా పండితులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)ల పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం విడుదలయ్యే అవకాశమున్నది. ఇప్పటికే భాషా పండితులు, పీఈటీల పదోన్నతులకు సంబంధించిన దస్త్రంపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతకం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఆ దస్త్రం విద్యాశాఖ, న్యాయశాఖ, ఆర్థిక శాఖ ఆమోదం పొందింది. దీంతో ఉత్తర్వులు విడుదల కావడమే తరువాయిగా మిగిలింది. భాషా పండితులు, పీఈటీల పదోన్నతులకు సంబంధించిన అంశంపై నిరంతరం అధికారులతో సంప్రదింపులు చేస్తున్నామని ఎమ్మెల్సీలు కె జనార్ధన్‌రెడ్డి, పూల రవీందర్, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

తండ్రి ముందే కూతురిపై..

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామంలో మంగళవారం రాత్రి ఆరుగురు యువకులు దాహం వేస్తుందని చెబుతూ ఒక ఇంటి తలుపు తట్టారు. నిజమేనని భావించిన ఆ ఇంట్లోని వారు తలుపులు తీశారు. అంతే, ఆ ఆరుగురు వెంటనే ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న వ్యక్తిని, ఆయన కూతురిని బంధించి ఊరి శివార్లలోకి ఎత్తుకెళ్లారు. అక్కడ ఒక చెట్టుకు తండ్రిని తాళ్లతో కట్టేశారు. ఆయన ముందే ఆ యువతిపై ఆరుగురు దుండగులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం ఈ ఘటన గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలుంటాయని తండ్రీ కూతురిని హెచ్చరించారు. కాగా, బుధవారంనాడు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు..ఫైజ్ ఆలం, అబ్దుల్ మన్నన్, కాలూ, ఖాసీం, తక్సీర్, అన్సార్‌లు అదే గ్రామానికి చెందినవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో ఇద్దరు ఎలక్ట్రీషియన్లనీ, వారే నీరు కావాలని నమ్మబలికి ఇంటి తలుపు తెరిపించారని వివరించారు. కాగా, ఈ కేసులో ఇప్పటివరకు ఎవరూ అరెస్టు కాలేదని కిషన్‌గంజ్ ఎస్పీ కుమార్ ఆశిష్ తెలిపారు.

జగ్గారెడ్డికి ఏమైంది?

- సొంత పార్టీ నేతలపై విమర్శలు...కేసీఆర్‌పై ప్రశంసలా
- మంత్రి పదవి కోసం పాకులాట
- ఎమ్మెల్యే తీరుపై సీనియర్ల గుస్సా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి తీరు ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత అన్నట్టు ఉన్నది. ముందస్తు ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లపై మాటల తూటాలు పేల్చారు. ముఖ్యంగా కేసీఆర్‌పై ఒంటికాలిపై లేచారు. ఎన్నికల తర్వాత కేసీఆర్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ నుంచి ఆయన ఒకరు మాత్రమే గెలిచారు. ఎన్నికల్లో గెలిచాక ఆయనకు ఏమైందో, ఏమోగానీ సొంత పార్టీ నేతలపై విమర్శలు చేస్తూ...కేసీఆర్‌ను పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. దీంతో ఆయన తీరుపై పార్టీ సీనియర్లు గుస్సాగా ఉన్నారు. ఆయన ఎందుకిలా మాట్లాడుతున్నారనేది పార్టీ నేతల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ నేతలు అధిష్టానం వద్ద లాబీయింగ్ చేసి పదవులు పొందుతున్నారంటూ కామెంట్ చేశారు. మరోవైపు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రాజకీయ బ్లాక్‌మెయిలర్ అంటూనే...కేసీఆర్, కేటీఆర్ నమ్మదగిన నాయకులు అంటూ కామెంట్ చేసి వార్తల్లోకెక్కారు. పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేస్తూ ఆయన కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారని ఆ పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేత పదవి ఆశించి భంగపడిన ఆయన...దళిత సామాజికవర్గానికి చెందిన నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు ఆ పదవి దక్కడంతో ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని పార్టీనేత ఒకరు చెప్పారు. తన భార్యకు మెదక్ ఎంపీ టికెట్ ఇప్పించుకునేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా? లేక కారులో షికారు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారా? అనేది అంతు చిక్కని ప్రశ్నగా ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. తానేం చెప్పదలుచుకున్నా...అది నిర్మొహమాటంగా చెప్పగలిగే నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడంలో అంతర్యమేమిటని పార్టీ నేతలు అంటున్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం తనను జైలుకు పంపినప్పుడు తనకు పార్టీ నుంచి భరోసా దొరకలేదన్న అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేసీఆర్‌తో కయ్యం పెట్టుకుని సాధించేదేమీ లేదన్న నిర్ణయానికి వచ్చినట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. సంగారెడ్డిలో ఆయనపై భూ అక్రమాలకు సంబంధించి కేసులు పెండింగ్ ఉన్నాయని, వాటిని నుంచి రక్షించుకునేందుకు కేసీఆర్, కేటీఆర్‌లపై ప్రశంసలు కురిపిస్తున్నారని గాంధీభవన్‌వర్గాలు చెబుతున్నాయి. అధికారపార్టీపై అనేక ఉద్యమాలు చేసిన ఒంటేరు ప్రతాప్‌రెడ్డి గులాబీ గూటికి చేరడంతో ఆయన దారిలోనే జగ్గారెడ్డి పయనిస్తారన్న ప్రచారం జరుగుతున్నది. తాను టీఆర్‌ఎస్‌లో చేరడానికి కేసీఆర్‌కు గ్రీన్‌సిగ్నల్ పంపించేందుకే హరీశ్‌రావు రాజకీయ బ్లాక్‌మెయిలర్ అంటూ విమర్శలు చేశారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో జగ్గారెడ్డి కారెక్కడం ఖాయమన్న చర్చ సాగుతున్నది.

12న హైకోర్టు నుంచి గవర్నర్ భవన్ వరకు న్యాయవాదుల ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ డిమాండ్ల పరిష్కారం కోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) పిలుపులో భాగంగా ఈ నెల 12న ఆందోళన చేయనున్నామని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మెన్ ఎ.నర్సింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు నుంచి రాజ్‌భవన్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని, గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. అన్ని న్యాయవాద సంఘాలు కూడా ఈ నెల 11న సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తాయని, సమావేశాల తీర్మానాల ప్రతులను ఆయా ప్రాంతాల ఎంపీలు, జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రధానమంత్రికి పంపాలని కోరతాయని ఆయన వివరించారు.

సెన్సెక్స్ ▼ 04	నిఫ్టీ ▲ 6.95	డాలరుకు రూపాయి విలువ	బంగారం (10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)
36,971	11,069	71.56	రూ. 33,130	రూ. 40,006	హైదరాబాద్ 400, ఒక్కగుడ్డుకు 4.50, వరంగల్ 399, విజయవాడ 397, చెన్నై 435, ముంబయి 450

మార్కెట్లోకి లంబార్గిని ఖరీదైన కారు

- దేశీయ మార్కెట్ ధర 3.73 కోట్లు



న్యూఢిల్లీ: ఇటలీకి చెందిన సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ లంబార్గిని గురువారం అతి ఖరీదైన కారును భారతీయ మార్కెట్లో విడుదల చేసింది. 'హరికేన్ ఎవో' పేరుతో అందుబాటులోకి తెచ్చిన ఈ కారు ప్రారంభ ధరను కంపెనీ రూ .3.73 కోట్లుగా (ఎక్స్-షోరూమ్, న్యూఢిల్లీ) నిర్ణయించింది. 5.2 లీటర్ ఇంజిన్, వీ10 పవర్, మల్టీ పాయింట్ ఇంజెక్షన్, డీఎస్ఐ డీజిల్ గరిష్ట టార్క్ 640, సెవెన్ స్పీడ్ డ్యుయల్ క్లచ్ గేర్ బాక్స్, రియర్ వీల్ డ్రైవ్ సిస్టం, రియర్ మెకానికల్ సెల్ఫ్ లాకింగ్ ఫీచర్లతోపాటు కొత్తగా అడ్వాన్స్‌డ్ న్యూ ట్రాక్షన్ కంట్రోల్ సిస్టంను ఈ కారులో లంబార్గిని జోడించింది. గత సంవత్సరం భారతదేశంలో లంబార్గిని 45 యూనిట్లు విక్రయించగా, 2017 లో 26 యూనిట్లు విక్రయించింది. ప్రపంచవ్యాప్తంగా లంబార్గిని గత సంవత్సరం 5,750 యూనిట్లు విక్రయించింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 2017 లో 1,000 యూనిట్ల నుంచి 1,301 యూనిట్లను సేల్ చేసిందని కంపెనీ భారత ప్రతినిధులు తెలిపారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహన ధరల పెంపు

న్యూఢిల్లీ : లగ్జరీ బైక్ తయారీదారు రాయల్ ఎన్‌ఫీల్డ్ కొన్ని మోడల్స్ వాహన ధరలను పెంచింది. 350 సీసీ- 500సీసీ మధ్య మోడళ్లపై రూ.1500 వరకు ధరలు పెంచినట్లు గురువారం వెల్లడించింది. బుల్లెట్ 350, 500, క్లాసిక్ 350, 500, హిమాలయన్ మోడళ్లపై ధరలను పెంచింది. కొత్త ధరల ప్రకారం బుల్లెట్ 350 ధర రూ.1.34 లక్షల నుంచి.. క్లాసిక్ ధర 350 ఎబీఎస్ ధర రూ.1.53లక్షల నుంచి ప్రారంభమవుతుంది. కాగా ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650, కాంటినెంటల్ జీటీ 650 ధరలను మాత్రం కంపెనీ యథాతథంగా ఉంచింది.

టాటా మోటార్స్‌కు భారీ నష్టాలు



న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ 2018 డిసెంబర్ త్రైమాసికంలో భారీ నష్టాలు నమోదు చేసింది. చైనా-అమెరికా మధ్య వాణిజ్య ఆందోళనల నేపథ్యంలో టాటాకు చెందిన జాగ్వర్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) అమ్మకాలపై చైనాలో తీవ్ర ప్రభావం పడింది. అదే విధంగా యూరప్‌లో అమ్మకాలు పడిపోవడం తదితర పరిణామాలు ఈ కంపెనీ ఆర్థిక ఫలితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపించాయి. ముఖ్యంగా జేఎల్ఆర్ ఆస్తుల బలహీనత తదితర అంశాల నేపథ్యంలోనే 2018-19 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో టాటా మోటార్స్ రూ.26,960.8 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.1,214.6 కోట్ల నికర లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో కంపెనీ మొత్తం రెవెన్యూ 4.36 శాతం పెరిగి రూ.77,582.71 కోట్లుగా నమోదయ్యింది. 2017-18 ఇదే మూడో త్రైమాసికంలో రూ.74.337.7 కోట్ల రెవెన్యూ చోటు చేసుకుంది.

ఎన్నికల వేళ

ఆర్బీఐ నోట.. ఆ కర్షక మాట!

- కీలక వడ్డీరేట్లలో పావు శాతం కోత
- వ్యాపార వర్గాల ప్రసన్నానికి యత్నాలు
- రైతుల హామీ అవసరంలేని రుణ పరిమితి పెంపు



సమావేశం అనంతరం ఆర్బీఐ గవర్నర్ దాస్‌తో ఎంపీసీ సభ్యులు

న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వానికి వినయ విధేయుడైన భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్.. ఊహించినట్టుగానే సర్కారుకు కలిసివచ్చేలా నిర్ణయాలు తీసుకొంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఆర్బీఐ పగ్గాలు చేపట్టాక నిర్వహించిన తొలి పూర్తిస్థాయి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష సమావేశంలో ఆయన అనూహ్యంగా కీలక వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్టుగా ప్రకటించారు. దాస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన సమీక్ష నిర్ణయాలను పెద్ద బ్యాంక్ గురువారం అధికారికంగా వెల్లడించింది. ఇందులో రెపో రేటుకు 25 బేసిస్ పాయింట్లు కోత పెడుతూ ద్రవ్యవిధాన కమిటీ (ఎంపీసీ) తీర్మానించింది. దీంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25శాతానికి దిగి వచ్చింది. అలాగే రివర్స్ రెపో (వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై ఆర్‌బీఐ చెల్లించే వడ్డీరేటు) 6.25 శాతంనుంచి 6 శాతానికి తగ్గింది. మానిటరీ పాలసీ కమిటీలో వడ్డీరేట్ల తగ్గింపుపై నలుగురు సభ్యులు సానుకూలంగా ఓటు వేయగా.. మరో ఇద్దరు వ్యతిరేకించారని దాస్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 2.8 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని ఆర్బీఐ ఎంపీసీ అంచనా వేసింది. 2019-20 ప్రథమార్థంలో 3.9 శాతంగా, మూడో త్రైమాసికంలో 3.9 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొంది. స్వల్ప కాలంలో ద్రవ్యోల్బణం నియంత్రణలోనే ఉండొచ్చని తాము అంచనా వేస్తున్నట్టుగా శక్తికాంత్ సమీక్ష అనంతరం తెలిపారు. దీంతో రెపో రేటను తగ్గించడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదన్న భావనతో ఆర్బీఐ వడ్డీరేట్ల కోత నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిపారు. సమీక్షా సమావేశంలో వడ్డీరేట్ల తగ్గింపు విషయంలో తన పంతం నెగ్గించుకొనేలా శక్తికాంత తనదైన చాకచక్యం చూపినట్టుగా తెలుస్తోంది.

ప్రయివేటు పెట్టుబడులు పెరగాలి..

ప్రయివేటు రంగ పెట్టుబడులు పెరగాలని.. దీంతో వినిమయం పెరుగుతుందని ఎంపీసీ అభిప్రాయ పడింది. మౌలిక వసతులపై ప్రజల వ్యయం పెరగడంతో పెట్టుబడులు పుంజుకుంటున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి ముగింపు నాటికి ఎన్‌బీఎఫ్‌సీల విధివిధానాలను సమన్వయనించనున్నట్లు పేర్కొంది. బ్యాంకుల నుంచి ఎన్‌బీఎఫ్‌సీలకు సులభ రుణ మద్దతు అందించేలా కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించింది. భౌగోళికంగా అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న ఆందోళనలు, అనిశ్చితి వల్ల గ్లోబల్‌గా డిమాండ్‌పై భారం పడుతుందని, చమురు ఇతర కమోడిటీల ధరలు పెరగడానికి కారణమవుతుందని పేర్కొంది.

వృద్ధి రేటుకు కోత..

2019-20లో భారత వృద్ధి రేటు 7.4 శాతంగా చోటు చేసుకోవచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో 7.2-7.4 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2019-20 ప్రథమార్థంలో 7.5 శాతం వృద్ధి రేటు ఉండొచ్చని ఇది వరకు అంచనా వేసింది. అంటే దీంతో పోల్చితే తాజా అంచనాల్లో వృద్ధి రేటుకు కోత పెట్టినట్లయ్యింది. వచ్చే అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 7.5 శాతంగా ఉండొచ్చని విశ్లేషించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2018-19లో స్థూలంగా 7.4 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది.

విరాల్ విభేదించిన వినకుండా..!

దేశీయంగా సూక్ష్మ గణాంకాల పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడం రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణ పెరుగుదలను అంచనా వేసిన డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్యతో పాటు మరో ఎంపీసీ సభ్యుడు కీలక వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయాన్ని గట్టిగానే వ్యతిరేకించినట్టుగా సమాచారం. అయినా శక్తికాంత దాస్ ప్రోద్భలంతో మిగతా నలుగురు సభ్యులు వడ్డీరేట్ల తగ్గింపునకు మొగ్గు చూపడంతో ఎంపీసీ మెజార్టీతో రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను సవరించాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. ఆర్బీఐ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఆస్తుల గుర్తింపు విధానాలను సరళతరం చేస్తూ దాస్ నిర్ణయం తీసుకున్నారు. దీనికి తోడు ఆర్థికంగా బలహీనంగా ఉన్న మూడు బ్యాంకులపై ఉన్న రుణ వితరణ ఆంక్షలను ఆయన సడలించారు. దీనికి తోడు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్ చెల్లింపు అంశాన్ని పరిశీలిస్తున్నట్టుగా ఆయన వెల్లడించారు. వీటికి తోడు తాజాగా వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయం కూడా సర్కారుకు మేలుచేసే దిశగా తీసుకున్నదేనని విశ్లేషకులు చెబుతున్నారు.

అన్నదాత ప్రసన్నానికి మరో ప్రకటన!

ముంబయి: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని మోడీ సర్కారు వీలైనంత గరిష్ట స్థాయిలో ప్రజాకర్షక నిర్ణయాలను ప్రకటించి ఓట్లు దండుకొనే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవలే కేంద్ర బడ్జెట్‌లో 'ప్రధాన మంత్రి కిసాన్ సన్మాన్ నిధి' పథకం పేరుతో పేద రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.6000 అందజేయనున్నట్లు ప్రకటించిన మోడీ సర్కారు తాజాగా భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ)నోట కూడా అలాం టి ప్రకటనే చేయించింది. హామీ అవసరం లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ. లక్ష నుంచి రూ. 1.60లక్షలకు పెంచుతున్నట్లు ఆర్బీఐ నోట చెప్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశంలో భాగంగా ఆర్బీఐ ఈ దిశగా నిర్ణయం తీసుకుందని పెద్ద బ్యాంక్ గురు వారం తెలిపింది. 'ద్రవ్యోల్బణం, పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ. 1.6 లక్షల వరకు పెంచుతున్నాం. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది' అని ఆర్బీఐ పేర్కొంది. ఈ నిర్ణయానికి సంబంధించి త్వరలోనే అన్ని బ్యాంకులకు ఆదే శాలను జారీ చేయనున్నట్టుగా ప్రకటించింది. హామీ రహిత వ్యవసాయ రుణాల పరిమితిని రూ. లక్ష వరకు పెంచు తూ 2010లో ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోడీ ప్రభుత్వం అన్నదాతలను ప్రసన్నం చేసుకొనేందుకు రుణాల పరిమితి పెంపు నిర్ణయం తీసుకోవడం రైతులకు పెద్దగా మేలు చేయదని విశ్లేషకులు చెబుతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా అన్నదాతను పట్టించుకొని మోడీ సర్కారు ఓట్ల కోసం వారిని బుట్టలో వేసుకొనేలా ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా వారు ఇప్పట్లో గట్టెక్కే పరిస్థితులు లేవని వారంటున్నారు.

దిగిరానున్న గృహ, వాహన రుణాలు

రిజర్వు బ్యాంకు రెపోరేటును తగ్గించడం ద్వారా గృహ, వాహన రుణాలపై వడ్డీరేట్లు తగ్గనున్నాయి. తగ్గించిన రేట్లను బ్యాంకులు వినియోగదారులకు బదిలీ చేస్తాయని తాము భావిస్తున్నామని నైట్ ఫ్రాంక్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ షిషిర్ బైజల్ పేర్కొన్నారు. ఇది వినియోగదారుల కొనుగోలు నిర్ణయాన్ని సులభతరం చేస్తుందన్నారు. కొంతకాలంగా డిమాండ్ లేక నీరసించిన రియల్ రంగ అభివద్ధికి దోహదం చేయనుందని పేర్కొన్నారు. అయితే ఆర్బీఐ నిర్ణయం గతంలోని ఆర్థిక క్రమశిక్షణ విధానానికి భిన్నంగా ఉందని. దీంతో దీర్ఘకాలంలో సమస్యలు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

వ్యాపార, పారిశ్రామిక వర్గాలను ఆకట్టుకొనే యత్నం..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వ సంస్కరణలు, కఠినమైన నిర్ణయాలతో బేజారెత్తి ఉన్న వ్యాపారా వర్గాలతో పాటు ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకే ఆర్బీఐ అనూహ్యంగా వడ్డీరేట్ల తగ్గింపు ప్రకటన చేసినట్టుగా మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నమో సర్కారు తన వ్యూహంలో భాగంగానే వ్యాపార వర్గాలు కోరకుంటున్నట్టుగా శక్తికాంత దాస్‌తో వడ్డీరేట్ల సవరణ ప్రకటన చేయించినట్టుగా వారు చెబుతున్నారు. సర్కారు జిమ్మిక్కులను మార్కెట్లు, వ్యాపార వర్గాలు నమ్మే స్థాయిలో లేవని వారు చెబుతున్నారు. ఇందుకు గురువారం నాటి స్టాక్ మార్కెట్ల కదలికలే ప్రత్యక్ష నిదర్శనమని వారు విశ్లేషిస్తున్నారు. వడ్డీ రేట్లు తగ్గిస్తున్నట్టుగా ఆర్బీఐ ప్రకటించినప్పటికీ స్టాక్ మార్కెట్లు పెద్దగా ర్యాలీని నమోదు చేయలేకపోయాయని వారు చెబుతున్నారు. మోడీ సర్కారు ఎన్ని తాయిలాలు ప్రకటించిన వ్యాపార వర్గాల నుంచి రానున్న ఎన్నికలో మోడీ సర్కారుకు ఓట్లు రాలవనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని వారు చెబుతున్నారు.

సమాన వేతనమివ్వాలి

- కేంద్రమంత్రి మేనకా గాంధీకి మినీ అంగన్‌వాడీల విజ్ఞప్తి



నవ తెలంగాణ - న్యూ ఢిల్లీ బ్యూరో

అంగన్వాడీ టీచర్లతో సమానంగా పని చేస్తున్నామని, వారితో సమానంగా తమకు కూడా వేతనం ఇవ్వాలని మినీ అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. గురువారం మినీ అంగన్‌వాడీ టీచర్ల బందం ఢిల్లీలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీని కలిశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మినీ అంగన్వాడీ టీచర్ల ప్రెసిడెంట్ వరలక్ష్మీ మాట్లాడుతూ తాము తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలతో సమానమైన పని చేస్తున్నామని గౌరవ వేతన విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. అంగన్వాడీలకు రూ. 10,500 జీతం ఇస్తే, తమకు మాత్రం ఆయాలతో సమానంగా 6 వేల జీతం ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పనిలో మాత్రం అంగన్వాడీలతో సమానంగా తాము విధులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4 వేల మంది మినీ అంగన్వాడీలు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. సెలవుల విషయంలో సైతం తమకు అన్యాయం జరుగుతోందని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లతో పాటూ మినీ అంగన్ వాడీలకు 15 రోజులు సెలవులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి విజప్తి చేశామని తెలిపారు. మినీ అంగన్ వాడీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మేనకా గాంధీ హామి ఇచ్చారని చెప్పారు. కేంద్ర ఆర్థిక శాఖకు మినీ అంగన్ వాడీ వేతనాలు పెంచాలని ప్రతిపాదనలు పంపిస్తామని మేనకా గాంధీ హామీ ఇచ్చారని వెల్లడించారు.

ఎగ్జిబిషన్‌ను మూసేయండి

- హైకోర్టులో పిల్ దాఖలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్నిమాపక శాఖ నుంచి తగిన అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మూసేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. జనవరి 31న ఎగ్జిబిషన్ నిర్వహణ సమయంలోనే భారీ అగ్నిప్రమాదం జరిగిందని, రోజూ 50 వేల మంది సందర్శిస్తారని అదష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదని, ఈ కేసును సీఐడీ లేదా ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్)కు అప్పగించేలా ఆదేశాలివ్వాలని పిల్‌లో హైకోర్టును కోరారు. హైదరాబాద్‌కు చెందిన ఖాజాఉద్దీన్ దాఖలు చేసిన ఈ పిల్‌లో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెూం శాఖ ముఖ్య కార్యదర్శి, అగ్నిమాపక శాఖ డీజీ, జిల్లా అగ్నిమాపక అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్, బేగంపేట పోలీస్ స్టేషన్ అధికారి, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శులను చేశారు. చట్ట ప్రకారం ఎగ్జిబిషన్ నిర్వహణకు అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర పత్రాన్ని పొందాలన్న నిబంధనను ఎగ్జిబిషన్ సొసైటీ ఉల్లంఘించిందని, భారీ అగ్నిప్రమాదం తర్వాత రెండు రోజులు ఆగి తిరిగి ప్రారంభించినప్పుడు కూడా నిరభ్యంతర పత్రాన్ని పొందలేదన్నారు. నిర్వహకుల తప్పిందం కారణంగానే ప్రమాదం జరిగిందని, అయితే ప్రమాదవశాత్తు జరిగినట్లుగా పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఎగ్జిబిషన్‌ను మూసేసి దాని నిర్వహకుల్ని ప్రాసిక్యూట్ చేసేందుకు ఆదేశాలివ్వాలని పిల్‌లో కోరారు. ఈ పిల్‌ను చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది.

జంతువుల దాహం తీరేనా..?

వేసవి దృష్ట్యా వన్యప్రాణుల కోసం ప్రత్యేక చర్యలు

గ్రిడ్ల వారీగా విభజించి నీటి వనరుల కల్పన

- గడ్డిపెంచేందుకు..కుంటలు నిపేందుకు సోలార్ బోర్లు
- ఈ ఏడాది 100 సోలార్ బోర్లకు ప్రతిపాదన
- సిమెంట్ రింగులు, సాసర్లను ట్యాంకర్ల ద్వారా నింపే యత్నం

ముందుంది ఎండాకాలం. జనారణ్యంలో ఉండే మనమే అరగంటో..గంటో..నీళ్లు తాగేందుకు నీళ్లు దొరక్కపోతే అల్లాడుతాం. ఇక అభయారణ్యంలోని వన్యప్రాణుల వెతలు వర్ణానీతం. తినేందుకు గడ్డి లభించక.. తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరక్క వన్యప్రాణులు జనవాసాల్లోకి వచ్చి వందల సంఖ్యలో మృత్యువాతపడుతున్నాయి. మనుషుల ప్రాణాలనూ తీస్తున్నాయి. ఈసారి అలాకాకుండా అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా గడ్డిని పెంచేందుకు... వన్యప్రాణులకు నీటిని అందించేందుకు అటవీశాఖ ఈసారి ప్రత్యేక చర్యలకు పూనుకుంటున్నది. అధికారులు తీసుకుంటున్న యత్నాలు వన్యప్రాణులను ఎంతమేరకు కాపాడుతాయో చూడాలి.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వర్షాభావ పరిస్థితులతో, క్రమంగా ముదురుతున్న ఎండలతో అడవుల్లోని నీటి గుంటలు, వాగులు, ఒర్రెలు వేసవికి ముందే ఎండిపోతున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పరిస్థితి తీవ్ర రూపం దాల్చనున్నది. దీంతో నీళ్ల, ఆహారం వెతుకుతూ పులులు, ఇతర జంతువులు జనావాసాల్లోకి వచ్చే ప్రమాదముంది. అటవీశాఖ లెక్కల ప్రకారం, గడచిన నాలుగేండ్లలో అడవి జంతువుల దాడిలో 22 మంది మరణించగా, 133 మంది గాయపడ్డారు. వందలాది వన్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చుల్లో చిక్కుకుని చనిపోయాయి. రాష్ట్రంలో ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్రంలోని 22,437 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అభయారణ్యాల్లో తొమ్మిది చదరపు కిలోమీటర్లకు ఒక గ్రిడ్, శాంక్చుయరీ ఏరియాల్లో నాలుగు చదరపు కిలోమీటర్లకు ఒక గ్రిడ్‌గా విభజించింది. సహజసిద్ధంగా నీటి వనరులు లభించే గ్రిడ్లను మినహాయించి మిగతా వాటిపై దృష్టి సారించింది. సాధారణంగా ఒక వన్యప్రాణి నీటి కోసం నాలుగైదు కిలోమీటర్లు వెళ్లగలదని, దానిని పరిగణలోకి తీసుకునే నీటి వసతిని కల్పిస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌కు మూడు నుంచి నాలుగు గ్రిడ్ల బాధ్యతను అప్పగిస్తారు. ఆయా గ్రిడ్లలో నీటి వనరులు ఎలా ఉన్నాయో? ఏమేమి చేయాలి? అని బీట్ ఆఫీసర్లే చూసుకోవాలి.

సోలార్ పవర్‌తో నీటి పంపింగ్

నీటి వసతుల్లేని గ్రిడ్లలో ఈసారి 100 బోర్లను వేయించాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ బోర్ల వద్ద ఆటోమాటిక్‌గా ఆన్, ఆఫ్ అయ్యే సోలార్ పంపు



సెట్లు ఏర్పాటు చేసి, జంతువులకు నీరందిస్తారు. ఒక్కో బోరు, సోలార్ పంపుసెట్ ఏర్పాటుకు రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని అటవీశాఖ సీనియర్ అధికారి వివరించారు. బోర్‌కు కొద్ది దూరంలో నీరు నిలిచేలా ఒక గుంత తవ్వించి, బోర్ నుంచి ఆ గుంతలోకి నీరు చేరేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ సోలార్ పంపులు ప్రతి రోజు ఉదయం ఆన్ అవుతుంది. సూర్యాస్తమయం కాగానే ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. ఆ బోర్లు ఏడాదంతా పనిచేస్తాయి. సహజంగానే ఆ ప్రాంతంలో గడ్డి పెరిగి కుందేళ్లు, జింకల వంటి వన్యప్రాణులకు ఆహారం లభిస్తుంది. ఈ ఏడాది మార్చి చివరినాటికి 30 బోర్లను తవ్వించి, పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు అటవీశాఖ సన్నాహాలు చేస్తోంది. సోలార్‌ద్వారా అటవీ ప్రాంతంలో నడిచే బోర్లు ఇప్పటికే 130 వరకు ఉన్నాయి.



ఆమ్రాబాద్ వంటి గుట్ట ప్రాంతాల్లో నాలుగైదు వందల ఫీట్ల వరకూ తవ్వినా నీరు లభించడంలేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. బోర్‌వెల్స్ వెళ్లలేని, ఎంత లోతు బోర్ వేసినా నీళ్ల పడని ప్రాంతాల్లో ప్రత్యేకంగా సాసర్లు, రింగులు, ప్లాస్టిక్ తొట్టీలు ఏర్పాటు చేయనున్నారు. పలుప్రాంతాల్లో 700-800 లీటర్ల నీళ్ల పట్టే రింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో రింగ్ ఏర్పాటుకు రూ.3 వేలు వెచ్చిస్తున్నారు. సాసర్లను, రింగ్‌లను, తొట్టీలను ట్యాంకర్ల ద్వారా నీళ్లు తీసుకెళ్లి జూన్‌లో ఒకటి, రెండు వర్షాలు పడేదాకా నింపనున్నారు. వీటితోపాటు ఆ గ్రిడ్లలో కుంటలు, నీటి ప్రవాహాలను గుర్తించి వేసవిలోనూ నీరు నిలువ ఉండేలా చెక్ డ్యాంలు నిర్మించే యోచనలో ఉన్నారు. వేసవిలో కుందేళ్లు, జింకలు తదితర జంతువులకు గడ్డి లభించక, ఊర్లలోకి వచ్చి జనాల చేతికి, వేటగాళ్ల ఉచ్చులకు చిక్కుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో గడ్డి పెంపకాన్ని చేపట్టాలని కూడా అటవీ అధికారులు నిర్ణయించారు. ఈ వేసవి నుంచే దీన్ని అమల్లోకి తీసుకురానున్నారు. దీనికి తోడు జంతువులు బయటకు రాకుండా అడవి చుట్టూ ముళ్లజాతి చెట్లతో సహజసిద్ధ కంచెను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది వానాకాలంలో చేపట్టనున్న హరితహారంలో భాగంగా వాటిని నాటనున్నారు. ఈ మొక్కలు పెరిగి కంచెగా మారితే, అడవి జంతువుల నుంచి మనుషులను, వేటగాళ్లను నుంచి జంతువులను, కలప స్మగర్ల నుంచి అడవిని కాపాడొచ్చని అధికారులు భావిస్తున్నారు.

అటవీ సంరక్షణపై నివేదిక అందజేయండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల రక్షణ కోసం హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సులభంగా పులుల్ని వేటాడేందుకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం విస్తరించిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఎవరికి పడితే వారికి విద్యుత్ లైన్ల సరఫరా ఇవ్వకుండా చట్ట ప్రకారం అర్హత అనుమతి ఉన్న వారికి మాత్రమే ఇవ్వాలని తేల్చి చెప్పింది. కేంద్ర అటవీ శాఖ, జాతీయ పులుల సంరక్షణ సంస్థ అభిప్రాయాలను కూడా రెండు వారాల్లో తమకు తెలపాలని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ టీబీఎన్ రాధాకష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశించింది. రాష్ట్ర హెూంశాఖ ముఖ్య కార్యదర్శి, అదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ, ఎక్సైజ్ కమిషనర్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, ఎండీలను హైకోర్టు ప్రతివాదులుగా చేసింది. పూర్వపు అదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైదరాబాద్‌కు చెందిన జాగిర్‌దియాసుర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పోలీసు, అటవీ, ఎక్సైజ్, విద్యుత్ శాఖాధికారులు ఉమ్మడి పరిశీలన చేసి వాస్తవ స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అటవీ, జంతు సంరక్షణ, పోలీసు, ఎక్సైజ్, నార్కోటిక్ డ్రగ్స్ మొదలైన చట్టాలు అమలు తీరు ఎలా ఉందో కూడా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కూబింగ్ నిర్వహించాలని, పులులు ఇతర వన్య ప్రాణులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

- కవ్వాల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా వద్దు

కవ్వాల్, ఆమ్రబాద్ పులుల సంరక్షణ కేంద్రాల్లో స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ బలగాలను కేంద్రం ఇస్తున్నందున రాష్ట్రం కూడా అటవీ అధికారులకు ఆయుధాలు సమకూర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని ఆదేశించింది. హైకోర్టు గత విచారణ సమయంలో కోరిన మేరకు కోర్టుకు సహకరించేందుకు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా, కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం ఫీల్డ్ డైరెక్టర్ సి.శరవణన్ విచారణకు హాజరయ్యారు. విద్యుత్ తీగలు తగిలి పులులు మత్యు వాతపడుతున్నాయని, తీగ తగిలినా విద్యుత్ సరఫరా కాకుండా ఇన్సులేషన్ ఇస్తే బాగుంటుందని అధికారులు సూచన చేశారు. అడవుల్లో జంతువులను వేటాడకుండా అడ్డుకునేందుకు డ్రోన్లను వినియోగించాలని పిటిషనర్ తరపు సీనియర్ లాయర్ నిరంజన్‌రెడ్డి సూచన చేశారు. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.



ఏమరపాటు వద్దు..

అనేక రకాల అనారోగ్య సమస్యలకు కారణం రక్తహీనత. శరీరంలోని ప్రతికణానికి రక్తం అవసరం. రక్తం తక్కువగా ఉండడాన్ని వైద్య భాషలో రక్తహీనత, ఎనీమియా అంటారు. సరైన ఆహారం తీసుకోకపోవడం, రక్తం ఉత్పత్తిలో లోపాలు వంటివి రక్తహీనతకు కారణం కావచ్చు. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత కారణంగా అనేక సమస్యలు వస్తుంటాయి. ఏమరుపాటుగా ఉంటే అనేక జబ్బులకు కారణం అవుతుంది.

మన శరీరంలోని రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హీమోగ్లోబిన్ అనే పదార్థం. ఇది తయారవడానికి మాంసక త్తులతో పాటు ఇనుము అనే పోషక పదార్థం ముఖ్యంగా అవసరం. మన శరీరంలో హీమోగ్లోబిన్ పరిమాణం ప్రతి 100 గ్రాముల రక్తంలో మగవారిలో 13 గ్రాములు, ఆడవారిలో 12 గ్రాములు, 6 సంవత్సరంలోపు పిల్లల్లో 11 గ్రాములు, గర్భిణీ స్త్రీలలో 11 గ్రాములు, బాలింతలలో 12 గ్రాములు, 6 నుండి 12 సం.ల లోపు పిల్లలలో 12 గ్రాములు ఉండాలి. ఒకవేళ హీమోగ్లోబిన్ మోతాదు ఈ విలువల కన్నా తగ్గితే రక్త హీనతతో వారు బాధపడుతున్నారని గుర్తించాలి.

రక్తహీనతకు (ఎనీమియా) గురైన వ్యక్తి శరీరంలో ఎర్ర రక్త కణాలు (రెడ్‌బ్లడ్‌సెల్స్- ఆర్ బిసి- లేదా ఎరిత్రోసైట్స్) సంఖ్య తగ్గిపోతుంది. రక్త పరీక్షలో ఆర్‌బిసి కౌంట్ ద్వారా రోగి రక్తంలో ఎన్ని ఎర్రరక్తకణాలున్నాయనే విషయాన్ని తెలుసుకోవచ్చు. రక్తంలో ఎర్ర రక్త కణాల సంఖ్య 38 శాతం నుంచి 48 శాతం వరకూ ఉంటుంది. ఆర్‌బిసి లో ఆక్సిజన్‌ను తీసుకునివెళ్లే హీమో గ్లోబిన్ ఉంటుంది.

ఆరోగ్యవంతుల్లో హీమోగ్లోబిన్ ఒక డెసి లీటర్‌కు 12 గ్రాములుంచి 16 గ్రాముల మధ్య ఉంటుంది. ఆర్‌బిసి కౌంట్ ఒక మైక్రోలీటర్‌కు 4.4నుంచి 5.8 మిలియన్ల వరకూ ఉంటుంది. ఆర్‌బిసిలోని హీమోగ్లోబిన్ ఆక్సిజన్‌ను శరీరంలోని అన్ని భాగాలకు తీసుకువెళుతుంది. ఆక్సిజన్ రవాణా వ్యవస్థగా ఎర్ర కణాలు ఉపకరిస్తాయి. ఆక్సిజన్ శరీరానికి ఇంధనంగా ఉపయోగపడుతుంది.

రక్తహీనతకు గురైన వ్యక్తిలో అవసరమైన స్థాయిలో ఎర్ర రక్త కణాలు ఉండవు. ఫలితంగా శరీరానికి అవసరమైన ఆక్సిజన్ అందదు.

శరీరంలో ఉండే ఎరిత్రోప్రోటీన్ అనే హార్మోన్ బోన్ మారోను ఉత్తేజపరిచి, ఎర్ర రక్తకణాల సంఖ్యను నియంత్రించేలా చేస్తుంది. శరీరంలో ఉండే దాదాపు మొత్తం ఎరిత్రోప్రోటీన్‌ను మూత్రపిండాలు ఉత్పత్తి చేస్తాయి. అక్కడినుంచి ఎరిత్రోప్రోటీన్ బోన్‌మారోకు చేరుతుంది. ఇక్కడే ఎర్ర రక్తకణాలు తయారవుతాయి. ఒక వ్యక్తి మూత్రపిండాల వ్యాధికి గురైన ప్పుడు మూత్రపిండాలు అవసరమైన స్థాయిలో ఎరిత్రోప్రోటీన్‌ను ఉత్పత్తి చేయలేవు. ఎరిత్రోప్రోటీన్ లేకుండా, బోన్‌మారో తగి నంత సంఖ్యలో ఎర్ర రక్తకణాలను తయారు చేయలేవు. ఫలితంగా శరీరావసరాలకు సరిపోయేంత ఆక్సిజన్ అందదు.

మహిళల్లో, పిల్లల్లో కనపడే ముఖ్యమైన బలహీనత, రక్తం తక్కువగా ఉండడం. రక్తహీనత ముఖ్యంగా మూడు కారణాల వలన వస్తుంది.

పౌష్టికాహార లోపం


శరీర పోషణకు కావల్సిన ఆహారం తీసుకోకపోవడంతో రక్తహీనత వస్తుంది. ముఖ్యంగా ఐరన్ కలిగిన ఆకుకూరలు (తోటకూర, గోంగూర) బెల్లం, మాంసాహారం ఎక్కువగా తీసుకునేవారిలో రక్తహీనత సమస్య రాదు.

రక్తం నష్టపోవడం

మహిళలు రుతుస్రావం ద్వారా ప్రతినెల అధికంగా రక్తన్ని కోల్పోయినా.. పిల్లలు కడుపులో నట్టల వల్ల, మలంలో రక్తం పడటం వల్ల రక్తహీనతకు లోనవుతారు.

రక్తం ఉత్పత్తి తగినంత లేకపోవడం..

కొన్నిరకాల జబ్బుల వలన ముఖ్యంగా మలేరియా వలన రక్తంలోని



ఎర్ర కణాలు ధ్వంసం అవుతాయి. తిరిగి అవి పెరగకపోవడం, రక్త కణాల ఉత్పత్తి తగినంత లేకపోవడం వలన రక్తహీనత వస్తుంది.

రక్తహీనత లక్షణాలు

- నాలుక, కనురెప్పలలోపలి భాగాలు పాలిపోవడం
- అలసట, చికాకు,
- ఆకలి లేకపోవడం, కళ్ళు తిరగడం
- అరచేతుల్లో చెమట, చేతుల గోళ్ళు వంగి గుంటలు పడడం
- పాదాలలో నీరు చేరడం
- చిన్న పిల్లల్లో అయితే చదువులో అశ్రద్ధ, ఆటల్లో అనాసక్తి, నీరసం.

ఎవరిలో ఎక్కువగా ...

గర్భిణీలు, బాలింతలు, 15-45 సం.వయస్సు గల స్త్రీలు, 11 సం.ల లోపు పిల్లలలో రక్తహీనత ఎక్కువగా ఉంటుంది. మగవారిలో కూడా రక్తహీనత చోటుచేసుకుంటుంది.

కలిగే దుష్పరిణామాలు

బలహీనత, గర్భస్రావం, తక్కువ బరువుతో బిడ్డ పుట్టడం, పుట్టిన బిడ్డ లేదా తల్లి చనిపోవడం, పనిచేసే సామర్థ్యం తగ్గుదల, రోగాలు తేలికగా వెంటవెంటనే రావడం, చదువులో వెనుకపడడం, ఎక్కువసేపు పనిచేయలేకపోవడం, ఆటలు ఆడలేకపోవడం మొదలైనవి.

చికిత్సా విధానం

ఇది ప్రత్యేకించి జబ్బు కాదు. సరైన ఆహారం తీసుకుంటే చాలావరకు సమస్య కలుతుంది.

- చిన్న పిల్లలకు కడుపులో నట్టలు పోయే మందు ఇవ్వాలి. మల విసర్జన తరువాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కునేలా అలవాటు చేయాలి.
- ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పొట్టుతోటి ధాన్యాలు, మాంసాహారం తీసుకోవాలి.
- టీనెజ్ అమ్మాయిల నుంచి బిడ్డకు జన్మనించే మహిళల వరకు అందరికీ ఎ.ఎన్.ఎం. సహాయంతో ఉచితంగా లభ్యం అయ్యే ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలి.

నివారణ..

రక్తహీనతను నివారించడానికి భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఒక ప్రజారోగ్య కార్యక్రమాన్ని చేపట్టింది. రక్తహీనతకు తేలికగా గురికాగల గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ఉపకేంద్రం ద్వారా ఇనుమున్న ఎర్రగోలీలు (ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు) ఉచితంగా ఇవ్వబడుతున్నాయి. ఈ గోలీలను గర్భిణీలయితే 6వ నెల మొదటి నుండి 100 రోజుల పాటు, బాలింతలు చనుబాలు ఇస్తున్నంత కాలం లేదా 100 రోజుల పాటు, 11 సం. వయసులోపున్న రక్తహీనతగల పిల్లలు సంవత్సరంలో కనీసం 100 రోజులపాటు క్రమం తప్పకుండా రోజుకొక్కగోలీ చొప్పున తీసుకోవడం వల్ల వారి శరీరానికి పూర్తి రక్తపుష్టి చేకూరుతుంది.

ఈ మాత్రలు తీసుకొనేవారి మలం నల్లబడడం, వికారం కల్గడం సహజం. కాబట్టి భయపడవలసిన అవసరం లేదు.

ఆకుకూరలు రక్తహీనత నివారణకు సులభమైన ఉపాయం.ఇనుము ఎక్కువగా వుండి, సులభంగా లభించి, చవకగా అందరికీ అందుబాటులో ఉండే అన్ని రకాల తాజా ఆకుకూరలు అంటే తోటకూర, పుంటికూర, పాలకూర, మెంతి కూర, బచ్చలి కూర, గంగబాయిల కూర రోజూ తీసుకోవడం వల్ల రక్తహీనత రాకుండా చూసుకోవచ్చు. ఇవేగాక ఖరీదైన ఎండినపండ్లు, అంటే బాదం, జీడిపప్పు, ఎండు ఖర్జూర్, మాంసం, కాలేయం వంటి పదార్థాల్లో కూడా ఇనుము పుష్కలంగా లభిస్తుంది. వీటితోపాటు, రోజూ తీసుకొనే ఆహారంలో మొలకెత్తిన పప్పుధాన్యాలు విటమిన్ సి ఎక్కువగా వుండి నిమ్మ, ఉసిరి, జామ లాంటివి కలిపి తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా చూసుకోవచ్చు.

విటమిన్ బి12 తప్పనిసరి..!

తాజా కూరగాయలలో పాలకూర, క్యారట్, ముల్లంగి, బీట్‌రూట్, టమోటాలలోనూ.... ఇక పండ్ల విషయానికొస్తే... అరటిపండు, యాపిల్, ద్రాక్ష, ఆప్రికాట్‌లలోనూ ఐరన్ అధికంగా లభిస్తుంది. అరటిలో ఉండే ఫోలిక్ ఆసిడ్, బి12 విటమిన్‌లు రక్తహీనత నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుంది...

రక్తహీనతను అశ్రద్ధ చేయకండి. అది నీరసానికి బలహీనతకు మాత్రమే దారితీయదు. ప్రాణాహానిని కూడా కల్గించవచ్చు.

డాక్టర్ స్వామి అల్వాల్,
ఎం.బి.బిఎస్(ఉస్మానియా),
ఎండీ(నేచరోపతి)
సీనియర్ మెడికల్ ఆఫీసర్, సీజీహెచ్ఎస్(రిటైర్డ్)
మల్లునరసింహా రెడ్డి స్మారక ప్రజా వైద్యశాల
ఎం.హెచ్.భవన్, అజామాబాద్,
హైదరాబాద్





ఒత్తిడి తగ్గించే..!

ఛాతీలో మంట, అలర్జీలు, ఆందోళన, కుటుంబ నియంత్రణ, నొప్పి నివారణకు వాడే మందులతో తలెత్తే దుష్ప్రభావాల్లో డిప్రెషన్ ఒకటి. సుమారు 37శాతం మంది ఒత్తిడి తగ్గడానిక్లి ఏదో ఒక మందును వేసుకుంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. మందుల రకాలు ఎక్కువవుతున్నకొద్దీ కుంగుబాటు ముప్పూ పెరుగుతుంది. అలా కాకుండా మనం తీసుకునే ఆహారంతో ఒత్తిడిని తగ్గించుకోవడం మన చేతుల్లోనే ఉంది. మనం నిత్యం తీసుకునే ఆహార పదార్థాల ద్వారా అధిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఆహారపు అలవాట్లను కూడా ఒక దశకు వచ్చే సరికి నియంత్రణ చేయాలి.ఎక్కువశాతం ఒత్తిడికి గురయ్యే వారిలో పురుషుల కన్నా మహిళలే ముందు వరుసలో ఉంటున్నారని ఇటీవల జరిపిన పరిశోధనల్లో తేలింది. ఒక్కోసారి చిన్న చిన్న విషయాలకే వైద్యుల వద్దకు వెళ్లి సైడ్‌ఎఫెక్ట్‌లు కలిగించే మందులను ఊరికే వాడకుండా సహజసిద్ధంగా ఒత్తిడిని తగ్గించే కొన్ని ఆహారపదార్థాలు తీసుకోవడం ద్వారా డిప్రెషన్ నుంచి బయటపడవచ్చు.

అరటిపండు : దీనిలో ఉండే అధిక క్యాలరీలు, మెగ్నీషియం టెన్షన్‌ను సులభంగా తగ్గిస్తాయి. జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడంలో అరటిపండు ఎంతో మేలు .

బంగాళ దుంప : జింక్, విటమిన్ సి పెరిగి రోగని రోధకశక్తి ఇనుమడించి మనస్సును ద ఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది.

బొప్పాయి: దీనిలో ఉండే కెరోటిన్ విషతుల్యాల్ని తొలగిస్తుంది. దీనివల్ల శరీరం, మనస్సు తేలికపడి ఒత్తిడి ఇట్టే ఒత్తిడి తగ్గిపోతుంది.

ఆరెంజ్ : అత్యధికంగా కమలాల్లో లభించే సి విట మిన్ వల్ల ఒత్తిడి ఫలితంగా ప్రభావం చూపే హార్మోన్ల స్థాయిని తగ్గించి మేలు చేకూరుస్తుంది.

చాక్లెట్ : వీటిలో సహజంగా ఉండే ఫెనిలెథిలమైన్ (పిఇఎ) ఎండార్ఫిన్ స్థాయిల్ని తొలగించి సహజసి ద్ధమైన యాంటీడిప్రెటస్సెంట్‌గా పనిచేస్తుంది.

యాప్రికోట్: ఇందులోని కెరోటిన్ ఒత్తిడిని తగ్గిస్తుంది.,

పెరుగు: విటమిన్ బి నెర్వస్‌నెస్‌ను తగ్గిస్తుంది.

గోధుమ: ఇందులో అధికంగా ఉండే ఐరన్ మెదడుకు ఆక్సిజన్‌ను ఇచ్చి ఒత్తిడిని, టెన్షన్‌ను నివారిస్తుంది.

చేపలు: స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. వీటిలో అధికంగా లభించే ఒమెగా3 ఫ్యాటీయాసిడ్లు మానసికాందోళనను తగ్గిస్తాయి.

పాలు: ఇందులోని ల్యాక్టోస్ మంచి నిద్రనిచ్చి మెదడును తాజాగా, చురుకుగా ఉంచేందుకు సహకరిస్తాయి.

ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఇందుకోసం ప్రత్యేకంగా మందులు వాడితే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి.



నాలుకపై పూత

చాలా మందిలో తరచుగా నాలుకు పగిలింది.. ఏమీ తినలేకపోతున్నాం అన్న పదం వినిపిస్తుంది. ఇందుకు కారణం నాలుక పూత. ఇది చాలా మాములు సమస్యే..నాలుక మధ్యలో కొంతభాగం ఎర్రగా అవటం (మీడియన్ రాంబాయిడ్ గ్లాసైటిస్).. అక్కడక్కడా తెల్లగా, ఎర్రగా అవుతుంది. దీనిని చాలామంది నాలుక పూతగా భావిస్తుంటారు. మంట వంటి ఇబ్బందులేవీ ఉండవు. అయితే అన్నం తింటున్నప్పుడు, కారం తగిలినప్పుడు మంట పుట్టటం వంటి లక్షణాలు కనబడితే చాలావరకు బి విటమిన్ల లోపం కారణం కావొచ్చు. రైబోఫ్లావిన్, నియాసినమైడ్ తగ్గితే నాలుక బాగా ఎర్రగా పూసినట్టుగా కనిపిస్తుంది. ఫోలిక్ యాసిడ్, బి12 తగ్గితే నాలుక నున్నగా కనబడుతుంది. మన నాలుక మీద రుచిమొగ్గలు ఉంటాయి. ఇవి తగ్గిపోతే నాలుక నున్నగా అవుతుంది (గ్లాసైటిస్). నాలుక ఎర్రగా పూసినట్టు కనబడుతుంది. బి విటమిన్ల లోపం మాత్రమే కాదు.. ఐరన్ లోపంతో తలెత్తే రక్తహీనత కూడా దీనికి దారితీయొచ్చు. దీర్ఘకాలం యాంటీబయోటిక్ మందులు వాడినపుడు పేగుల్లో మంచి బ్యాక్టీరియా చనిపోవటం మూలంగానూ నాలుక పూత రావొచ్చు. అలాగే విడవకుండా వేధించే విరేచనాలు, దీర్ఘకాల పోషణలోపం కూడా దీనికి కారణం కావొచ్చు. బాగా మంట పుట్టే కారం, మిరియాలు, అల్లం, మసాలాల వంటివి ఎక్కువగా తినేవారిలోనూ నాలుక నున్నగా అయ్యి ఎర్రగా కనబడొచ్చు. ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులు వాడినప్పుడూ రావొచ్చు. అరుదుగా కొన్నిరకాల చర్మ సమస్యల్లోనూ నాలుక మీద గుల్లలు పడి నున్నగా అవ్వచ్చు. కొందరికి నాలుక చివర్లోనూ నంజుపొక్కులు తలెత్తి ఎర్రగా కనబడొచ్చు. సమస్య చిన్నదే అయినా కచ్చితమైన కారణాన్ని గుర్తించి చికిత్స తీసుకోవటం ముఖ్యం. బి విటమిన్లతోనే చాలావరకు నయమయ్యే అవకాశముంది. కారం, మసాలాలు తగ్గించటం.. తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవటం మంచిది. రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గినట్టు తేలితే ఐరన్ మాత్రలు తీసుకోవాల్సి ఉంటుంది. తరచుగా పూత వస్తుంటే డాక్టర్‌ను సంప్రదించాలి.

శరీరం గాడి తప్పితే...



పిండి పదార్థాలు, మాంకృత్తులు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, లవణాలు, న్యాచురల్ ఎంజైమ్‌లు, పీచుపదార్థాలు. ఈ ఏడు రకాల ముడి సరుకులు శరీరపోషణకు కనీస అవసరాలు. ఆకలి అవసరాన్ని తీర్చడం అంటే, ఈ ఏడు పోషక విలువలను అందించడమే! సన్నటి వారితో పోలిస్తే, లావు ఉన్న వారిలో ఎక్కువ పోషకాలు ఖర్చు అవుతాయి. ఆ మేరకు మళ్లీ ఆ పోషకాలను అందించాల్సిందే. కాబట్టి బరువు తగ్గాలనుకునేవారికి ఏ పోషకాలను ఎక్కువగా తినాలి? ఏ పోషకాలను తగ్గించాలి అనే విషయంలో ఒక స్పష్టమైన అవగాహన ఉండాలి.

- విటమిన్లు, లవణాలు, న్యాచురల్ ఎంజైమ్‌లు మిగతా వాటికన్నా ముఖ్యమైనవి. ఎంత ఎక్కువ బరువు ఉన్నా, ఆహారంలో వీటిలోపం ఉంటే చాలా ఇబ్బందులు వస్తాయి. నిజానికి, ఇవేవీ శరీరం బరువును పెంచేవి కావు. కానీ, శరీరాన్ని పోషించడంలో మాత్రం కీలక పాత్రను పోషిస్తూ ఉంటాయి. శరీర కణాలు రోగాల బారిన పడకుండా కాపాడుతుంటాయి. రోగనిరోధకశక్తిని పెంచడంతో పాటు త్వరగా కోలుకునేలా చేస్తాయి.
- శరీర నిర్మాణంలో అతి ముఖ్యమైన పాత్ర పోషించేవి మాంసకృత్తులు. రోజుకు ఒక కేజీ శరీర బరువుకు ఒక గ్రాము ప్రోటీన్లు అవసరం. అంటే 60 కేజీలున్న మనిషికి రోజుకు 60 గ్రాములు కావాలి. అదే ఎదిగే వయసు పిల్లలకైతే రెట్టింపు అవసరం. మన శరీరంలో ప్రతి రోజూ కోటానుకోట్ల కణాలు చనిపోయిన కణాల స్థానంలో కొత్త కణాలను నిర్మించుకునేందుకు శరీరానికి మాంసకృత్తులు కావాలి. కొన్ని కణాలు జబ్బున పడుతుంటాయి. వాటిని రిపేరు చేయడానికి కూడా మాంసకృత్తులు అవసరం. హానికారకమైన బ్యాక్టీరియా, వైరస్‌లు మన శరీరంలోకి ప్రవేశించినప్పుడు వాటి నుండి మనల్ని కాపాడే యాంటీబాడీస్ తయారీకి కూడా మాంసకృత్తులే ఆధారం. అందువల్ల బరువు తగ్గాలనుకునేవాళ్లు మాంసకృత్తులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలనే ఎక్కువగా తీసుకోవాలి. అయితే జంతు సంబంధమైన మాంసకృత్తులకు వెళ్లకుండా, వృక్ష సంబంధమైన మాంసకృత్తులు తీసుకోవడం శ్రేయస్కరం.
- బరువు తగ్గించుకోవాలని తిండిని తగ్గించేవారు కొవ్వు పదార్థాలను పూర్తిగా తగ్గించివేస్తారు. ఇది ఆరోగ్యానికి నష్టదాయకమే. వాస్తవానికి కణాల పొరల నిర్మాణానికీ, కణాల పనితీరుకూ, విటమిన్లలా శరీరాన్ని నడిపించానికి, కావలసిన శక్తినివ్వడానికి రోజుకు 20 నుంచి 25 గ్రాముల కొవ్వు పదార్థాలు అవసరం. కాకపోతే అంతకు మించి కొవ్వు పదార్థాలు తింటే నష్టదాయకమే! ఏమైనా, బరువు తగ్గాల్సిన వారు తీసుకునే ఆహారం తక్కువ శక్తిని, ఎక్కువ పోషకాలను అందించేదిగా ఉండాలి. అంతేతప్ప బరువు తగ్గాలని పొట్టను మాడ్చవలసిన అవసరం లేదు.

మీకు తెలుసా..?

మీకేమైనా అనారోగ్య సమస్యలున్నాయా.. పరిష్కారం దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడమే.

మా చిరునామా

'రక్ష' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్టీసీ కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020 raksha.nava2015@gmail.com



పీచుపదార్థం తప్పనిసరి...

ఫైబర్ ఫుడ్... ఇది అత్యంత ఆకర్షణీయమైన ఆహారమేమీ కాదు కానీ మనం ఎంత ఫైబర్ తినాలి అనే అంశంపై చేసిన పరిశోధనల్లో దీనివల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని గుర్తించారు. మలబద్ధకాన్ని ఫైబర్ తగ్గిస్తుందనేది అందరికీ తెలిసిన విషయమే.. కానీ పీచుపదార్థం వల్ల అంతకన్నా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

- పండ్లు, కూరగాయలు, తృణధాన్యాల రొట్టెలు, పాస్తాల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. బీన్స్, పప్పులు, శనగలు, గింజలు వంటి వాటిల్లో కూడా ఫైబర్ అధిక మోతాదులో ఉంటుంది. ఓట్స్‌లో కూడా ఫైబర్ అధికంగా ఉంటుంది. అందుకే వీటిని ఉదయం పూట అల్పాహారం తీసుకుంటే మంచిది.
- తృణధాన్యాల్లో కూడా ఫైబర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. శనగలు, బీన్స్, తృణ ధాన్యాలను కూరల్లో కలిపి వండుకుంటే కూడా శరీరానికి ఫైబర్ బాగా అందుతుంది.
- మధ్యమధ్యలో స్నాక్స్‌గా గింజలు, తాజా పండ్లు తినడం వల్ల కూడా శరీరానికి పీచు పదార్థం అందుతుంది. రోజుకు కనీసం ఐదో వంతు పండ్లు, కూరగాయలు తినడం మంచిది.
- టైప్-2 డయాబెటిస్ స్థాయి తక్కువగా ఉండటం, పెద్ద పేగు క్యాన్సర్ అవకాశాలు తగ్గిపోవడంతో పాటు.. బరువు, రక్తపోటు, కొవ్వు స్థాయిలు కూడా తక్కువగా ఉంటాయి.

అంతేకాదు ఎంత ఎక్కువ ఫైబర్ తింటే అంత మంచిదని కూడా అధ్యయనం సూచిస్తోంది.

- ఫైబర్ వల్ల శరీరానికి పెద్దగా ఉపయోగం లేదని అనుకుంటారు. కానీ ఫైబర్ ఫుడ్ కొద్దిగా తిన్నా కడుపు త్వరగా నిండినట్లు అనిపిస్తుంది. చిన్నపేగు కొవ్వును గ్రహించే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. ఇక పెద్దపేగుల్లో కోట్ల సంఖ్యలో ఉండే బ్యాక్టీరియాకు ఆహారం లభిస్తుంది.
- పెద్దపేగులో ఉన్న బ్యాక్టీరియా ఫైబర్‌ను పులియబెడుతూ అనేక రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరం మొత్తంపై ప్రభావం చూపుతాయి.



తాడోపేడో

- ఓడితే సిరీస్ ఆశలు గల్లంతే
- ఒత్తిడిలో రోహిత్‌సేన
- కివీస్‌తో రెండో టీ20 నేడే

వన్డేల్లో హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ సాధించిన భారత్, టీ20ల్లో సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడింది. ఆక్లాండ్‌లో నేడు రోహిత్‌సేన ఓడితే, పొట్టి సిరీస్‌పై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి. సొంతగడ్డపై టీమ్ ఇండియా చేతిలో టీ20 ఓటమెరుగని న్యూజిలాండ్ అదే రికార్డు కొనసాగించాలని భావిస్తోంది. భారీ స్కోర్ల ఈడెన్ పార్క్‌లో నేడు టీమ్ ఇండియా తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది.

ఆక్లాండ్

న్యూజిలాండ్ పర్యటనలో తిరుగులేని విజయాలు సాధించిన టీమ్ ఇండియా, అదే సమయంలో దారుణ పరాజయాలు చవిచూసింది. హామిల్టన్ వన్డేలో మిగిలి ఉన్న బంతుల పరంగా భారీ ఓటమి చవిచూడగా, వెల్లింగ్టన్‌లో పరుగుల తేడా పరంగా భారీ పరాజయం ఎదురైంది. హామిల్టన్ పరాభవం తర్వాతి వన్డేలో కావాలనే ప్రతికూల పరిస్థితుల్లో సవాల్ స్వీకరించిన టీమ్ ఇండియా, తగు రీతిలో కివీస్‌కు బదులిచ్చింది. ఇప్పుడు టీ20ల్లోనూ అదే పునరావృతం చేయాలని టీమ్ ఇండియా ఎదురుచూస్తోంది. సిరీస్ కోసం న్యూజిలాండ్, సిరీస్‌పై ఆశల కోసం టీమ్ ఇండియా విజయంపై కన్నేయగా నేడే ఆక్లాండ్ టీ20 పోరు.

రోహిత్ మెరిసేనా? : గత మూడు మ్యాచుల్లో రోహిత్ శర్మ స్కోర్లు వరుసగా 7, 2, 1. భారీ స్కోర్ల హిట్టర్ రోహిత్ స్వతహాగా ఇటువంటి వైఫల్యాలను ఎక్కువ కాలం కొనసాగించేందుకు ఇష్టపడడు. కెప్టెన్‌గా తొలి సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడిన రోహిత్.. నేడు తుది జట్టు కూర్పులో నాయకత్వ వ్యూహంతో పాటు బ్యాట్స్‌మన్‌గానూ చెలరేగేందుకు సిద్ధమవుతున్నాడు. రోహిత్ శర్మ తనదైన ఇన్నింగ్స్ ఆడితే, సిరీస్‌పై టీమ్ ఇండియాకు ఎటువంటి బెంగ ఉండక్కర్లేదు!. భారీ స్కోర్ల మ్యాచ్‌లో అదనపు బ్యాట్స్‌మన్ లేదా మరో మణికట్టు స్పిన్నర్‌ను తీసుకోవాలా అనేది ప్రశ్నార్థకమైంది. తొలి మ్యాచ్‌లో చాహల్ తక్కువ పరుగులిచ్చాడు. అతడికి కుల్దీప్ సైతం తోడైతే, కివీస్‌ను కట్టడి చేసే వీలుంది. అందుకోసం టాప్ ఆర్డర్‌లో విజయ్ శంకర్ లేదా ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యలలో ఒకరు త్యాగం చేయాల్సి ఉంటుంది. హైదరాబాదీ సీమర్ మహ్మద్ సిరాజ్ తుది జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. ఖలీల్ అహ్మద్ స్థానంలో సిరాజ్ బంతి అందుకునే అవకాశం కనిపిస్తోంది.



సిరీస్ వేట : వన్డే సిరీస్‌ను ముందే కోల్పోయిన న్యూజిలాండ్, ఎట్టి పరిస్థితుల్లోనూ టీ20 సిరీస్‌ను వదులుకోకూడదనే సంకల్పలంతో కనిపిస్తోంది. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ వీరంగం తొలి మ్యాచ్‌లో కివీస్‌కు కలిసొచ్చింది. కెప్టెన్ విలియమ్సన్‌తో పాటు రాస్ టేలర్ సైతం దూకుడు మీదున్నాడు. భారీ షాట్లు బాదగల లోతైన బ్యాటింగ్ లైనప్ కివీస్‌కు అదనపు బలం. సీమర్ టిమ్ సౌథీ అసహజ ఆటగాడు. ప్రత్యేకించి టీ20ల్లో అతడు ఎప్పుడైనా ప్రభావం చూపగలడు. ఆల్‌రౌండర్ గ్రాండ్‌హోమె తన స్థానాన్ని జేమ్స్ నీషమ్ కోసం వదులుకునే పరిస్థితి. బ్యాట్‌తో, బంతితో మెరుగ్గా కనిపిస్తోన్న న్యూజిలాండ్ ఆక్లాండ్‌లోనే సిరీస్ అందుకోవాలని చూస్తోంది.

భారత్ X న్యూజిలాండ్ తొలి టీ20	
అమ్మాయిలు	ఉ॥ 7.30 నుంచి
అబ్బాయిలు	మ॥ 11.30 నుంచి

స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం...

పిచ్ రిపోర్టు : ఈడెన్ పార్క్ భారీ స్కోర్లకు వేదిక. నిరుడు ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 244 పరుగులను మరో ఏడు బంతులుండగానే ఛేదించింది. చిన్న బౌండరీల ఆక్లాండ్‌లో నేడూ భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే వీలుంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, శుభ్‌మన్ గిల్/విజయ్ శంకర్, రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య/కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్/మహ్మద్ సిరాజ్, యుజ్వేంద్ర చాహల్.

న్యూజిలాండ్ : టిమ్ సీఫర్ట్, కొలిన్ మన్రో, కేన్ విలియమ్సన్, రాస్ టేలర్, డార్లీ మిచెల్, జేమ్స్ నీషమ్/గ్రాండ్‌హోమె, మిచెల్ శాంట్నర్, స్కాట్, టిమ్ సౌథీ, ఇశ్ సోధి, లూకీ ఫెర్గుసన్.



రెస్ట్ సారథి రహానె

విదర్భతో ఇరానీ కప్

ముంబయి : రెస్టాఫ్ ఇండియాకు ముంబైకర్ అజింక్య రహానె కెప్టెన్సీ వహించనున్నాడు. ఈ మేరకు సీనియర్ సెలక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. రంజీ చాంపియన్ విదర్భతో ఇరానీ కప్ కోసం పోరాడే రెస్టాఫ్ ఇండియా జట్టును గురువారం ఎంపిక చేశారు. రంజీ ఫైనలిస్ట్ సౌరాష్ట్ర నుంచి బ్యాట్స్‌మన్ స్నేల్ పటేల్, స్పిన్నర్ ధర్మేంద్రసిన్హ జడేజాలు ఎంపికయ్యారు. తెలుగు కుర్రాడు హనుమ విహారి, కర్ణాటక బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్ సహా శ్రేయాష్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లు రెస్టాఫ్ ఇండియా తరపున ఆడనున్నారు. ఇంగ్లాండ్ లయన్స్‌తో రెండో నాలుగు రోజుల మ్యాచ్‌లో ఇండియా-ఎకు కెఎల్ రాహుల్ సారథ్యం వహించనున్నాడు.

రెస్టాఫ్ ఇండియా : అజింక్య రహానె (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, అన్మోల్‌ప్రీత్ సింగ్, హనుమ విహారి, శ్రేయాష్ అయ్యర్, ఇషాన్ కిషన్, కృష్ణప్ప గౌతమ్, ధర్మేంద్రసిన్హ జడేజా, రాహుల్ చాహర్, అంకిత్ రాజ్‌పుత్, తన్వీర్ ఉల్ హక్, రోనిత్ మోరే, సందీప్ వారియర్, రింకూ సింగ్, స్నేల్ పటేల్.

మెరిసిన మీరాభాయి


- పునరాగమనంలో స్వర్ణం

న్యూఢిల్లీ : యువ వెయిట్ లిఫ్టర్, కామన్‌వెల్త్ గోల్డ్ మెడలిస్ట్ శిఖోమ్ మీరాభాయి చాను పునరాగమనంలో మెరిసింది. గాయంతో కొన్నాండ్లుగా వెయిల్ లిఫ్టింగ్‌కు దూరమైన మీరాభాయి, ఈజీఏటీ కప్‌తో రీ ఎంట్రీ ఇచ్చింది. 49 కేజీల విభాగంలో 192 కేజీల బరువెత్తిన చాను స్వర్ణ పతకం సొంతం చేసుకున్నది. స్నాచ్‌లో 82 కేజీలు ఎత్తిన మీరా, క్లీన్ అండ్ జర్క్‌లో 110 కేజీలు అలవోకగా ఎత్తేసింది. ' గాయం నుంచి కోలుకున్న ఇదే తొలి అంతర్జాతీయ టోర్నీ. వంద శాతం ఫిట్‌గా ఉన్నాను. ఇది నా అత్యుత్తమ ప్రదర్శన కాదు. అయినా, ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నాను' అని చాను తెలిపింది. థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మాయ్ సిటీలో జరుగుతున్న ఈ పోటీలో స్వర్ణ పతక ప్రదర్శన 2020 ఒలింపిక్స్ అర్హత కోసం మీరాకు ఉపయోగపడనున్నది.



స్టార్క్ లేని ఆస్ట్రేలియా

- భారత పర్యటనకు జట్టు ఎంపిక



మెల్‌బోర్న్ : స్టార్ సీమర్ మిచెల్ స్టార్క్ లేకుండానే ఆస్ట్రేలియా జట్టుకు భారత పర్యటనకు రానున్నది. ఛాతి ఎడమ వైపు కండరాల నొప్పితో బాధపడుతున్న మిచెల్ స్టార్క్ కోలుకుంటున్నాడు. మరింత విశ్రాంతినిచ్చి, యుఎఈలో పాకిస్థాన్‌తో సిరీస్‌కు జట్టులోకి తీసుకోవాలని క్రికెట్ ఆస్ట్రేలియా భావించింది. స్టార్క్ స్థానంలో జై రిచర్డ్‌సన్ జట్టులో చోటు సాధించాడు. మరో పేసర్ జోశ్ హెజిల్‌వుడ్ సైతం జట్టులో చోటు కోల్పోయాడు. షాన్ మార్ష్ టీ20లకు దూరమైనా, వన్డే సిరీస్‌కు అందుబాటులోకి రానున్నాడు. అతడి సోదరుడు మిచెల్ మార్ష్ చోటు గల్లంతైంది. ఇటీవల భారత్‌తో స్వదేశంలో ఆడిన జట్టులో 14 మందిలో 11 మంది తాజా సిరీస్‌లో నిలిచారు. అరోన్ ఫించ్‌కు డిప్యూటీలుగా అలెక్స్ కారే, పాట్ కమిన్స్‌లు ఎంపికయ్యారు. 2019 ప్రపంచకప్‌కు ముందు భారత పర్యటనకు వస్తోన్న ఆస్ట్రేలియా ఇక్కడ రెండు టీ20, ఐదు వన్డేలు ఆడనున్నది. ఫిబ్రవరి 24న విశాఖలో తొలి టీ20, మార్చి 2న హైదరాబాద్‌లో తొలి వన్డేతో సిరీస్‌లు ఆరంభం కానున్నాయి. భారత పర్యటన ముగిసిన వెంటనే ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌తో తలపడనున్నది. మార్చి 29తో స్టీవ్ స్మిత్, డెవిడ్ వార్నర్‌లపై నిషేధం తొలగిపోతుంది. అప్పటి పరిస్థితులను బట్టి జట్టును ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది.

ఆస్ట్రేలియా జట్టు : అరోన్ ఫించ్ (కెప్టెన్), ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హాండ్స్‌కాంబ్, గ్లెన్ మాక్స్‌వెల్, ఆష్టన్ టర్నర్, మార్కస్ స్టోయినిస్, అలెక్స్ కారే, పాట్ కమిన్స్, నాథన్ కౌల్టర్ నైల్, జై రిచర్డ్‌సన్, కేన్ రిచర్డ్‌సన్, జేసన్ బెహన్‌డార్ఫ్, నాథన్ లైయాన్, ఆడం జంపా, ఆడీ ఆర్సీ షార్ట్ (టీ20లకు షాన్స్ మార్ష్ బదు).

జయహో విదర్భ

- రెండోసారి రంజీ ట్రోఫీ కైవసం
- ఆరు వికెట్లు కూల్చిన ఆదిత్య
- ఛేదనలో చేతులెత్తేసిన సౌరాష్ట్ర

విదర్భ నిరుడు రంజీ చాంపియన్‌గా నిలిచిన వేళ, ఆ విజయం గాలి వాటం అనేశారు. అదృష్టం కలిసొచ్చి విజయం విదర్భ వైపు నిలిచిందని పెదవి విరిచారు. నిలకడతో, జట్టు ప్రదర్శనలతో మరోసారి టైటిల్ సాధించిన విదర్భ విమర్శలకు తగు రీతిలో బదులిచ్చింది. ఆధిపత్యం చేతులు మారుతూ రసవత్తరంగా సాగిన రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్రను చిత్తు చేసి వరుసగా రెండో ఏడాది రంజీ చాంపియన్‌గా నిలిచింది. దేశవాళీ క్రికెట్‌లో విదర్భ అంకానికి తెరతీసింది.

నాగ్‌పూర్

విదర్భ వరుసగా రెండో ఏడాది రంజీ చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో టైటిల్ ఫేవరెట్ సౌరాష్ట్రను చిత్తు చేసి 78 పరుగులతో అద్భుత విజయం సొంతం చేసుకున్నది. టైటిల్ పోరులో సౌరాష్ట్ర పైచేయి సాధించిన ప్రతిసారీ విదర్భ మరింత బలంగా పుంజుకున్నది. 206 పరుగుల ఛేదనలో సౌరాష్ట్ర స్టార్ బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (0)ను డకౌట్ చేసి, నాల్గో రోజే మానసికంగా గెలుపొందిన విదర్భ, చివరి రోజూ చెమటోడ్చకుండానే లాంఛనం ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 58/5తో ఐదో రోజు ఆట మొదలెట్టిన సౌరాష్ట్ర 127 పరుగులకు కుప్పకూలింది. విశ్వరాజ్ జడేజా (52) అర్థ సెంచరీతో విదర్భ విజయాన్ని కాస్త ఆలస్యం చేశాడు. టెయిలెండర్లను అలవోకగా సాగనంపిన విదర్భ లంచ్‌లోపే ట్రోఫీని ముద్దాడింది. విదర్భ సీమర్ ఆదిత్య సార్వాటె (6/59) ఆరు వికెట్ల ప్రదర్శన సౌరాష్ట్ర బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు కూల్చిన ఆదిత్య, బ్యాట్‌తోనూ రెండో ఇన్నింగ్స్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో అతడి పోరాటంతో విదర్భ పోరాడగలిగే పరుగులు చేయగల్గింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆదిత్య సార్వెటె ' మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

అతడే వ్యత్యాసం! : 40 ఏండ్ల వయసులో ముంబయి రంజీ తుది జట్టులో స్థానం భరోసా లేని సమయంలో విదర్భకు మారాడు వసీం జాఫర్. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 250 పైచిలుకు మ్యాచుల అపార అనుభవం, సుమారు 20 వేల పరుగుల రికార్డు (19147) జాఫర్ సొంతం. సహచర క్రికెటర్లు కోచ్‌లుగా స్థిరపడినా, అతడు మాత్రం ప్రొఫెషనల్ కెరీర్ కొనసాగిస్తున్నాడు. వరుసగా రెండు సార్లు విదర్భను రంజీ విజేతగా నిలుపటంలో అతడి పాత్ర అమోఘం. నిజానికి ఫైనల్లో వసీం జాఫర్ బ్యాట్‌తో పోషించిన పాత్ర అత్యంత పరిమితం. కానీ ఒత్తిడి సమయాల్లో, ప్రత్యర్థి పైచేయి సాధించిన సెషన్లలో బౌలర్లలో స్థైర్యం నింపిన తీరు అమోఘం. అందుకే 11 వికెట్లు కూల్చిన ఆదిత్య సార్వాటె మెరుపు ప్రదర్శన ఘనతను జాఫర్‌కు కట్టబెట్టాడు. జట్టులో స్ఫూర్తి నింపుతూ జాఫర్ విదర్భను ఏ దశలోనూ వెనక్కి తగ్గనీయలేదు. తొలి ఇన్నింగ్స్ పతనం తర్వాత పుంజుకున్నా, స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకున్నా అందులో బౌలర్లలో జాఫర్ నింపిన అద్వితీయ ఆత్మవిశ్వాసమే. తుది జట్టులో చోటు దక్కుతుందనే భరోసాతో విదర్భకు వచ్చిన వసీం జాఫర్ లేటు వయసులో వరుసగా రెండు సార్లు రంజీ ట్రోఫీని అందుకోవటం అద్భుతమే.



సంక్షిప్త స్కోర్లు : విదర్భ తొలి ఇన్నింగ్స్ : 312/10 (అక్షయ్ కర్నేవర్ 73, వాడేకర్ 45, జైదేవ్ ఉనద్కత్ 3/54)

సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ : 307/10 (స్నేల్ పటేల్ 102, జైదేవ్ ఉన్కదత్ 46, ఆదిత్య సార్వాటె 5/98,అక్షయ్ వాకారె 4/80)

విదర్భ రెండో ఇన్నింగ్స్ : 200/10 (ఆదిత్య సార్వాటె 49, మోహిత్ కాలె 38, ధర్మేంద్రసిన్హ జడేజా 6/96)

సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్ : 127/10 (విశ్వరాజ్ జడేజా 52,

కార్పొరేట్ల గుప్పెట్లో ప్రజారోగ్యం

ప్రజల ఆరోగ్యంపై మొన్నటి కేంద్ర బడ్జెట్ పెద్దగా పట్టించుకున్న దాఖలా కనపబడటం లేదు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఒకదాన్ని చూపి చేతులు దులుపుకున్నారు. మిగతా ఆరోగ్య సేవల్ని పెద్దగా పట్టించుకోలేదన్నది బడ్జెట్ ప్రాధాన్యతలు చూస్తే ఎవరికైనా తెలిసిపోతుంది. బీమా సేవలతో ప్రయివేటు బీమా కంపెనీలు లాభపడతాయి తప్ప, ప్రజారోగ్యం బాగుపడదు. మనం నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించలేం.

– సామాజిక సేవా సంస్థ 'జన స్వస్థ అభియాన్', వైద్యనిపుణులు

ఆయుష్మాన్ భారత్‌కు అధిక కేటాయింపులు

- జాతీయ ఆరోగ్య మిషన్ పక్కకు..
- బీమా పథకంతో ప్రయివేటు కంపెనీలకు లబ్ది : వైద్యరంగ నిపుణులు
- ప్రజారోగ్యం, మహిళలకు దక్కని కనీస కేటాయింపులు

న్యూఢిల్లీ : తాత్కాలిక బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి మోడీ సర్కార్ చేసిన కేటాయింపులు వైద్యరంగ నిపుణుల్ని, సామాజిక సేవా సంస్థల్ని తీవ్రంగా నిరుత్సాహపర్చింది. ఆయుష్మాన్ భారత్ (బీమా పథకం) ఒక్కటే సర్వరోగ నివారిణి అన్నట్టుగా కేంద్రం భావించటం తప్పులో కాలేసినట్టేనని, సామాజిక సేవా సంస్థ 'జన స్వస్థ అభియాన్'(జేఎస్ఏ), వైద్యరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్య కార్యక్రమాలకు బడ్జెట్ ఇచ్చిన ప్రాధాన్యత, కేటాయింపులపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్‌కు అతిగా ప్రాధాన్యత ఇవ్వటం ముందు ముందు ఆరోగ్యరంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందనీ, వ్యవస్థకు తీరని నష్టం తీసుకొస్తుందనీ జేఎస్ఏ వైద్యులు,



ఇతర నిపుణులు ఒక ప్రకటన కూడా విడుదల చేశారు.

మొత్తంగా చూస్తే ఈసారి బడ్జెట్‌లో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు (జాతీయ ఆరోగ్య మిషన్) కేటాయింపులు తగ్గించారు. ఆయుష్మాన్ భారత్(బీమా సేవలు)పై ఎక్కువ ఫోకస్ పెట్టారు. స్త్రీ, శిశు సంక్షేమం, మహిళల ఆరోగ్యాన్ని ఏమాత్రమూ సీరియస్‌గా తీసుకోలేదు. అన్న...మూడు పాయింట్లను వైద్యరంగ నిపుణులు, సామాజిక కార్యకర్తలు, జన స్వస్థ అభియాన్ వంటి సంస్థలు లేవనెత్తుతున్నారు.

61 నుంచి 49శాతానికి తగ్గించారు

ఉదాహరణకు...జాతీయ ఆరోగ్య మిషన్(ఎహెచ్ఎం)కు ఏటా ఏటా ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్నారు. 2014లో మొత్తం ఆరోగ్య బడ్జెట్‌లో ఎన్‌హెచ్ఎంకు 61శాతం నిధులు దక్కాయి. 2019 బడ్జెట్ వచ్చేసరికి ఎన్‌హెచ్ఎంకు 49శాతం మాత్రమే నిధులు కేటాయించారు. ఇక 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమాన్నే తీసుకుంటే...ఇందులో రెండున్నాయి. ఒకటి బీమా సేవలు. దీని ద్వారా అర్హులైనవారి కుటుంబానికి రూ.5లక్షల వరకూ ఆరోగ్య బీమా లభిస్తుంది. అయితే రోగి 'ఇన్ పేషంట్'గా ఉన్నప్పుడు మాత్రమే వర్తిస్తుంది. ఇక రెండోది...హెల్త్, వెల్‌నెస్ కేంద్రాల్ని పెద్ద సంఖ్యలో ఏర్పాటుచేసి ఆరోగ్య సేవల్ని విస్తరిస్తామని మోడీ సర్కార్ వాగ్దానం చేసింది.



1.5లక్షల సబ్ సెంటర్లను హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా మార్చడానికి గతంలో రూ.1600 కోట్లు కేటాయించారు. అయితే ఈ నిధుల్లో ఎక్కువగా 'అప్ గ్రేడేషన్‌'కే పోయింది. గత బడ్జెట్‌తో పోల్చితే, కొత్తగా మెడికల్ కాలేజీల ఏర్పాటు, జిల్లా హాస్పిటల్స్ అప్‌గ్రేడేషన్‌కు వెచ్చిస్తున్న నిధుల్లో 40 శాతం తగ్గించారు.

పెరిగిందంతా 'బీమా'కే

ఈ ఏడాది ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి కేటాయింపులు 13శాతం పెంచారు. తద్వారా వచ్చిన రూ.7వేల కోట్లలో 'ఆయుష్మాన్ భారత్'కు వెళ్తున్న నిధులు రూ.6400కోట్లు. గతేడాది బడ్జెట్‌తో పోల్చితే బీమా సేవలకు 167శాతం నిధులు పెంచారు. ఇలా ఆయుష్మాన్ భారత్ కార్యక్రమానికి కేటాయించిన నిధుల్లో అత్యధికం ప్రయివేటు బీమా కంపెనీలకు లబ్ది చేకూర్చుతుంది తప్ప, ప్రజారోగ్య వ్యవస్థకు పెద్దగా మేలు చేయదని వైద్య రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీమా సేవలకు అతి ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా ఆరోగ్యరంగంలో మంచి ఫలితాలు రాబట్టలేమని వారు అభిప్రాయపడ్డారు.

స్త్రీ, శిశుసంక్షేమం, ప్రసూతికి కోత పెట్టారు

తమ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా పియూష్ గోయల్ చెప్పుకొచ్చారు. మాటల్లో చెప్పింది రాతల్లో మాత్రం కనపబడలేదు. మహిళల ఆరోగ్యరక్షణకు సంబంధించి ఎలాంటి శ్రద్ధా చూపలేదు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఉన్న స్త్రీ, శిశుసంక్షేమ కార్యక్రమాలకు రూ.4200కోట్లు కోతపెట్టారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.